మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 90 • పేజీలు:12+16 • వెల: రూ.5 | బుధవారం • 28-2-2018 | www.manamnews.com | /manamnews

రేపు హోలీ సెలవు దినం

- ఎల్లుండి ఆప్షనల్ హోలీడే

3లో..



టిస్ విద్యార్థుల ఆమరణ దీక్ష

- ఉపకార వేతనాల రద్దు నిర్ణయంపై నిరసన
- ఏడో రోజూ కొనసాగిన ఆందోళనలు
- దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల మద్దతు

2లో..



నాగాలాండ్ 75% మేఘాలయ 67%

- రెండు రాష్ట్రాల్లో ఎన్నికల పోలింగ్ సమాప్తం
- తొలి ఐదుగురు ఓటర్లకు ప్రోత్సాహక పతకం

7లో..

ఆరు నూరైనా సింగరేణిని ప్రైవేటీకరించం

ప్రాణం పోయినా సరే.. అడ్డుకుంటాం

- కేంద్రం వాటా ఇచ్చయినా కాపాడుకుంటాం
- కార్మికులు సైనికులతో సమానం: కేసీఆర్
- సింగరేణి కార్మికులపై సీఎం వరాల జల్లు
- దశలవారీగా 10 వేల క్వార్టర్ల నిర్మాణం
- విద్యుత్, నీటి బిల్లులు పూర్తిగా మాఫీ
- సింగరేణి భూముల్లో ఇండ్లకు పట్టాలు
- మార్చి తొలివారం నుంచి మెడికల్ బోర్డు
- ఆరు భూగర్భ గనులకు శంకుస్థాపన



సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

కేంద్రంతో యుద్ధానికి సై

పార్లమెంట్ సమావేశాల్లో పోరాడుతాం

దేశవ్యాప్తంగా మోదీ హవా తగ్గుతోంది

జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతాం: కేసీఆర్

వివరాలు 6లో..



సీఎం హెలికాప్టర్‌కు తప్పిన ముప్పు

గాల్లోకి లేస్తుండగా బ్యాగులో మంటలు.. దూరంగా విసిరేసిన సిబ్బంది

ఉత్తర తెలంగాణ భవన్ ముందు ఘటన.. మరోసారి హెలికాప్టర్‌లో క్షుణ్ణంగా తనిఖీ

ఆపై ప్రయాణానికి అధికారుల అనుమతి.. వైర్‌లెస్ కిట్‌లో షార్ట్ సర్క్యూటే కారణం

విచారణ జరుగుతోంది: డీజీపీ.. ఆల్ ఈజ్ వెల్.. సీఎం కేసీఆర్ క్షేమం: కేటీఆర్ ట్వీట్

6లో..



శ్రీదేవి భౌతికకాయంగా భావిస్తున్న చిత్రం

కేసు క్లోజ్

ముంబైకి చేరిన శ్రీదేవి మృతదేహం

- అనుమానాలు లేవన్న పోలీసులు
- ప్రమాదవశాత్తు మరణమని వెల్లడి
- స్పృహతప్పి బాత్‌టబ్‌లో మునక
- మృతికి కారణం అదేనని స్పష్టత
- దుబాయ్‌లోనే ఎంబామింగ్ ప్రక్రియ
- నేడు ముంబైలో నటి అంత్యక్రియలు



దుబాయ్, ఫిబ్రవరి 27:

శ్రీదేవి చనిపోయిందా.. ఎవరైనా చంపేశారా అన్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. స్పృహతప్పి.. ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగిపోవడం వల్లే శ్రీదేవి మరణించారని, అందులో ఎలాంటి కుట్రకోణం గానీ వేరే అనుమానాలు గానీ లేవని దుబాయ్ ప్రాసిక్యూషన్ విభాగం తేల్చిచెప్పింది. ఎంబామింగ్ మిగతా 6లో..

ఇదీలోకం!



ఢిల్లీ అనగానే అంత భయమెందుకు.. పిలిపిస్తుంది కేజ్రీవాల్ ప్రభుత్వం కాదు.. కేంద్ర ప్రభుత్వం సార్..!

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. చలిగాలుల తీవ్రత తగ్గుతుంది. గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 19 డిగ్రీలు

గాలిలో తేమ: 36 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి ఉ.11.46 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఆశ్లేష రా.1.42 తదుపరి మఖ; వర్జ్యం: మ.3.30-4.58; దుర్ముహూర్తం: మ.12.06-12.52; రాహుకాలం: మ.12.29-1.56; అమృతఘడియలు: రా.10.02-11.29; శుభసమయం: మ.1.58-3.00.

సూర్యోదయం: 6.39

సూర్యాస్తమయం: 6.19

ఏప్రిల్‌లో పాదయాత్ర

అలంపూర్ టు ఆదిలాబాద్

- 119 నియోజవర్గాలను చుట్టివస్తా
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తా
- పాదయాత్రలో బహిరంగ సభలు వద్దు
- రైతు సమితులు కాదు.. రౌడీ సమితులు
- రైతుకు ఎకరాకు 4 వేలు ఓట్ల కోసమే
- ప్రాజెక్టుల పేరు మార్చి ఖర్చు పెంచారు
- ఇచ్చిన హామీలు మరిచి కొత్తవి గుప్పిస్తున్నారు
- టీఆర్ఎస్ సర్కారుపై డీకే అరుణ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు మిగతా 6లో..



తాండూరు సభలో ప్రసంగిస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

అధికారం మాదే

- వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తాం
- కేంద్ర, రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- 'బంగారు తెలంగాణ' ఎవరికి వచ్చింది?
- కేసీఆర్ కుటుంబానికే నెరవేరిందా?: ఉత్తమ్
- రైతులకు ఒకేసారి రుణమాఫీ: జైపాల్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి):

వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించి అధికారంలోకి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ ఎవరికి వచ్చిందని, ఒక్క కేసీఆర్ కుటుంబానికే వచ్చిందా? అని ప్రశ్నించారు. బస్సు యాత్రలో భాగంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా మిగతా 9లో..

నిమిషం లేటైనా నో ఎంట్రీ

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 8:45కు పరీక్ష ప్రారంభం
- ఆపై 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్
- తొమ్మిది దాటితే వెనుదిరగాల్సిందే
- 9,63,546 విద్యార్థుల కోసం 1294 కేంద్రాలు
- హాల్‌లో సీసీ కెమెరాలు, జామర్లు
- పకడ్బందీగా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు

6లో..



హజ్ యాత్రికులకు ఊరట

విమాన చార్జీల్లో భారీ తగ్గింపు.. ముంబై నుంచి రానుపోను 57 వేలే

- రూ.98 వేల నుంచి దిగొచ్చిన చార్జీ
- పీఎంవో కీలక నిర్ణయం: నఖ్వీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:

గత నెలలో హజ్ యాత్రికులకు సబ్సిడీని తొలగించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా భారీ ఉపశమనాన్ని ప్రకటించింది. హజ్‌కు వెళ్లే ముస్లింలకు విమాన చార్జీల్లో భారీగా తగ్గింపునిచ్చింది. భారత్‌లోని 21 విమానాశ్రయాల నుంచి జెద్దా, మదీనా వెళ్లే యాత్రికులకు ఇది వర్తిస్తుంది. అయితే వారు ఎయిరిండియా, సౌదీ ఎయిర్‌లైన్స్, ఫ్లైనాస్ సంస్థల విమానాల్లో వెళ్తేనే ఈ తగ్గింపు పొందుతారు. దీనిపై ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) తాజా నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని మంగళవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ మిగతా 9లో..





కాళేశ్వరంలో సందర్శనలో ఎంపీ కవిత

దేశంలోనే అద్భుతం

కాళేశ్వరం పూర్తైతే తరతరాలు అభివృద్ధి చెందుతాయి: ఎంపీ కవిత

- మేడిగడ్డ బ్యారేజీ పనుల పరిశీలన
- శరవేగంగా ప్రాజెక్టు నిర్మాణం

మహదేవ్‌పూర్, ఫిబ్రవరి 27(మనం న్యూస్):

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే భవిష్యత్తుతరాలు అభివృద్ధి చెందుతాయని నిజామాబాద్ ఎంపీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కాళేశ్వరం మిగతా 6లో..

ప్రాణం తీసిన వివాహేతర బంధం

- ప్రియుడి చేతిలో హత్యకు గురైన వివాహిత
- నిందితునిపై రేప్, హత్య కేసులు నమోదు


నల్ల అనిత (ఫైల్‌ఫోటో)

దుగ్గొండి, ఫిబ్రవరి 27 (మనం న్యూస్): వివాహేతర సంబంధం ఓ వివాహిత ప్రాణం తీసింది. భర్తను కాదని ఆమె నమ్మిన ప్రియుడే ప్రాణం తీశాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయ్ గ్రామంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. నర్సంపేట రూరల్ సీఐ బోనాల.కిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్ల నర్సయ్య, అనిత(30)కు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు తొగర్రాయ్ గ్రామంలో ఉంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె రిజ్వానాకు వివాహం అయ్యింది. కారు అశోక్ అనే వ్యక్తితో అనితకు వివాహేతర సంబంధం ఉంది. అయితే ఈ నెల 25వ తేదీ ఆదివారం సాయంత్రం అశోక్, అనిత గ్రామ శివారులోని ఓ పొలం వద్ద కలిశారు. అక్కడ వారిద్దరూ గొడవ పడ్డారు. అశోక్ దాడి చేయడంతో అనిత గాయపడి స్పృహ కోల్పోయింది. అశోక్ వెంటనే నల్ల నర్సయ్యకు ఫోన్ చేసి సంఘటనా స్థలానికి రప్పించాడు. అనితకు దేవుడు పూనాడని, స్పృహ కోల్పోయిందని అశోక్ వారికి చెప్పాడు. సంఘటనా స్థలానికి వచ్చిన నర్సయ్య ఓ ఆటోను పిలిపించుకుని అందులో అనితను ఇంటికి తీసుకొచ్చాడు. అనిత స్పృహలోకి రాకపోవడంతో అర్ధరాత్రి సమయంలో వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా అనిత మరణించింది. మృతురాలి బంధువులు అనిత శరీరంపై గాయాలు, నలిగిన దుస్తులను చూసి అశోక్‌పై అనుమానం వ్యక్తం చేశారు. అనితపై అత్యాచారం చేసి ఆపై చంపి ఉంటాడని భావించారు. ఈ మేరకు మృతురాలి బావ నల్ల సారయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై నిర్భయ చట్టంకింద అత్యాచారం, హత్య కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సంఘటనా స్థలాన్ని నర్సంపేట ఏసీపీ సునితా మోహన్ పరిశీలించారు. మృతురాలి దహన సంస్కారాలు పూర్తయ్యేవరకు పోలీసులు గ్రామంలోనే ఉన్నారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా చూశారు.

శిశుమందిరాల్లో ఈ ఏడు.. 18 మంది పసికందుల మృతి: ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం లీగల్ ప్రతినిధి): చెత్త కుండీలు, రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రాంతాల్లో దయనీయ స్థితిలో దొరికి శిశుమందిరాలకు చేరిన పసికందుల్లో ఈ ఏడాది 18 మంది మరణించారని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు విన్నవించింది. ఈ పసికందులు దొరికనప్పటికే వారి ఆరోగ్య పరిస్థితులు విషమించాయి. వారి ప్రాణాలు నిలిపేందుకు వైద్యులు చేసిన అన్ని ప్రయత్నాలు ఫలించక పుట్టిన కొన్ని గంటలకో, రోజులకో తుదిశ్వాస విడిచారని తెలిపింది. ప్రభుత్వ ఆధీనంలోని శిశు మందిరాల్లో 40 మంది పిల్లలు చనిపోయారని, శిశువుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆ వ్యాజ్యాన్ని మరోసారి విచారణ చేపట్టింది. గతంలో బెంచ్ ఆదేశాల మేరకు తెలంగాణ సర్కార్ ఏడాది కాలంలో 18 మంది నవజాత శిశువులు దొరికిన కొద్ది కాలానికే లోకాన్ని విడిచారని తెలిపింది. శిశు మందిరాల్లోని ఇతర పిల్లలకు పౌష్టికాహార సమస్యలేమీ లేవని, వారంతా ఆరోగ్యంగానే ఉన్నారని, శిశుమందిరాల నిర్వహణ ప్రమాణాలతోనే ఉందని తెలిపింది. దీనిపై ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని తెలంగాణ సర్కార్ తరపు లాయర్ చెప్పారు. కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేయాలని సర్కార్‌ను ఆదేశించిన బెంచ్ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.


ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్, హోంమంత్రి

వెంకయ్యకు ఘన స్వాగతం

- నేటి నుంచి రెండు రోజుల పర్యటన

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పర్యటించనున్నారు. మంగళవారం ఉపరాష్ట్రపతి వాయుసేన ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 1.50 గంటలకు బేగంపేట విమానాశ్రయం చేరుకోగా, రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, హైదరాబాద్ జేసీ సంయుక్త కలెక్టర్ నిఖిల వెంకయ్యనాయుడుకు ఘనస్వాగతం పలికారు.

రాష్ట్రానికి 41.10 కోట్లు ఇన్సెంటివ్

- కేంద్ర తాగునీటి సరఫరా విభాగం అడ్వైజర్ దినేష్ చంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): సురక్షిత మంచినీటి సరఫరా విషయంలో దేశంలోని మిగిలిన రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర తాగు నీటి సరఫరా విభాగం అడిషనల్ అడ్వైజర్ దినేష్ చంద్ అన్నారు. 2018-19 వార్షిక తాగునీటి ప్రణాళిక సమావేశం మంగళవారం ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా దినేష్ చంద్ మాట్లాడుతూ 2022 నాటికి దేశంలో ప్రతి ఒక్కరికి సురక్షిత తాగు నీటి అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని, అయితే నాలుగేళ్ల ముందుగానే తెలంగాణ రాష్ట్రం ఆ ఘనత సాధించిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకాన్ని ఆయన గుర్తు చేశారు. దాదాపు రూ.30 కోట్ల ప్రజాధనాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ మిగిల్చిందన్నారు. అంతేకాక పలు పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను తెలంగాణ సమర్థవంతంగా ఖర్చు చేసిందన్నారు. దీంతో ఈ సంవత్సరానికి రూ.41.10 కోట్లు ఇన్సెంటివ్‌ను తెలంగాణకు ఇస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తక్షణమే ఆ నిధులను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఈఎన్ సి సురేందర్ రెడ్డి, మిషన్ భగీరథపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర తాగునీరు, పారిశుధ్య విభాగం డిప్యూటీ అడ్వైజర్ రాజశేఖర్, ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ కన్సల్టెంట్ నర్సింగరావు, ఈఈ మూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భోజగుట్టలో ప్రహరీ కూడా కట్టొద్దు: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం లీగల్ ప్రతినిధి): ఆసిఫ్‌నగర్ ఏరియాలోని భోజగుట్ట ప్రాంత భూముల్లో నిర్మాణాలే కాకుండా ప్రహరీని కూడా నిర్మించొద్దని ముస్తఫాహిల్స్ హౌసింగ్ సొసైటీనితాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల రద్దుకు కలెక్టర్ సిఫార్సుపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది. సొసైటీకి భూకేటాయింపుల్ని ప్రశ్నిస్తూ సీపీఎం నాయకుడు శ్రీనివాస్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.


తలసానికి వినతి పత్రం అందజేస్తున్న వరంగల్ యాదవ సంఘం నేతలు

యాదవులకు రాజ్యసభ సీటివ్వండి

- మంత్రి తలసానికి వరంగల్ యాదవ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి) : తెలంగాణలో త్వరలో ఖాళీ అవనున్న రాజ్యసభ సీట్లపై పోటి నెలకొంది. ఎవ రికి వారు తమ వర్గం నేతలకే దక్కాలని ప్లాన్ చెసుకొంటున్నారు. అయితే, యాదవులకు ఒక సీటును కేటాయించాలని కోరుతూ వరంగల్ యాదవ సంఘం నేతలు సుందర్ రాజ్ యాదవ్, బిక్షపతి యాదవ్‌లు సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మంగళవారం కలిశారు.

టిస్ విద్యార్థుల ఆమరణ దీక్ష

ఉపకార వేతనాల రద్దు నిర్ణయంపై నిరసన.. ఏడో రోజు కొనసాగిన ఆందోళనలు

- దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రద్దు చేస్తూ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) యాజమాన్యం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనలు మంగళవారం(ఏడో రోజూ) కూడా కొనసాగాయి. హైదరాబాద్ క్యాంపస్‌తో సహా ముంబయి, గౌహతి, తుల్జాపూర్ టిస్ క్యాంపస్‌లలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఆందోళనలు చేపట్టారు. ముంబయి టిస్ విద్యార్థి సంఘంతో ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపిన వర్సిటీ అధికారులు సమస్య పరిష్కారం పట్ల సానుకూలంగా స్పందించకపోవడంతో విద్యార్థులు తమ ఆందోళనలు ఉధృతం చేశారు. టిస్ హైదరాబాద్ క్యాంపస్‌లో చదువుతున్న శర్వన్ కుమార్, మాన్షి కుమారి, రక్షిత శ్రీ, ఆఫ్రిన్ షిరాజ్, అలోకానంద బిసోయ్, అంగద్ ఖోసై అమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. వీరికి మద్దతుగా బుధవారం తాము కూడా దీక్షలో కూర్చోనున్నట్లు మరికొంతమంది విద్యార్థులు వెల్లడించారు. ఈ సందర్భంగా అలోకానంద మాట్లాడు తూ.. దళిత, మైనారిటీ, బలహీన వర్గాలకు విద్యను దూరంచేసేందుకే ఇలాంటి విధానాలను ముందుకు తెస్తున్నారని ఆరోపించారు. ఓవైపు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం హైదరాబాద్ క్యాంపస్‌లో కనీస సదుపాయాలు కూడా కల్పించడంలేదని మండిపడ్డారు. విద్యార్థినులకు సరైన రక్షణకూడా లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరిస్తామని కాలేజీ యాజమాన్యం హామీనిచ్చేంతవరకు తమ ఆందోళనలు విరమించేదిలేదని స్పష్టం చేశారు. టిస్ అధ్యాపకులు కూడా విద్యార్థులకు తమ సంఘీభావం తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వర్సిటీల విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు టిస్ విద్యార్థుల ఆందోళనలకు మద్దతు ప్రకటిస్తున్నారు. కాలేజీలో చేరేముందు ఫీజులేమీ కట్టవలసిన అవసరంలేదని చెప్పిన యాజమాన్యం, ప్రభుత్వంనుంచి నిధులు రావట్లేదన్న సాకుతో ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నందున ఈ నెల 21 నుంచి విద్యార్థులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ఉన్న 4 టిస్ క్యాంపస్‌లలో దాదాపు 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.





టిస్ యాజమాన్య నిర్ణయానికి నిరసనగా ఆమరణ నిరాహార దీక్షకు కూచున్న విద్యార్థులు.. (పక్కన) దీక్షలో కూచున్న విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యుడు

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి


గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి చందూలాల్

భూపాలపల్లి, ఫిబ్రవరి 27(మనం న్యూస్): ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర గిరిజన అభివృద్ధి, పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ మంత్రి ఆజ్మీరా చందూలాల్ అన్నారు. ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి మంగళవారం ఆయన భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. పలు మండలాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చందూలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న వంతెనలను నవంబర్ నెలఖారుకు ప్రారంభిస్తామన్నారు. బీరెల్లి, పస్రా బ్రిడ్జిలను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ములుగు మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎస్సీ సామాజిక భవనాన్ని కోటి రూపాయలతో నిర్మిస్తామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా తాడ్వాయి మండలంలోని వెంగళాపూర్ గోనెపల్లి గ్రామాల మధ్య జంపన్న వాగుపై రూ.4కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కాజ్‌వే పనులకు, గోవిందరావుపేట మండలం మెట్లగూడెం వద్ద జంపన్న వాగుపై రూ.3.89 కోట్లతో నిర్మించనున్న కాజ్‌వే నిర్మాణానికి, ములుగులో ఎస్సీ సామాజిక భవనం నిర్మాణానికి, వెంకటాపురం (ములుగు) కేశవాపుర్‌లో బీటీరోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆజ్మీరా ప్రహ్లాద్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పాల బుచ్చయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


భూపాలపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి చందూలాల్

ప్రభోద్ పాండా మృతి

- సంతాపం తెలిపిన చాడ



హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): కమ్యూనిస్ట్ నేత, సీపీఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ప్రభోద్ పాండా(72) గుండెపోటుతో మంగళవారం కన్నుమూశారు. కలకత్తాలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఉండగానే ఆయన గుండెపోటుకు గురయి మరణించారు. మిడ్నాపూర్ నియోజకవర్గం నుంచి ఆయన మూడు పర్యాయాలు ఎంపీగా పనిచేశారు. ఆయన మృతిపట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, పార్టీ నాయకులు సంతాపం తెలియజేశారు. బెంగాల్‌లో పార్టీ నిర్మాణానికి ప్రభోద్ పాండా ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు.

తెలంగాణలో నిరంకుశ పాలన

- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు
- రైతు సమన్వయ సమితులతో మోసం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



వరంగల్, ఫిబ్రవరి 27 (మనం బ్యూరో): గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. హన్మకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతుందన్నారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన రైతు సదస్సు సందర్భంగా కూడా అక్రమంగా అరెస్టులకు పాల్పడ్డారని విమర్శించారు. కేసీఆర్ ఎక్కడ పర్యటిస్తే అక్కడ అక్రమ అరెస్టులకు పాల్పడడం నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. రైతు ఆత్మహత్యలకు కేసీఆర్ ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. రైతు సమన్వయ సమితుల పేరుతో టీఆర్ఎస్ కార్యకర్తలకు లబ్ధి చేకూరుస్తూ కొత్త నాటకమాడుతున్నారన్నారు. మార్కెట్ చైర్మన్ల జీతాలు అమాంతం పెంచారని, అధికారం చేతిలో ఉంది కదా అని టీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులు నిధులు తోడి పెడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రం లోటు బడ్జెట్‌లోకి వెళ్లిందన్నారు. గత రెండునెలలుగా వృద్ధాప్య, వితంతు ఫించన్లను ఇవ్వడం లేదన్నారు. ప్రజాధనాన్ని కేసీఆర్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య తదితరులు పాల్గొన్నారు.


సీఎస్ ఎస్‌కే జోషికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

ఉద్యోగాల భర్తీ చేపట్టండి

- నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు
- సీఎస్ ఎస్‌కే.జోషికి ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య వినతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ జోషిని కలిసి మంగళవారం ఓ వినతి పత్రం సమర్పించారు. గ్రూప్ 1,3,4 ఉద్యోగాలకు, డీఎల్, జేఎల్ ఉద్యోగాలకు సంబంధించి రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా నోటిఫికేషన్లు లేవని కృష్ణయ్య సీఎస్‌కు చెప్పారు. ఉద్యోగాలు భర్తీ కోసం నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్రంలో దాదాపు 8లక్షల మంది విద్యార్థులు ఆయా ఈ పోస్టులకు సిద్ధమవుతున్నారని సీఎస్‌కు తెలిపారు. రాష్ట్రంలో గ్రూప్-1 లో 18 సర్వీసుల కింద దాదాపు 1200 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గ్రూప్-3లో ఎనిమిదివేల పోస్టులు, గ్రూప్-4లో దాదాపు 35వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇన్ని స్థానాలు ఖాళీగా ఉండడం వల్ల ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందన్నారు. అలాగే 1500 జూనియర్ లెక్చరర్లు, 2200 డిగ్రీ లెక్చరర్ల పోస్టులు సహా వివిధ వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుకూడా భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు గ్రూప్-1, 2 పోస్టుల సంఖ్యను దశల వారీగా తగ్గిస్తున్నాయని, 1976లో 50శాతంగా ఉన్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాను దశలవారీగా తగ్గిస్తూ 30శాతానికి తగ్గించారని కృష్ణయ్య అన్నారు. వెంటనే 50శాతం కోటాను పునరుద్ధరించాలని ఆయన సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా, త్వరలో శాఖల వారీగా ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని సీఎస్ హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు.



కన్నతండ్రిపై లైంగిక వేధింపుల కేసు

- తప్పడు ఆరోపణలతో కూతురి ఫిర్యాదు
- ఇంట్లో ఘర్షణను అడ్డుకునేందుకే.. తప్పడు కేసు పెట్టానన్న యువతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: చిన్నారులపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు చేసిన చట్టాలను ఓ యువతి తెలివిగా ఉపయోగించుకుని న్యాయమూర్తుల ప్రశంసలు పొందింది. నిత్యం ఇంట్లో జరుగుతున్న ఘర్షణకు, తండ్రి వేధింపులకు చెక్ పెట్టింది. తండ్రి పైనే తప్పుడు కేసు పెట్టడం సమర్థనీయం కాకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో చేసిన పనంటూ కోర్టుకూడా ఆ యువతినే సమర్థించింది. పదిహేడేళ్ల ఆ విద్యార్థిని ధైర్యాన్ని అభినందించింది. ఈ కేసు వివరాలు.. లైంగిక వేధింపుల నిరోధక చర్యల్లో భాగంగా ఢిల్లీలోని ఓ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేధింపుల గురించి, ఆ పరిస్థితి ఎదురైనపుడు ఏంచేయాలన్న విషయంపైన, చట్టపరంగా బాలల హక్కుల రక్షణకున్న ఏర్పాట్లు తదితర అంశాలను నిపుణులు వివరించారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టం సీరియస్‌గా పరిగణిస్తుందన్నారు. మిగతా విషయాల మాటెలా ఉన్నా ఈ చివరి మాట మాత్రం ఓ అమ్మాయి మనస్సులో బలంగా నాటుకుంది. ఇంట్లో తండ్రి ఆగడాలను నియంత్రించాలంటే లైంగిక వేధింపుల కేసు పెట్టాలని నిర్ణయించుకుంది. తల్లితో సంప్రదించాక ఇద్దరూ కలిసి పోలీసులను ఆశ్రయించారు. తండ్రి తనను లైంగికంగా వేధిస్తున్నట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు ఆ తండ్రిని తీసుకెళ్లి లోపలపడేశారు. విచారణలో.. తాగొచ్చి తండ్రి తిట్టే తిట్లు, తల్లి ఒంటిపై గాయాలపై ఎన్నోసార్లు ఫిర్యాదుచేసినా పోలీసులు పట్టించుకోక పోవడంతో ఉద్దేశపూర్వకంగానే తప్పుడు కేసు పెట్టానంటూ ఆ యువతి ఒప్పుకుంది. బాధితురాలి ఆవేదన అర్థంచేసుకున్న న్యాయమూర్తి సానుభూతితో కేసును పరిశీలించారు. పోస్కో చట్టం కింద కేసు నమోదైనా.. వేధింపుల నుంచి బయటపడేందుకు, పోలీసుల నిర్లక్ష్యాన్ని వదిలించేందుకు న్యాయస్థానం దాకా వచ్చిన ఆ యువతి ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఇక, తల్లీ పిల్లలపై దూషణలకు పాల్పడుతున్న తండ్రికి 25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు.



హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 'షీ టీమ్స్ 10కే రన్' జెర్సీలను ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్ రెడ్డి, తదితరులు

రేపు హోలీ సెలవు దినం

- ఎల్లుండి ఆప్షనల్ హాలిడే.. సీఎస్ సవరణ ప్రకటన విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 27: హోలీ సెలవు దినంలో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలుత కేంద్ర ప్రభుత్వం మార్చి 2ను, రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1ని హోలీ సెలవు దినంగా ప్రకటించాయి. దీంతో రెండు తేదీలపై ఉద్యోగుల్లో గందరగోళం ఏర్పడింది. దీనిపై సెలవు విషయంలో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలంటూ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో మరోసారి పండితులతో చర్చించిన దేవాదాయశాఖ మార్చి 1వ తేదీనే 'హోలీ' అని స్పష్టం చేసింది. దేవాదాయ శాఖ సూచన నేపథ్యంలో హోలీ సెలవు ప్రకటనకు సంబంధించి స్వల్ప మార్పులుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన వెలువరించింది. సవరించిన తేదీల ప్రకారం.. మార్చి 1ని హోలీ పండగ సెలవుగా.. మార్చి 2ని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

టీఎస్‌ఆర్టీసీకి మరో రెండు అవార్డులు



హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపులో అనేక అవార్డులు సొంతం చేసుకున్న టీఎస్ఆర్టీసీ మరో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. 2016-17 ఏడాదికిగానూ వాహనాల ఉత్పాదకతలో 328.27 (కిలోమీటర్/వెహికిల్), ఇంధన పొదుపులో 5.51 కేఎంపీఎల్ సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినందుకుగానూ అసోసియేషన్ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు అండర్ టేకింగ్స్(ఎఎన్ఆర్‌టీయూ) నుంచి అవార్డులు సొంతం చేసుకుంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ ఎండీ జి.వి రమణారావు ఎఎన్ఆర్‌టీయూ కార్యదర్శి యుధువీర్ సింగ్ మాలిక్ చేతుల మీదుగా అవార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ.. వాహన ఉత్పాదకత, ఇంధన పొదుపు లక్ష్య సాధనలో అందరి కృషి ఫలితమే ఈ విజయమన్నారు. రమణరావుతోపాటు సిఎంఈ వెంకటేశ్వర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాష్ట్ర పర్యటనకు వచ్చిన కన్నడ జర్నలిస్టుల బృందం

'భగీరథ'తో తెలంగాణ చరిత్ర

- కర్ణాటక ప్రెస్ అకాడమీ చైర్మన్ సిద్దరాజు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): మిషన్ భగీరథతో తెలంగాణ చరిత్ర సృష్టించిందని, ప్రజల కనీస అవసరమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కర్ణాటక ప్రెస్ అకాడమీ చైర్మన్ సిద్దరాజు అన్నారు. తెలంగాణలో అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించడానికి రాష్ట్రానికి వచ్చిన కర్ణాటక ప్రెస్ అకాడమీ నేతృత్వంలోని 30 మంది కన్నడ జర్నలిస్టుల బృందం మంగళవారం గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండలో నిర్మించిన మిషన్ భగీరథ హెడ్ వర్క్స్‌ను పరిశీలించింది. మిషన్ భగీరథపై రూపొందించిన వీడియో ప్రజెంటేషన్‌తోపాటు భగీరథ పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించింది. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ కర్ణాటక బృందానికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిద్దరాజు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ ఒక్కరికీ 100 లీటర్ల నీటిని అందించాలన్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పం చాలా గొప్పదన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్న సీఎం కేసీఆర్ ప్రయత్నం దేశానికి ఆదర్శమన్నారు. కోమటి బండలో నిర్మించిన భగీరథ హెడ్ వర్క్స్‌ను ఇప్పటివరకూ చూడనందుకు బాధగా ఉందని అల్లం నారాయణ అన్నారు. మిషన్ భగీరథ కట్టడాను నిర్మించడం అద్భుతమన్నారు. ఇంటింటికి నీటితో పాటు ఇంటర్నెట్ అందించి డిజిటల్ రంగంలో తెలంగాణ విప్లవాత్మక విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్.ఈ. చక్రవర్తి, ఈఈ రాజయ్య, కమలాకర్, డీ.ఈ నాగార్జున, సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్, పల్లె రవికుమార్, ఇస్మాయిల్, మారుతీసాగర్‌తోపాటు కర్ణాటక జర్నలిస్టులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాలకు సాయం చేయండి

- బాన్సువాడకు ఉర్దూ డిగ్రీ కాలేజీ ఇవ్వండి
- కేంద్రమంత్రి నఖ్వీకి మంత్రి పోచారం విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన మైనారిటీ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సాయంమందించాలంటూ కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీని కోరామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జహీరాబాద్ ఎంపీ బాబీ పాటిల్‌తో కలిసి ఆయన న్యూఢిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోటగిరి, బాన్సువాడ, బీచ్కుంద కామారెడ్డి, లింగంపేటలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మౌలిక వసతులు పెంచడానికి నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. బాన్సువాడలో మైనారిటీ బాలికలకోసం ప్రత్యేకంగా జూనియర్ కాలేజీ ఉందని, ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరగా, నఖ్వీ సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. మల్టీసెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద మైనారిటీ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల మెరుగుకు కేంద్ర ప్రభుత్వంనుంచి నిధులు విడుదల చేయాలని కోరినట్టు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు దేశానికే ఆదర్శమని అభినందించినట్టు చెప్పారు. తెలంగాణలో 2014కు ముందు మైనారిటీలకోసం కేవలం ఆరు గురుకులాలు ఉండగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను 206కు పెంచిందన్నారు. తమ పిల్లలకు అందుతున్న విద్య, సౌకర్యాలపై తల్లిదండ్రులు ఆనందంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అన్నివర్గాల వారికి కలిపి నూతనంగా 536 రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటుచేసినట్టు పోచారం వివరించారు.



టీటీడీపీ అధ్యక్షుడు రమణతో మంద కృష్ణ మాదిగ

బంద్‌కు మద్దతివ్వండి

- ఎల్.రమణకు మంద కృష్ణ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా మార్చి 13న చేపట్టనున్న తెలంగాణ బంద్‌కు మద్దతివ్వాలంటూ టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణకు మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రమణ నివాసంలో ఇద్దరూ భేటీ అయ్యారు. ఇదే విషయమై ఈ నెల 20న ఎన్టీఆర్ భవన్‌లో రమణను మంద కృష్ణ కలవడం, బంద్‌కు మద్దతిస్తున్నట్టు టీటీడీపీ ప్రకటించడం తెలిసిందే. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

టీటీడీపీ భవితవ్యంపై బాబు సమీక్ష


ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు బుధవారం టీటీడీపీ నాయకులతో పార్టీ భవితవ్యం, ప్రస్తుత పరిస్థితులపై చర్చించనున్నారు. ఎన్టీఆర్ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఎల్.రమణ నేతృత్వంలో జరిగే పొలిట్ బ్యూరో, సెంట్రల్ కమిటీ నేతల సమావేశంలో బాబు పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీపీ జనరల్ బాడీ సమావేశంలో బాబు మాట్లా డనున్నారు. మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, తన అనుచరులతో సహా సాయంత్రం 4 గంటలకు చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ మండలస్థాయి కార్యకర్తలకు నిర్వహిస్తున్న ఆరో బ్యాచ్ నాయకత్వ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి.

డిఫెన్స్ కారిడార్ ఇవ్వండి

- రాష్ట్రంలో అద్భుతమైన ఏరో స్పేస్, డిఫెన్స్ ఎకో సిస్టమ్
- డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించండి
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కేటీఆర్ లేఖ







హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్(డీఐసీ) కేటాయించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు మంగళవారం ఆయన ఓ లేఖ రాశారు. కారిడార్ ఏర్పాటుకు రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను అందులో వివరించారు. ఐదు దశాబ్ధాలుగా అద్భుతమైన ఏరో స్పేస్, డిఫెన్స్ ఎకో సిస్టమ్ తెలంగాణలో ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇటీవల బుందేల్ ఖండ్, చెన్నై - బెంగళూర్ ప్రాంతాలకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లను కేటాయించిన విధంగానే తెలంగాణకు కేటాయించాలని కోరారు. ఈ బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్లను ప్రకటించిన కేంద్రం, అన్ని విధాల అనువైన పరిస్థితులున్నప్పటికీ తెలంగాణను విస్మరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతన రాష్ట్రానికి ఈ కారిడార్ల కేటాయిస్తే ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎకో సిస్టమ్ ఉన్న చోట డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయిస్తే మరిన్ని పెట్టుబడులు వస్తాయన్నారు. డీఆర్‌డీవో, ఆర్‌సీఐ, డీఆర్‌డీఎల్, బీడీఎల్, మిధాని, ఎన్‌సీఎల్ వంటి అనేక రక్షణ రంగ సంస్థలు రాష్ట్రంలోనే ఉన్నాయని గుర్తు చేశారు. దీంతోపాటు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, హెచ్‌బీఎల్, అస్ట్రా మొదలైన ప్రైవేటు సంస్థలు ఏరో స్పేస్, డిఫెన్స్ రంగంలో పని చేస్తున్నాయన్నారు. ఆయా సంస్థలు ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు భాగస్వాములుగా ఉన్నాయని, ఇలాంటి చోటనే డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేస్తే పెట్టుబడులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి విమాన సౌకర్యం ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు రాష్ట్రంలో వరంగల్, బేగంపేట, దుండిగల్, హకీంపేటలో విమానాశ్రమ సదుపాయం ఉందన్నారు. దీంతోపాటు ఇతర నగరాలకు లేని ఎనిమిది లేన్ల హై స్పీడ్ అవుటర్ రింగ్ రోడ్డు ఉందన్నారు. తెలంగాణకు ఉన్న మౌలిక వసతులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఏరో స్పేస్, డిఫెన్స్ తయారీ రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ మేరకు ఆదిభట్ల, జీఎంఆర్ విమానాశ్రయానికి అనుకుని ఉన్న రెండు పార్కుల్లో ఇప్పటికే ఈ రెండు రంగాల్లో ఉత్పత్తులు కొనసాగుతున్నాయన్నారు. దీంతోపాటు ఎలిమినేడులో మరో పార్కు, మెదక్‌లోని నిమ్జ్‌లో ప్రత్యేకంగా మరొక ఏరో స్పేస్ డిఫెన్స్ క్లస్టర్ ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అంతేకాక నగరంలో డిఫెన్స్ ఇంక్యూబేటర్ ఏర్పాటును కూడా ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం డిఫెన్స్ తయారీ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను కేంద్రం పరిగణలోకి తీసుకోవాలని నిర్మలా సీతారామన్‌ను కోరారు. దీంతోపాటు అంతర్జాతీయ స్థాయి కంపెనీలైన బోయింగ్, లాకీడ్ మార్టిన్, సికోర్స్కీ వంటి కంపెనీలు హైదరరాబాద్ నగరాన్ని తమ తయారీ కేంద్రాలుగా ఎంచుకున్న విషయాన్ని తెలిపారు. ప్రాట్ అండ్ విట్నీ వంటి సంస్థలు తమ ఇంజిన్ శిక్షణ కేంద్రంగా నగరాన్ని ఎంపిక చేసుకుందన్నారు. తెలంగాణలో 26 యూనివర్సిటీలు, 700లకు పైగా ఇంజనీరింగ్ కాలేజీలు, సుమారు 280 పాలిటెక్నిక్ కాలేజీలున్నాయని, వీటి ద్వారా ప్రతి ఏటా టెక్నికల్ పరిజ్ఞానం ఉన్న యువత బయటకు వస్తున్నారన్నారు. నగరంలో కనీసం 1000 ఎంఎస్‌ఎంఈలు డిఫెన్స్, ఏరో స్పేస్ రంగంలో పనిచేస్తున్నాయని, అనేక భారత రక్షణ, అంతరిక్ష కార్యక్రమాల్లో వీటికి భాగసామ్యం ఉందన్నారు. తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించేందుకు కావాల్సిన అన్ని అర్హతలున్నాయని తెలిపారు. ఆయా అనుకూలతల నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించి తెలంగాణకు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ కేటాయించాలని కోరారు.

ల్యాబ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి

సంఘం అధ్యక్షుడు ఎంకే ఖాదర్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చాలీచాలని వేతనాలతో 24 ఏండ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కాలేజీ ల్యాబ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ.ఖాదర్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడు నెలలుగా ప్రభుత్వ వేతనాలు అందక.. కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.7800 వెంటనే చెల్లించాలని, బేసిక్ వేతనంగా రూ.15,030 ఇవ్వాలని కోరారు.

టీఆర్ఎస్ నేతలే ఉద్యమ ద్రోహులు

కాంగ్రెస్ శాసన సభ పక్ష ఉపనేత జీవన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): జై తెలంగాణ నుంచి జై ఆంధ్ర వరకు టీఆర్ఎస్ స్ఫూర్తి పోయిందని, టీఆర్ఎస్ నేతలే నిజమైన ఉద్యమ ద్రోహులని కాంగ్రెస్ శాసనసభ పక్ష ఉపనేత జీవన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా హాల్ వద్ద ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తి ఏమయిందన్నారు. స్థానికేతరులు ద్రోహం చేస్తే పొలిమేర దాటే వరకు కొట్టాలని, స్థానికులు ద్రోహం చేస్తే బొంద పెట్టాలని మండిపడ్డారు. కేంద్రంతో కుమ్మక్కై టీఆర్ఎస్ రాష్ట్రానికి ద్రోహం చేస్తుందన్నారు. సీబీఐ విచారణ భయంతోనే కేసీఆర్ కేంద్రంతో కుమ్మక్కైనారన్నారు. టీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సుఖేందర్‌రెడ్డి ఉద్యమ నాయకుడైతే కాంగ్రెస్ నాయకులు కూడా ఉద్యమ నాయకులేనని అన్నారు.

2022కు డిజిటల్ సాక్షరత

- సులభతర పాలనే ఈ - గవర్నెన్స్ ధ్యేయం
- 8 కేటగిరీల్లో 19 అవార్డులు ప్రదానం
- ఈ-గవర్నెన్స్ ముగింపు సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి) సరళతర పాలనతో మానవ జీవితాన్ని సులభతరం చేయడమే ఈ - గవర్నెన్స్ ధ్యేయం కావాలని ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ప్రధాన మంత్రి కార్యాలయ వ్యవహారాలు, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు శక్తి విభాగం, అంతరిక్ష విభాగ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రధాన మంత్రి మోడీ ప్రారంభించిన న్యూ ఇండియా ఆవిర్భవించాలంటే ఈ - గవర్నెన్స్ అత్యవసరమని తెలిపారు. 21వ ఈ - గవర్నెన్స్ జాతీయ సమావేశంలో భాగంగా మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస ప్రభుత్వంతో గరిష్ఠ పాలనను అందించడానికి కేంద్ర ప్రభుత్వం క ట్టుబడి ఉందని, అదే సమయంలో ఈ - గవర్నెన్స్‌కు సైతం మళ్లిందని వివరించారు. జాతీయ ఈ - గవర్నెన్స్ పురస్కారాలను కూడా ఈ సందర్భంగా ప్రదానం చేశారు. సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించడంలో చక్కని ప్రయత్నాలు చేసిన విజేతలకు 8 కేటగిరిల్లో మొత్తం 19 అవార్డులను అందజేశారు. ప్రతి ఒక్క కేటగిరిలో స్వర్ణ పురస్కారానికి రూ. 2 లక్షల నగదు బహుమతిని, ప్రశంసాపత్రం, రజిత పురస్కారంలో భాగంగా రూ. 1 ల క్ష నగదు బహుమతిని అందించారు. పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) నిర్వహిస్తున్న ప్రాంతీయ సమావేశాలు ఈ కోవకు చెందిన సమావేశాల నిర్వహణను సిబ్బంది మంత్రిత్వశాఖ దేశ రాజధాని నగరమైన న్యూ ఢిల్లీ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించిన సంగతిని సూచిస్తున్నాయని తెలిపారు. పరిపాలనపై ప్రాంతీయ సమావేశాలను నిర్వహించాలన్న మా ప్రయత్నంలో భాగంగా మూడేండ్లుగా గువాహాటీ, జమ్ము, నాగ్‌పూర్, చండీగఢ్, విశాఖపట్నం, జైపూర్, హైదరాబాద్ వంటి చోట్ల ఈ సమావేశాలను ఏర్పాటు చేశామని, అవి విజయవంతం అయ్యాయని వివరించారు.

పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సాధించిన విజయాలను ఈ సభలో ఆయన ప్రస్తావించారు. సీపీజీఆర్ఏఎంఎస్ పోర్టల్ ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా నిలిచిందన్నారు. గతంతో పోల్చితే ఏడు రెట్టు అధిక సంఖ్యలో ఫిర్యాదులు స్వీకరించడమొక్కటే కాకుండా వాటి పరిష్కారం స్థాయి సైతం దాదాపుగా 86 శాతానికి ఎగబాకిందని తెలిపారు. మూడేండ్ల కిందట ఈ విభాగానికి అందిన ఫిర్యాదుల సంఖ్య 2 ల క్షలు కాగా ఈ ఏడాది 16 ల క్షల ఫిర్యాదులను అందుకొన్నట్టు తెలిపారు. ప్రభుత్వం నుంచి మెరుగైన ప్రతిస్పందన లభిస్తుండడమే ఈ ఆశాజనక పరిస్థితికి దారితీసినట్టు పేర్కొన్నారు. డీఏఆర్‌పీజీ పద్ధతులను అనుసరించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. ఈ విభాగం ఒక నిజమైన పరిశోధన అభివృద్ధి విభాగంగా ఎదిగిందని, సంస్కరించు, పనిచేయు, పరివర్తనకు దారితీయి అనే మంత్రానికి తులతూగుతోందని పేర్కొన్నారు. 2022 కల్లా అందరికీ డిజిటల్ సాక్షరతను సమకూర్చాలని, ఇంకా జన్‌ధన్, ఆధార్, మొబైల్ ఈ మూడింటిని సర్వోత్తమంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుం దని ఆయన వెల్లడించారు. దేశంలో యువజనాభా అధిక సంఖ్యలో ఉన్న సంగతిని వివరిస్తూ ప్రతి ప్రభుత్వ పథకం యువజన ప్రధానంగా రూపుదిద్దుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యూ ఇండియా ఆవిష్కార దిశగా సాగే కృషిలో సైతం ఇదే దృష్టి కోణం కేంద్ర బిందువుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులు విభాగం కార్యద ర్శి కేవీ. ఇయాపెన్, డీఏఆర్‌పీజీ అదనపు కార్యదర్శి వసుధ మిశ్రా, తెలంగాన అదనపు ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా ప్రసంగించారు.

టెక్నాలజీతో అక్రమాలకు చెక్

- పౌరసరఫరాలో విజయవంతంగా అమలు
- ఈ-గవర్నెన్స్ సదస్సులో సీవీ ఆనంద్



ప్రజా పంపిణీ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని వివరిస్తున్న సీవీ ఆనంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంత వరకు ఉపయోగించుకుని పారదర్శకత, జవాబుదారీతనం, సత్వర ఫలితాలే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతోందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేశామని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేశామన్నారు. దీంతో సరుకులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 21వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో రెండవరోజు మంగళవారంనాడు సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతానికి తీసుకుంటున్న వినూత్న చర్యలను, సంస్కరణలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీవీ ఆనంద్ వివరించారు. జాతీయ ఆహార భద్రత కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి నెలకు కిలో రూ. 3 లకు ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని సరఫరా చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కిలో రూ. 1కే సరఫరా చేస్తున్నదన్నారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2.75 కోట్ల మంది లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ప్రతి నెల 1.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని అన్నారు. ఇందులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం సేకరించి, ఆన్‌లైన్ (ఆన్‌లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టం-ఓపీఎంఎస్) ద్వారా చెల్లింపులు చేస్తున్నామన్నారు. 2016 ఖరీఫ్, 2017 రబీ, ఖరీఫ్‌లలో రూ. 11 వేల కోట్లు 15 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేశామబన్నారు. ఈ విధానాన్ని దేశంలోని పలు రాష్ట్రాలు సైతం అనుసరిస్తున్నాయని అన్నారు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా అర్హులకు అందేలా సరఫరా నుండి పంపిణీ వరకు కంప్యూటరీకరణ, రేషన్ దుకాణాల్లో ఈపాస్ మెషీన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, సరుకుల రవాణా వాహనాలకు జీపీఎస్, గోదాముల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పాటు లోడింగ్, అన్‌లోడింగ్ లావాదేవీలపై కమాండ్ కంట్రోల్ సెంటర్ సహాయంతో నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు. రేషన్ షాపుల్లో ఈ-పాస్ విధానం ద్వారా ప్రతి నెల 12 నుంచి 15 శాతం బియ్యం మిగులవుతున్నాయన్నారు. ఇకపై లబ్ధిదారులు కోరుకున్న రేషన్ షాపుల నుండి సరుకులు తీసుకునేలా పోర్టబిలిటీ విధానాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రేషన్ లావాదేవీలను సామాన్య ప్రజలు సైతం ప్రత్యక్షంగా తెలుసుకునేలా టీ-రేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించామని, ఇందులో 13 అప్లికేషన్స్‌తో ప్రభుత్వ సేవలను రూపొందించామని ఆనంద్ పేర్కొన్నారు. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఎక్కడినుంచైనా ఈ యాప్ ద్వారా తమ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించుకునేలా పక్కా పకడ్బందిగా సాంకేతికతను ప్రవేశపెట్టామని తెలిపారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
బుధవారం, ఫిబ్రవరి 28

అవధుల్లేని అధికారం

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పార్టీపై, పాలనపై తనదైన శైలిలో పట్టుబిగిస్తున్నట్టు కనిపిస్తోంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల్లో (అధినేతలు) 'రెండుసార్లు మాత్రమే కొనసాగాలి' అనే నిబంధనను తొలగించాలని చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) సెంట్రల్ కమిటీ రాజ్యాంగానికి సవరణ ప్రతిపాదించింది. దాంతో వచ్చే పదేళ్ళ కాలానికి ఆ తర్వాత కూడా జిన్‌పింగ్ స్థానం పదిలం కానుందని చైనా అధికారిక మీడియా సంస్థ జిన్‌హువా పేర్కొంది. మునుపెన్నడూ లేని విధంగా అధినేతలకు అవధుల్లేని పదవీకాలాన్ని సీపీసీ కట్టబెట్టడం చూస్తే జిన్‌పింగ్‌కు పార్టీపై తిరుగులేని పట్టు దొరికినట్టు అనిపిస్తుంది. జిన్‌పింగ్ అక్టోబర్‌లో రెండవసారి అధ్యక్షుడుగా ఎన్నికైన సమయంలో ఆయనకి గట్టి పోటీ ఇచ్చిన వారెవరూ లేని విషయం తెలిసిందే. అయితే అంతకంటే ముఖ్యంగా సంక్షుభిత భౌగోళిక రాజకీయార్థిక సన్నివేశంలో ఆధిపత్యం కోసం చైనా పోటీపడేందుకు మరింత నిరంకుశాధికారంతో దేశాన్ని నడపగల అధినేత అవసరమే సీపీసీ నిర్ణయానికి అసలు కారణమని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2008 నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న మహా సంక్షోభం ప్రతిఫలనంగా ఫాసిస్టు/అర్ధ ఫాసిస్టు ప్రభుత్వాలు అంతర్జాతీయంగా ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ రాజ్యాంగ సవరణ రావడంలో ఆశ్చర్యమేమీ కాదు.


నాలుగు దశాబ్దాల కాలంలో చైనా ఒక ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడానికి 'సంపన్నులు కావడం నేరం కాదు' అనే డెంగ్ జింగ్ యావో పింగ్ అవగాహన పునాదిపై సీపీసీ, ఆ దేశ ప్రజలు దృఢ సంకల్పంతో కృషి చేయడమే ప్రధాన కారణం. మావో నాయకత్వంలో సాధించిన సమసమాజ విప్లవ సంప్రదాయాల్ని, ప్రజా సాంస్కృతిక వారసత్వాన్ని, సమిష్టిస్ఫూర్తితో నడిచే సామాజికార్థిక వ్యవస్థల్ని, సంస్థల్ని పక్కన బెట్టి, ఆయన నేర్పిన క్రమశిక్షణ పునాదిపై ప్రపంచీకరణ యుగంలో చైనా ఒక సమకాలీన ఆర్థిక అద్భుతంగా ఎదగడానికి పింగ్ నాయకత్వం క్రియాశీలక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. 'సాంస్కృతిక విప్లవ' కాలంనాటి కఠిన కట్టిన క్రమశిక్షణ, ఉద్దేశ్యపూరిత సమిష్టి స్ఫూర్తి స్థానంలో ప్రపంచీకరణతో అంతర్జాతీయంగా తలెత్తిన స్వార్థ సంస్కృతి కొనసాగింపుగానే సీపీసీలోనూ అంతులేని అవినీతి, అక్రమాల సంస్కృతి చోటు చేసుకుంది. దాంతో ఉదాసీనత, డబ్బు/సంపదల వెంబడి వెంపర్లాట, మహా వ్యక్తివాదం, స్వార్థపూరిత కుట్రలు, స్కాంలు, అరాచక తెగువ వంటి నేరపూరిత లక్షణాలు సాధారణ పార్టీ శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ సర్వత్రా ఆవరించాయి. ఈ నేపథ్యంలో భౌగోళిక రాజకీయ యవనికపై సరికొత్త సామ్రాజ్యవాదిగా అవతరిస్తున్న చైనాకు ఒక అసాధారణ 'సోషల్ ఫాసిస్టు' తరహా నియంత అవసరం. '2035 ఆ తర్వాత ఈ శతాబ్దం నడిమి వరకూ దేశాన్ని అప్రతిహతంగా నడిపించేందుకు ఒక 'దృఢమైన నాయకత్వం' అవసరం రీత్యా 'అధినేతలకు కాలపరిమితిలేని పదవీ కాలం' అనే సవరణ చేపట్టినట్లు'గా చైనా అధికార టాబ్లాయిడ్ వ్యాఖ్యానించింది. వాస్తవంలో అలాంటి సవరణ అవసరమే లేదు. ఎందుకంటే చైనాలో వాస్తవ అధికార కేంద్రాలైన పార్టీ, కేంద్ర మిలటరీ కమిషన్ అధినేతలకు పదవీ కాలపరిమితే ఉండదు. అయితే రాజ్యాధినేతల విషయంలోనూ అలాంటి అడ్డంకులు లేకుండా తొలగించడమనేది భవిష్యత్‌లో మరింత శక్తిమంతంగా ప్రపంచాధిపత్యం వైపునకు నడిపించబోతున్నామని ప్రపంచ దేశాలకు చైనా ఇస్తున్న సంకేతంగా దీన్ని అర్థం చేసుకోవాలి.

ప్రపంచాధిపత్య పోటీలో ఆర్థిక అద్భుతంగా నిలిచేందుకు అత్యంత కష్టపడి, క్రమశిక్షణతో ఒకే లక్ష్యం వైపు పనిచేయగల చైనా మానవవనరులే (ప్రజాశక్తి) ప్రధాన కారణం. అందుకు మావో సారథ్యంలో నడిచిన సీపీసీ నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకమైనది. దృఢ సంకల్పం గల అంతటి సంఘటిత శ్రమశక్తి ఉనికిలో లేనిదే ప్రస్తుత చైనా విజయాలు సాధ్యమయ్యేవే కావు. అయితే సాంస్కృతిక విప్లవకాలంలో జరిగిన అతివాద చర్యలకు ప్రతిక్రియగా ముందుకొచ్చిన రాజకీయ, ఆర్థిక సంస్కరణలు చైనాను సమకాలీన ద్రవ్యపెట్టుబడి పోటీలో ముందుపీఠిన నిలబెట్టింది. ఈ నేపథ్యంలో మావో స్థాయిలో విమర్శలకు అతీతమైన ఒక అధినేత పుట్టుకొచ్చి సాంస్కృతిక విప్లవం పేరుతో మరో సామాజిక వైపరీత్యం సంభవించకూడదనే ఉద్దేశంతో దేశాధినేతల పదవీ కాలానికి పరిమితులు విధించారు. కొత్తగా తలెత్తిన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా చైనా లక్షణాలతో కూడిన సోషలిజాన్ని పరిరక్షించడం, అభివృద్ధి పరచడంలో భాగంగా అభివృద్ధిపై శాస్త్రీయ దృక్పథం అనే జిన్‌పింగ్ సోషలిస్టు ఆలోచనలు, విధానాన్ని సీపీసీ పంథాలో అంతర్భాగమైంది. అయితే ఈ నిర్ణయం చైనాను అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా నిలబెట్టనూ వచ్చు, అదే సమయంలో అంతర్గతంగా దేశంలో వ్యక్తిపూజ సంస్కృతి, అధికారం కోసం రక్తపాతం, అరాచకత్వం తదితర సామాజిక సంక్షోభాలు తలెత్తనూ వచ్చు. అవధుల్లేని అధికారం ఎన్నడూ ప్రజాస్వామికం కాదు.

రైతన్నకు ఆసరా!

రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం సరికొత్త బీమా పథకాన్ని ప్రకటించింది. 'తెలంగాణ తెస్తానని ఏ గడ్డమీదైతే ప్రకటించానో అదే గడ్డమీద నుంచి రైతుల అభ్యున్నతి కోసం రైతులకు సరికొత్త బీమా పథకాన్ని ప్రకటిస్తున్నా'నని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సమితి సమావేశంలో మాట్లాడుతూ, ఏ రైతైనా అకాల మృత్యువాత పడినా, అనారోగ్యంతో మరణించినా ఈ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా చెల్లిస్తారు. రాష్ట్రంలోని 72 లక్షల రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరే ఈ పథకానికి ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని కేసీఆర్ ప్రకటించారు. రైతు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, బంగారు తెలంగాణకు కూడు గుడ్డ గూడు ప్రధానమైనవని, ఐటీ సహా మిగిలిన ఇతర రంగాలన్నీ తరువాతేనని ఆయన చెప్పారు. వ్యవసాయానికి ముందస్తు సాయంగా ఎకరాకు నాలుగువేల రూపాయల సాయం ప్రీ పెయిడ్ చెక్కులను నవంబర్ 18 నుంచి అందజేస్తామని తెలిపారు.

రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్తకొత్త పథకాలతో ముందుకు వస్తోంది. పెట్టుబడి సాయం పేదరైతులకేనని, పెద్ద రైతులకు అక్కర్లేదని ఆయన కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలతో తమకు పెట్టుబడిసాయం అక్కరలేదని ప్రకటించేలా చూశారు. దాంతో పెట్టుబడిసాయం సన్నకారు రైతులకు మాత్రమేనని ఆయన చెప్పకనే చెప్పించినట్లయింది. ఈ సందర్భంగా ఆయన కేంద్రంపై కూడా మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌ను కూడా కేసీఆర్ తప్పు పట్టారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలవల్లే దేశంలో రైతుల్లో విప్లవం వస్తోందని, కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయన్నది అక్షర సత్యం. అవసరమైతే దేశవ్యాప్తంగా రైతు ఉద్యమం తలెత్తితే తెలంగాణ రైతు సమన్వయ కమిటీలే నాయకత్వం వహిస్తాయని కేసీఆర్ స్పష్టంచేయడం గమనార్హం. దాదాపు 120 రైతు సంఘాలు ఏకమై దేశవ్యాప్తంగా ఉద్యమం చేసినా కేంద్రం కనీసం వారిని పట్టించుకోలేదు. తమిళనాడుకు చెందిన రైతులు వినూత్నరీతిలో రోజుకో విధంగా ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీకి కూతవేటు దూరంలో దాదాపు 50 రోజులు నిరాహారదీక్షలు చేసినా వారికి అనునయ మాటలు కూడా కేంద్రం నుంచి రాలేదు. వారు నిరాహారదీక్ష చేస్తున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండడం గమనార్హం. రైతుల పట్ల ఇంత నిర్దయగా ప్రవర్తించిన మోదీకి ఇప్పుడు హఠాత్తుగా రైతులు గుర్తుకొచ్చారు. కర్ణాటకలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గోదావరి-కావేరి అనుసంధానం గురించి మాట్లాడుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అంతర్రాష్ట నదీజలాల ఒప్పందాలు సక్రమంగా లేవు. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య గోదావరి, కృష్ణాజలాల సమస్య జఠిలంగా మారింది. ఈ వివాదాన్ని పరిష్కరించడంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తోంది. రైతుల్లో సహనం నశించి అసహనం పెరిగి వారు ఉద్యమించకముందే ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవలసిన అవసరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది.



'టిస్ ఫీజుల'పై గొంతెత్తిన విద్యార్థులు

'ఎంతోకాలం నుంచి మేమెన్నో డిమాండ్లు చేస్తున్నాం. మేమేమీ దయాదాక్షిణ్యాల కోసం పోరాడడం లేదు. మా హక్కుల కోసం పోరాడుతున్నా'మని విద్యార్థులు చెబుతున్నారు. తమ డిమాండ్లపై ఆరునెలల క్రితం హైదరాబాద్ టిస్ విద్యార్థులు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రామదాస్ అథవాలేతో చర్చలు జరిపారు. అంశాల ప్రాతిపదికగా తమ డిమాండ్లను నెరవేరుస్తామని, విద్యార్థులు పైసా కూడా చెల్లించనక్కర్లేదని మంత్రి వారికి హామీ ఇచ్చారు. టిస్‌కు సంబంధించిన అన్ని క్యాంపస్‌ల్లోను ఇదే పరిస్థితి నెలకొని ఉన్నది.

దేశంలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)కు ఉన్న నాలుగు క్యాంపస్‌ల్లో విద్యార్థుల ఆందోళనతో దద్దరిల్లుతోంది. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీ విద్యార్థుల అసహంతో రగిలిపోతున్నారు. గత ఏడాది కాలంగా వారికి అందాల్సిన ఆర్థికసాయం అందడంలేదు. దీనితో గతవారం రోజుల నుంచి వారు ఉద్యమిస్తున్నా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. ముంబైలోని టిస్ విద్యార్థులు తరగతులు, క్షేత్రస్థాయి శిక్షణను కూడా బహిష్కరించి ఉద్యమిస్తున్నారు. ముంబై, తుల్జాపూర్, హైదరాబాద్, గుహవతిల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఆర్థికసాయం 2016 నుంచి నిలిపివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇలా ఆర్థికసాయం అందుకుంటున్న వారంతా పేదవిద్యార్థులే! ప్రతి విద్యార్థి హాస్టల్ ఫీజు, డైనింగ్ హాల్ ఫీజు చెల్లించాలని 2017 విద్యా సంవత్సరం ప్రారంభంలో టిస్ యాజమాన్యం హఠాత్తుగా ప్రకటించడంతో విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ప్రభుత్వం నుంచి మెట్రిక్యులేషన్‌అనంతరం ఉపకారవేతనం (జీవోఐ-పీఎంఎస్) అందుకుంటున్న విద్యార్థులకు కూడా మినహాయింపు లేదని టిస్ యాజమాన్యం స్పష్టంచేసింది.



రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీలో ఉన్న రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఫీజులను చెల్లించాల్సి ఉంటుంది. 2017 వరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు హాస్టల్, వసతి ఫీజు సహా ట్యూషన్ ఫీజుకు కూడా మినహాయింపు ఉంది. ఈ ఫీజులను జీవోఐ-పీఎంఎస్ పథకం కింద ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించేవి. విద్యార్థి నుంచి దరఖాస్తు అందగానే ఈ ఫీజులు ఆయారాష్ట్రప్రభుత్వాలకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ చెల్లించేది. అయితే, ఈ అంశంలో విద్యార్థి ప్రవేశాన్ని అంగీకరించడం తప్ప ఫీజుల విషయంలో తమ బాధ్యత ఏమీ ఉండదని టిస్ యాజమాన్యం ప్రకటిస్తోంది. ఈ ఫీజులు నేరుగా విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌కే చెల్లిస్తారని యాజమాన్యం తెలియజేసింది. అయితే, విద్యార్థి సంఘం వాదన మరో విధంగా ఉంది. దేశంలోని ఏ సామాజికశాస్త్ర విద్యాసంస్థలోనూ టిస్‌లో ఉన్నంత హెచ్చుస్థాయిలో ఫీజులు లేవని విద్యార్థిసంఘ ప్రధాన కార్యదర్శి ఫహాద్ అహ్మద్ తెలిపారు. 2016-18 విద్యార్థులకు ఫీజుల ఉపసంహరణ ఉంటుందని హామీ ఇచ్చి ఇప్పుడు విద్యా సంవత్సరం మధ్యలో యాజమాన్యం మాట తప్పుతోందని ఆయన ఆరోపించారు. ఈ ఫీజులు చెల్లించడం ఆలస్యం కావడంతో యాజీసీ నుంచి టిస్ యాజమాన్యం రాబట్టుకోవలసి ఉంటుంది. అయితే, యూజీసీ బడ్జెట్‌లో కోతలు విధించడంతో ఈ ఫీజులను విద్యార్థుల నుంచే రాబట్టాలన్నది టిస్ యోచిస్తోందని ముంబై టిస్ విద్యార్థి సంఘం సాంస్కృతిక విభాగ కార్యదర్శి వికాస్ తాతడ్ ఆరోపించారు. 2017 నిర్ణయాన్ని ఉపసంహరించాలని, 2016-18, 2017-19 బ్యాచ్‌లకు చెందిన పేద విద్యార్థులకు యథాతథస్థితిని పునరుద్ధరించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. 2017-19 బ్యాచ్‌కు చెందిన ప్రాస్పెక్టస్‌లో స్పష్టంగా విద్యార్థులకు ఆర్థికసాయం గురించి ఉందని, కానీ దాన్ని తరువాత అడ్మిషన్ సమయంలో రద్దుచేశారని, ఇది చట్టవిరుద్ధమని విద్యార్థి సంఘం నాయకుడొకరు తెలిపారు. అయితే, విద్యార్థుల డిమాండ్లను టిస్ యాజమాన్యం పాక్షికంగా అంగీకరించింది.

2016- 18 మాస్టర్స్ డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక సాయం యథావిధిగా మంజూరు చేస్తామని రిజిస్ట్రార్ ప్రకటించారు. 2018 మార్చి/ఏప్రిల్‌లో జరిగే పరీక్షలకు వారు హాజరు కావచ్చునని ఆయన చెప్పారు. హాస్టల్ చార్జీలు, అదనపు ఫీజులు రద్దుచేస్తామని ఆయన తెలిపారు. అయితే, ఈ ప్రకటనతో విద్యార్థులు సంతృప్తి చెందలేదు. 'ఇవన్నీ ఉత్తమాటలే! ఎంతోకాలం నుంచి మేమెన్నో డిమాండ్లు చేస్తున్నాం. మేమేమీ దయాదాక్షిణ్యాల కోసం పోరాడడం లేదు. మా హక్కుల కోసం పోరాడుతున్నా'మని విద్యార్థులు చెబుతున్నారు. తమ డిమాండ్లపై ఆరునెలల క్రితం హైదరాబాద్ టిస్ విద్యార్థులు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రామదాస్ అథవాలేతో చర్చలు జరిపారు. అంశాల ప్రాతిపదికగా తమ డిమాండ్లను నెరవేరుస్తామని, విద్యార్థులు పైసా కూడా చెల్లించనక్కర్లేదని మంత్రి వారికి హామీ ఇచ్చారు. టిస్‌కు సంబంధించిన అన్ని కాంపస్‌ల్లోను ఇదే పరిస్థితి నెలకొని ఉన్నది. అన్ని ప్రాంగణాల్లోని అధ్యాపకులు, ఎస్సీ , ఎస్టీ ఉద్యోగ సంఘం విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. ఓబీసీ విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కొన్నేళ్లుగా వారికి ఆర్థికసాయం నిలిపివేశారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుకు భద్రత కల్పించాలని తదితర డిమాండ్లతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. సామాజిక భద్రతకోసం ఎస్సీ/ఎస్టీ ఫ్యాకల్టీ సభ్యుడిని నియమించాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ పదవిని ఇప్పటికే ఉన్నత కులానికిచెందిన వ్యక్తి నిర్వహిస్తున్నందున ఈ డిమాండ్‌ను అగ్రకులాలకు చెందిన విద్యార్థులు వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థుల డిమాండ్ల కు ముంబై క్యాంపస్ సిబ్బంది సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నారు.

తాడేపల్లి శివరామకృష్ణారావు

మంచిమాట



'ప్రతిదీ తాత్కాలికమే దేనికీ ఒత్తిడి చెందకు'

- బుద్ధుడు

కోర్కెలు తీర్చే గిరిజన కొంగు బంగారం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొత్తగూడ మండలంలో గుంజేడు గ్రామంలో ప్రతి రెండేళ్ళకొకసారి జరిగే 'శ్రీ ముసలమ్మ' గిరిజన జాతర అతి పెద్ద రెండవ జాతరగా పేరుగాంచినది. ఆదివాసీ సంప్రదాయాల ఆధారంగా తోలెం వంశీయులు వడ్డెలు (పూజారులు)గా వుండి నిర్వహిస్తారు. ఈ ఏడు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 3 వరకు జరుగుతుంది. ప్రతి రెండేళ్ళకొకసారి ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వారంవారం (శుక్రవారం) గిరిజన, గిరిజనేతర భక్తులు వేలసంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. మేడారం 'సమ్మక్క సారక్క' జాతర తర్వాత అత్యంత వైభవంగా జరిగే ఈ ''ముసలమ్మ జాతర'' గురించి మీడియా పరంగా పెద్దగా రాష్ట్రవ్యాప్త ప్రచారం లేదు.

శ్రీ గుంజేడు ముసలమ్మ జాతర 1975-76 నుంచి క్రమం తప్పకుండా ఆదివాసీ ఆచారాలతో గుంజేడు గ్రామం పడమర దిక్కులో ముసలమ్మ గుట్టకు దగ్గర వాగు ఒడ్డులో నిర్వహిస్తున్నారు. ఆదివాసీలే వడ్డెలు, భక్తులుగా ఉండి పూర్వం నుంచి ఈ జాతర నిర్వహించబడుతోంది. 1994 తర్వాత 'ఉమ్మడి రాష్ట్ర దేవాదయ శాఖ' నిర్వహిస్తోంది. ప్రతి ఏటా జాతర ఆదాయం రూ.70 లక్షలు వస్తున్నా అది ఏ మాత్రం ఆదివాసీల అభివృద్ధికి వినియోగించడం లేదు. ఇటీవలే ఈ జాతర దేవాదయశాఖ కమీషనర్ ఆధ్వర్యంలో జరగడం వల్ల ఆరుగు ఆదివాసీ పూజారులలో కేవలం ముగ్గురికే పర్మినెంట్ స్కేల్ ఇచ్చారు.

శ్రీ ముసలమ్మ తల్లి మన్ననలను పొంది దేవత అనుగ్రహం కలిగిన వారికి సంతానం, సంపద, పంట పొలాలు, ధాన్యం, వ్యాపారం, ఉద్యోగం వంటి కోర్కెలు తీరడం వల్ల అనూహ్యంగా భక్తుల సందర్శన పెరుగుతోంది. గుంజేడు పరిసర ప్రాంతం దట్టమైన అడవిలో ఉండటం వల్ల అక్కడి పక్షుల కిలకిలా రావాలు, గలగలపారే సెలయేర్లు, పచ్చని చెట్ల కింద భక్తులు సేద తీరుతున్నారు. విహార ప్రదేశంగా విరజిల్లుతోంది. ప్రతి శుక్రవారం వచ్చే భక్తులతో శివసత్తులు పూనకాలు ఊగుతూ అడుగుల సవ్వడితో చిందులు వేస్తూ అమ్మవారిని తరించడం అద్భుతంగా ఉంటుంది.


శ్రీ ముసలమ్మ దేవత కాకతీయుల కాలంలోనే 12 శతాబ్దంలో చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ అటవీ ప్రాంతం, గోదావరి తీర ప్రాంతం నుంచి 'గుంజేడు' చేరినట్లు చారిత్రక ఆధారాలు లేకుండా మౌఖికమే మూలాధారం. గుంజేడు ముసలమ్మ జాతర అనేది ప్రకృతి ఆరాధన పండుగ. విగ్రహారాధన లేని హిందూయిజానికి సుదూరమైన జాతర. కాని ఇప్పుడు గిరిజేతర సంస్కృతి, ఆరాధనతో పాటు దేవాదాయ శాఖ పరిధిలోకి వెళ్ళి పరాధీనతకు ఈ జాతర గురయింది. గిరిజనేతర వ్యాపారులు కొందరు దాతలుగా, దేవతకు విగ్రహాన్ని, గుడి గోపురాన్ని ఏర్పర్చారు. ఇది ఆదివాసీ వడ్డెల, పెద్దల తీర్మాణాలేవి లేకుండా జరిగిన తతంగం. ఇక్కడి సంప్రదాయక వడ్డెలైన ఆదివాసీయువకులకు కీసరగుట్టలోని ఆధ్యాత్మిక కేంద్రంలో హిందూ పూజారులుగా శిక్షణనిచ్చి మంత్రతంత్రాలతో పూజావిధానం పెట్టడం ఆదివాసీ సంస్కృతికి విరుద్ధం. ఇప్పటికైనా గుంజేడు ముసలమ్మ జాతరలో ఆదివాసీ సంప్రదాయాలను రక్షిస్తూ, జాతర ఆదాయం ఆదివాసీ సంక్షేమానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలి.

గుమ్మడి లక్ష్మీనారాయణ

(నేటి నుంచి 'శ్రీ ముసలమ్మ' జాతర)

శాస్త్రీయ దృక్పథమే మార్గం

శాస్త్రం, ప్రయోగాలు, పరిశీలనల ద్వారా సత్యం కనుగొనే పద్ధతి. నిజాలను నిర్ధారించే పద్ధతి. ఈ పద్ధతి ద్వారా నిర్ధారించబడిన నిజాలను మాత్రమే నమ్మాలని అనుకుంటే శాస్త్రీయ దృక్పథం ఉన్నట్టు. పూర్వం మానవులు ప్రపంచమంతా ముఖ్యంగా మనదేశంలో పరిశీలన, అవగాహన, అనుభవాలు పొందడం వంటి చర్యల వల్లనే ప్రకృతిని అర్థం చేసుకున్నారు. శాస్త్రీయ దృక్పథానికి దగ్గరగా ఉన్న ఈ జీవిత విధానం వల్లనే ఎన్నో నాగరికతలు అభివృద్ధి చెందాయి. ప్రజలు శ్రమించి జీవిస్తున్నారు. సహాయ సహకారాలు అందించుకున్నారు. కళాకారులు ఎన్నో కళాఖండాలు సృష్టించారు. ముఖ్యంగా భారతదేశంలో నిర్మాణరంగం శిఖరాగ్ర స్థాయికి చేరింది. కాలక్రమంలో తిని కూర్చుండే ప్రజలు ఎక్కువయ్యారు. కొన్ని వర్గాలుగా తయారయ్యారు. ప్రజలకు తంతులు, కర్మలు, దయ్యం, దేవుడు, మహిమలు వంటి మూఢవిశ్వాసాలను, నమ్మకాలను కలిగించారు. వీటి నుంచి బయటపడకుండా చేశారు. ఏమిటి, ఎందుకు అని ప్రశ్నించకుండా సమాజాన్ని తయారుచేశారు. అందువల్ల అనేక ప్రజాసమూహాలు, శారీరక మానసిక, ఆర్థిక అవస్థలకు గురయినాయి. ప్రజలు అభివృద్ధి చెందలేకపోయారు. ముఖ్యంగా భారతదేశం ఎంతో వెనుకబడి పోయింది.



శివుని ఆజ్ఞ లేనిది చీమైన కుట్టదంటారు. కారణం లేకుండా ఏది జరగదని దీని అర్థం. కాని సమాజంలో కారణానికి ఏ ప్రా ధాన్యతా లేకుండా చేశారు. తార్కిక ఆలోచన చచ్చిపోయింది. పరిశోధనలకు ప్రోత్సాహం లేదు. కొన్ని సంవత్సరాల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు విదేశాలకు పోయారు. ఆ దేశాలు అభివృద్ధి చెందాయి. సంతోషించాల్సిన విషయం ఒకటి తెలిసింది. అనేక దేశాలలో దైవం, మహిమలను నమ్మని వారి సంఖ్య పెరిగిందట. ఎటూ తేల్చుకోలేని వారూ ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారట? అంటే మూఢవిశ్వాసాల సంఖ్య తగ్గిపోయింది. అయితే మనదేశంతో మాత్రం మూఢవిశ్వాసుల సంఖ్య ఎక్కువగానే ఉంది. మరి మన కర్తవ్యం ఏమిటి? మనదేశం వృద్ధి చెందాలంటే మనం ఏం చేయాలి? మనమిలాగే ఆలోచిస్తూ ఉంటే బహుళజాతి సంస్థలు మన సహజ సంపదను తరలించుకుపోతాయి. విదేశాలు అభివృద్ధి చెందుతాయి. పారిశ్రామికంగా విదేశాల పాలనలో ఉంటాం. 'మనం ఇన్వెంట్ ఇన్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా' అని నినదించాలి. అందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలి. విద్యారంగంలో, సమాజంలో, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసినపుడు మన దేశంలో పరిశోధనలకు, ఆవిష్కరణలకు అవకాశం ఉంది. ఆవిష్కరణలు లేకుంటే, దేశం అభివృద్ధి చెందదు. పై నినాదాలు నినాదాలుగానే ఉంటాయి.

శాస్త్రీయ సమాజం, విజ్ఞాన సమాజం ఏర్పడేందుకు కృషి చేయాలని రాజ్యాంగ రచయితలు రాసిపెట్టారు. ఈ విషయం ప్రభుత్వాధినేతలకు తెలుసు. కానీ, చిత్తశుద్ధితో తగినంత కృషి చేయలేదు. ఉన్నత పాఠశాల విద్యలో సామాన్య శాస్త్ర పాఠాల రచయితల లక్ష్యాలు, పాఠాలు శాస్త్రీయ దృక్పథం పెంచే విధంగానే ఉన్నాయి. కానీ సైన్స్ బోధించే ఉపాధ్యాయులకు కూడా మూఢవిశ్వాసాలున్నాయి. అది వారి తప్పుకాదు. వారి కుటుంబ నేపథ్యం పాత విధానాలు, విద్యార్థులకు మూఢనమ్మకాలున్నాయి. గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు, సమాజ ప్రభావం ఎక్కువగా ఉంది. హేతువాద దృక్పథం ఉన్న కొంతమందికి, మూఢవిశ్వాసాలుం డవు. కానీ మూఢ విశ్వాసాలపై మాట్లాడాలంటే భ యం, మూఢవిశ్వాసాలను పెంచిన వర్గం ప్రభావం అంత గట్టిది మరి. ఈ భయం పోవాలి. విద్యార్థులు సైన్స్ సూత్రాలను నిత్య జీవితంలో అనువర్తించుకోవాలి. తల్లిదండ్రులను చైతన్యవంతుల్ని చేయాలి. విడమరచి చెప్పాలి. ఈ విద్యార్థుల నుంచి వచ్చిన యువత దేశ అభివృద్ధికి వెన్నెముక అవుతుంది. అందరిలో సిగ్గుపడటం ఎక్కువ అయింది. ఇది పోవాలి. ధైర్యంగా ఏమిటి? ఎందుకు? ఎలా? అని ప్రశ్నించుకోవాలి ప్రశ్నించాలి. విచక్షణతో జీవిత విధానాలను నిర్ణయించుకోవాలి, నిర్వహించుకోవాలి. ఈ యువత తమ పిల్లలను అలాగే పెంచాలి. క్రమంగా నూతన వైజ్ఞానిక సమాజం ఏర్పడుతుంది. ప్రకృతిని అర్థంచేసుకుంటా రు. ప్రకృతిని చెడగొట్టరు. ఆనందంగా జీవిస్తారు. 'రొట్టెను విరుచుకొని తినొద్దు కడుక్కొని తాగా'లంటారు. ఈ సామెత మన భూమితల్లిని ఉపయోగించుకోవటంలోనూ పాటించాలి. శాస్త్రీయ దృక్పథం పాపాలు చేయమనదు. దయ, కరుణ చెపుతుంది. దైవం, మత భావనలు పునాదిగానే ఎన్నో మారణ హోమాలు జరిగాయి... జరుగుతున్నాయి.

కర్క మహేందర్‌రెడ్డి

(నేడు నేషనల్ సైన్స్ డే)

నిరుద్యోగులతో ఆటలు తగదు

మన లేఖలు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ ఉద్యోగాల కోసం నిర్వహించే ప్రతి పరీక్షను రాజధాని నగరంలో నిర్వహించడం పాలసీగా పెట్టుకోవడం మూలంగా అభ్యర్థుల బాధలు వర్ణనాతీతంగా మారుతున్నది. ముఖ్యంగా ఆడపిల్లలైతే ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక జిల్లా నుంచి పరీక్ష సెంటర్‌కు వెళ్ళడమే అతిపెద్ద పరీక్షవుతున్నది. ఈ పరీక్షలు రాసేవాళ్ళు కూడా పేద, మధ్యతరగతి వాళ్ళేనన్నది గమనార్హం. వలసవాద ప్రభుత్వాలు కూడా ఇట్లాంటి ఇబ్బందికర పరిస్థితులకు గురిచేయలేదు. కమిషన్ వాళ్ళ ఉద్దేశం నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం రాకుండా చేసే కుట్రలో భాగమేమోనన్న అపోహలకు దారితీస్తున్నది. గ్రూపు -2, గురుకుల విద్యాలయ, రేపు జరుగబోయే టీఆర్‌టీ పరీక్షలు కూడా రాజధానిలో జరుపడం ఆర్టీసీకి ఆదాయం ఒనగూర్చడమని కూడా పెక్కుమంది అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. నిరుద్యోగులను, నిరాశ నిస్పృహలకు గురిచేయకుండా తాము రాసే ఏ పరీక్ష అయినా ప్రశాంతంగా రాసే పరిస్థితి కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహిస్తున్న ఏ పరీక్షయినా సజావుగా నిర్వహించిన పాపాన పోలేదు. మహామేధావులని పేరు తెచ్చుకొన్న పెద్దల నిర్వహణ బడుగుజీవుల పాలిట బండశాపంగా మారడం విషాదకరమే కాదు విచారకరం కూడా. ఇట్లాంటి దొంగాటల కారణంగా ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత కల్పించే పరిస్థితి లేకపోలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి నిరుద్యోగుల పట్ల సానుకూల వైఖరి కల్గి ప్రశాంత వాతావరణంలో ఆర్థికభారం, మానసిక వేదన కల్గించని రీతిలో నిర్ణయాలు గైకొనాలి. సత్వరం అమలు చేయాలి.

-నల్లెల్ల రాజయ్య
వరంగల్

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com
చిరునామా : Manam Telugu Daily,
D.No. 6-3- 864/4/B, SBN Acrade 4th & 5th floor,
Green lands, opp. Green park Hotel,
Hyderabad, 500016, Telangana.

వాళ్ళు వారధులే!

- వరవరరావు, విప్లవ రచయిత, సాహిత్య విమర్శకుడు, కవి



ముద్ర: ప్రజానిరసనోద్యమాన్ని మావోయిస్టులు తమ మనుగడకు ఊతంగా వాడుకుంటున్నారన్న వాదన మీద మీ అభిప్రాయం ఏమిటి?

వరవరరావు: మావోయిస్టులు నిరసనను వాడుకునే వారు కారు. రాజ్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజల రాజకీయాల్ని కేంద్రంగా చేసుకుని పని చేస్తున్న వారు. ప్రత్యామ్నాయ ప్రజారాజకీయ వ్యవస్థను నెలకొల్పడానికి తమంత తాముగా ఒక పోరాటాన్ని ఎంచుకున్న వారు. వారు ఈ పోరాటాన్ని ప్రజలకు తాము అందించే సహకారంగా భావిస్తారు. ప్రజలు సాయుధమై ఈ సమాజాన్ని మార్చాలి. ప్రజల్ని సాయుధుల్ని చేసి, ప్రజల అజెండాను అమలు చేయడానికి, ప్రజలు అధికారంలోకి రావడానికి, ఆగ్రహ రూపం నుంచి విప్లవస్ఫూర్తితో పోరాడుతారు మావోయిస్టులు. మనం బానిసలం అనుకునే వాళ్ళు నిజంగా బానిసలు కారని, వాళ్ళ మౌనంలోనే ఒక ధిక్కారం ఉందని, మౌనం కూడా గోడకు వేలాడదీసిన తుపాకీ లాంటిదేనని కాళోజీ చెప్పిన మాటల్ని గుర్తుంచుకోవాలి. వ్యవస్థ, రాజ్యం, కేంద్రం...వీటి మీదే వారి పోరాటం ... కేంద్రం అంటే కేంద్రీకృత అధికారం అన్నమాట. ప్రజాస్వామ్యం లో అధికారం కేంద్రీకృతం కాకూడదు. అయితే వికేంద్రీకరణ పేరు చెప్పి అధికార కేంద్రీకరణకే బాటలు వేస్తున్నారిప్పుడు. ఉదాహరణకు తెలంగాణలో అధికార వికేంద్రీకరణ పేరు చెప్పి, 31 జిల్లాలుగా విభజించారు. ప్రతి జిల్లాకు ముగ్గురు ఐపిఎస్ అధికారుల్ని నియమించారు. ఇక్కడ అధికారం వికేంద్రీకృతమవు తూనే కేంద్రీకృతమవుతోంది. కూల్చాల్సింది రాజ్యాన్ని. ప్రజల నిరసనకు, రాజ్యానికి మధ్య మావోయిస్టులు వారధిగా ఉంటున్నారే తప్ప, ప్రజా నిరసనను వారు వాడుకోవడం లేదు.

తూణీరం

స్వేచ్ఛను కోల్పోయింది

- అల్లం నారాయణ, తెలంగాణ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు



ముద్ర: ప్రజా నిరసన పట్ల ప్రస్తుత మీడియా వైఖరి ఎలా ఉంది?

అల్లం నారాయణ: మీడియా పాతపద్ధతుల్లో స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేదిప్పుడు. అది స్వేచ్ఛను కోల్పోయింది. నిష్పాక్షిక ధోరణి కరవవుతోంది. అడ్వర్‌టైజ్‌మెంట్లు, రాజకీయ ఒత్తిళ్ళు, కార్పొరేట్ ఒత్తిళ్ళ మధ్య మీడియా తన ప్రాబల్యాన్ని కోల్పోయింది. ప్రజానిరసనల్ని పట్టించుకోవడం లేదు. నిజమైన సమస్యల మీద దృష్టిని కేంద్రీకరించకుండా, అప్రస్తుత విషయాలకు ఎక్కువ ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నారు. అసలైన సమస్యల్ని పట్టించుకోక పోవడం మీడియా లక్షణంగా మారింది. ప్రజా సందోహాల్ని, నిరసనల్ని మీడియా మరింతగా పట్టించుకోవలసిన అవసరం ఉంది.

నిరసనోద్యమ స్ఫూర్తికి మహిళలే చిరునామా!

- కొండవీటి సత్యవతి, భూమిక సంపాదకురాలు, మహిళోద్యమ నేత



ముద్ర: దళిత, మైనారిటీ, మహిళా సమస్యల పట్ల నిరసనోద్యమాలు ఆశించిన ప్రగతిని సాధిస్తున్నాయా?

కొండవీటి సత్యవతి: నిరసన అన్నది ఒక ప్రజాస్వామిక హక్కు. ప్రజాస్వామ్యంలో నిరసనను వ్యక్తం చేయడం చాలా ముఖ్యం. ప్రజల గొంతును, వారి ఆకాంక్షలను ప్రభుత్వానికి వినిపించాలంటే నిరసన మంచి మార్గం. ఉదాహరణకు మణిపూర్‌లో మనోరమా దేవి మీద అత్యాచారం జరిగిన తరువాత మహిళలు వీధుల్లోకి వచ్చి, నగ్న ప్రదర్శన చేశారు. దాంతో మణిపూర్‌లో జరుగుతున్న దాష్టీకాలు ప్రపంచానికి తెలిశాయి. అలాంటి నిరసనను మహిళలే చేయగలరు. మహిళల శరీరాల చుట్టూ అల్లిన భ్రమని వదిలించుకుని, ఒక అరాచకానికి వ్యతిరేకంగా స్త్రీలు మాత్రమే అలాంటి నిరసనను వ్యక్తం చేయగలరు. గౌరీలంకేష్ హత్య, నిర్భయ సంఘటనల్లో కూడా మహిళలే ఎక్కువగా నిరసనను వ్యక్తం చేశారు. పురుషులు కూడా అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తారు కానీ, మణిపూర్ మహిళల నగ్నప్రదర్శన అన్నది సమస్య తీవ్రతను తెలియజెప్పిన సంఘటన. సమాజంలో ఎలాంటి ఒత్తిళ్ళు తలెత్తినా, అంటే ఉదాహరణకు మైనారిటీలనే తీసుకోండి..., కర్ఫ్యూ విధించినపుడు పాతబస్తీలాంటి ప్రాంతాల్లో మహిళల్ని మాత్రమే బయట తిరగడానికి అనుమతిస్తారు. అలాంటి ఒక సందర్భంలో మహిళలు మానవహారంగా నిలబడిన సంఘటన మహిళల పోరాటస్ఫూర్తికి అద్దం పడుతుంది. ఎలాంటి ఆంక్షలు ఉన్నా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మహిళలు తమ నిరసనను తీవ్రంగా వ్యక్తం చేయగలరు. కాశ్మీర్‌లో కూడా మహిళలే ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారు. అభివృద్ధి పేరిట అడవుల్ని ధ్వంసం చేస్తున్నపుడు ఆదివాసీ మహిళలే ఆ ప్రయత్నాల్ని గట్టిగా తిప్పికొడుతున్నారు. ఇలాంటి నిరసనోద్యమాల్ని మహిళలు మాత్రమే చేయగలరు.

- ఇంటర్వ్యూలు: పసుపులేటి గీత

పదం



ఫ్రిస్కో ఫైవ్: కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో పోలీస్ డిపార్ట్‌మెంట్ మిషన్ స్టేషన్ ఎదురుగా 21 ఏప్రిల్, 2016న ఐదుగురు నిరసనకారులు నిరాహార దీక్షకు పూనుకున్నారు. జాతివివక్షకు పాల్పడి, చట్టానికి వ్యతిరేకంగా పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారన్నది వీరి నిరసనకు కారణం. ముఖ్యంగా అలెక్స్ నీటో, మారియో వుడ్స్, అమిల్కర్ పెరెజ్ లోపెజ్, లూయిస్ గోన్గోరాల హత్యలకు నిరసనగా వీరు నిరాహారదీక్ష చేశారు. ఐక్ పిన్కస్టన్, సెల్లాసీ బ్లాక్‌వెల్, ఎడ్విన్ లిండో, మారియో గూటెరెజ్, ఇల్యీజ్ ఎక్విప్టో శాటోలు నిరాహార దీక్ష చేశారు. వీరంతా సంగీతకారులు, విద్యాధికులు, రాజకీయవేత్తలు.


పథం

చట్టాన్ని అతిక్రమించి వ్యక్తం చేసే నిరసన ప్రజాస్వామ్యాన్ని తృణీకరించడం కాబోదు, అది అత్యవసర చర్యే!

- హోవర్డ్ జిన్, అమెరికన్ చరిత్రకారుడు, రాజకీయ కార్యకర్త, నాటకప్రయోక్త

నిరసన

ప్రజాస్వామ్య గళం



ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్ళకు ఒకసారి వచ్చే ఎన్నికలు మాత్రమే కాదు, ఐదేళ్ళకు ఒకసారి మనం వేసే ఓటు మాత్రమే కాదు. రాజకీయ పార్టీల మధ్య పోటీ అసలే కాదు. ప్రజాస్వామ్యం అంటే పార్లమెంటరీ, అసెంబ్లీలు కావు. ప్రజాస్వామ్యం అంటే ఒక నిత్యానుభవం. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల తంతుగానే చూడడమన్నది ప్రజాస్వామిక మనుగడకే ప్రమాదకరం. ప్రపంచంలో ఎన్నో దేశాల ప్రజలు వీధుల్లోకి వచ్చి, తమ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఎన్నో ఉద్యమాలకు తెరతీస్తున్నారు. ఎన్నో విజయాల్ని సాధిస్తున్నారు, మరికొన్ని చోట్ల అపజయాల్ని కూడా చవిచూస్తున్నారు. ఏది ఏమైనా తమ హక్కుల రక్షణనే ప్రజాస్వామిక లక్షణంగా భావిస్తున్నారు. 'నిరసన' చరిత్రలో భారతీయ స్వాతంత్రోద్యమం ఒక మైలు రాయి. నిరసన, హింస జంట పక్షుల్లా ఉండే కాలంలో అహింసాత్మక నిరసనతో భారతీయ స్వాతంత్రోద్యమం ఒక కొత్తశకానికి నాంది పలికింది. దేశంలో గాంధీ మహాత్ముడు అహింసా మార్గంలో చేపట్టిన సత్యాగ్రహం కన్నా ప్రభావశీలమైన నిరసనోద్యమం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. అదే సమయంలో సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి వారు సాయుధ నిరసనా మార్గాన్ని ఎంచుకున్నా లక్ష్యం మాత్రం స్వాతంత్ర్య సాధనే! మనదేశంలో తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో ఒక ముఖ్యాధ్యాయం. అలాగే చిప్కో ఉద్యమం, నర్మదా బచావో ఆందోళన్ వంటి గిరిజన హక్కులు, పర్యావరణ స్పృహతో మొదలైన ఉద్యమాలు నిరసనాధ్యాయంలో సామాజిక హితానికి ఎంతగా దోహదపడ్డాయో విదితమే. అయితే ఇవాళ కులం పేరుతో, మతం పేరుతో కూడా నిరసనను చూడాల్సిన విషాద సన్నివేశంలో జీవిస్తున్నాం.

'అన్యాయం జరుగుతున్నపుడు నువ్వు తటస్థంగా ఉన్నట్టయితే, నువ్వు పీడితుల పక్షాన కాకుండా పీడించే వాడి పక్షం వహించినట్టే. ఒక ఏనుగు ఎలుక తోక మీద కాలుపెట్టి నిలబడినప్పుడు నువ్వు తటస్థంగా ఉంటే ఆ ఎలుక నిన్ను ఎన్నటికీ క్షమించదు' అని అంటారు మానవహక్కుల ఉద్యమనేత డెస్మండ్ టుటు. సగటు మనిషి తన రోజువారీ సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోగా, ఐదేళ్ళకొకసారి వచ్చే ఎన్నికల్లో ఓటు చేయడాన్ని ఎంతవరకు తన విద్యుక్త ధర్మంగా భావిస్తాడు? ఇవాళ రాజకీయనాయకులు పేద ప్రజల సమస్యల పట్ల అంటీముట్టనట్టు వ్యవహరిస్తుంటే అసలు ఓటు వేసే ప్రక్రియే అర్థరహితమని ప్రజలు అభిప్రాయ పడే స్థితి కొనసాగుతోంది. కొండొకటో ఓట్లు వేసి గెలిపించి, అధికారాన్ని అప్పజెప్పిన సగటు ప్రజల జీవితమే దినదినగండంగా మారిపోతున్న సంస్కరణల రాజకీయ కేళిని కూడా మనం చూస్తున్నాం. ఓటు వేసి తలనొప్పి కొనితెచ్చుకున్నామని సగటు ప్రజలు వాపోయిన అనేకానేక ఆధార్‌లు, నోట్ల రద్దు ప్రహసనాల్ని కూడా మనం చూశాం. ఇలాంటివన్నీ చూస్తున్నపుడు నిజమే, ఓటు వేయడం అవసరమా అన్న సందేహం కూడా వస్తుంది. నాణానికి మరో వైపు ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి, ఇంకా చెప్పాలంటే కులతత్వం, మతవాదంతో కూడా ఇటీవల నిరసనలు పెచ్చరిల్లి పోతున్నాయి. సినిమాల మీద, వ్యక్తుల పనికిరాని వ్యాఖ్యానాల మీద నిరసనలు పెరిగి పోతున్నాయి. రోడ్ల మీదే కాదు, ఆన్‌లైన్‌లో కూడా! అయితే, నిరసన రెండంచుల కత్తిలాంటిది. నిజమే, మనం అందరి లాంటి వాళ్లం కాము. నిష్కారణంగా పోలీసులు కాల్చి చంపేస్తే, జైళ్ళలో తోసేసి సంబంధం లేని కేసులు పెట్టి వేధిస్తే, పొలాలు లాక్కుని తరిమి కొడుతుంటే, పుట్టిన అడవి నుంచి వెలి వేస్తుంటే... నిరసన అన్న పదానికి అర్థం అందరికీ అర్థం కావలసిన అవసరం చాలానే ఉంటుంది. నలుగురు ప్లకార్డులు పట్టుకుని వెళుతుంటే, నలుగురు నినాదాలు చేస్తుంటే..., దారిపక్కనే నిలబడి చూస్తున్న సగటు జీవికి ఇదంతా తనకు సంబంధించిన విషయంగా కనిపించదు, బస్సులు రద్దయితేనో, ఎటిఎంలు మొరాయిస్తేనో, బంద్‌ల మూలంగా కాయగూరల ధరలు పెరిగిపోతేనో... అప్పుడనిపిస్తుంది, 'అసలు ఈ నిరసనలన్నీ ఎందుకు, ఏమిటి? మరీ ప్రతి చిన్న విషయానికి ఇలా ఇబ్బంది పెట్టేస్తున్నారు. అన్నింటికీ కారణం ప్రతివాడికీ ఇలా రోడ్లమీద పడి గోల చేసే అధికారం ఉండడమే. నేనేమీ ఇలాంటి వాడిని కాను. మర్యాదస్తుణ్ణి, అనవసరమైన కష్టాలన్నీ నాకే...' అంటూ మనలో చాలామంది వేసారి పోతుంటారు. ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేస్తుంటారు. అయితే అలా నిరసించే ముందు ప్రజాస్వామ్యానికి, నిరసనకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకుందాం. భారతదేశ ప్రజాస్వామ్యానికి 'ప్రజా నిరసన' కేంద్రబిందువు. నిరసన వ్యక్తం కాని దేశం భూగోళం మీద కాగడా వేసుకుని వెతికినా కనిపించదు. ఎందుకంటే, ప్రశ్నించడం మానవనైజం. జవాబు దక్కక పోతే నిలదీయడం కనీస హక్కు. 'లేవండి, నిలబడండి, మీ హక్కుల కోసం పోరాడండి... పోరాటాన్ని ఎన్నడూ వదలకండి' అంటారు బాబ్ మార్లీ, నిలదీయడం తన వశం కాదని, నీరుగారిపోయే సామాన్యుడికి, దీనుడికి అన్నుదన్నుగా ఒక గొంతుక నినాదమనే ప్రభాతగీతిని వినిపించి, పెనునిద్దరను వదిలించి మేలుకొలపాలి. అలా మేలుకొన్న జనబాహుళ్యాన్ని ముందుండి, ముందుకు, మున్ముందుకు నడిపించాలి. నిరసన ఒక ప్రతికూల లక్షణం కాదు, అది ఒక ప్రజాస్వామిక లక్షణం.

ప్రేరణ ఏది?

అసలు 'నిరసన'కు ప్రేరణ ఏది? ఆర్థికంగా అభివృద్ధి పథాన పయనిస్తున్న దేశంగా ముందడుగు వేస్తున్నామన్నది ఎంత సత్యమో, ఉమ్మడి సామాజిక ప్రయోజనాల దిశగా మనం దూరంగా జరుగుతున్నామన్నది కూడా అంతే సత్యం. పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతున్నట్టు ఆర్థిక ప్రగతి అంటూ చేస్తున్న అంకెల గారడీనే నమ్ముకుని, చంకలు గుద్దుకునే కాలంలో ఇంకా జీవిస్తున్నందుకు చింతించాల్సిందే. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న ఆర్థిక కుదుపులు, అమెరికాలో రాజకీయ మార్పులతో కుదేలవుతున్న భారతీయ ఐటి రంగం వంటివి మనదేశ యువతలో నిరుద్యోగ భయాన్ని మరింత పెంచేస్తున్నాయి. ఉద్యోగ అవకాశాల్లో గత ఏడాది తగ్గుదల కనిపించింది. ఇది జూలై–సెప్టెంబరు 2005 కన్నా చాలా బలహీనంగా ఉండడం గమనార్హం. ఆర్థికాభివృద్ధి, సహకార సమాఖ్య (ఒఇసిడి) అంచనా ప్రకారం 30 శాతానికి పైగా భారతీయ యువత నిరుద్యోగంతో బాధపడుతోంది. దేశంలో 15 ఏళ్ళ నుంచి 49 ఏళ్ళ మధ్య వయస్కులైన మహిళల్లో 55 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. దేశాన్ని ఇంకా బాల్యవివాహాల సమస్య పీడిస్తూనే ఉంది. ఆరు నెలల నుంచి మూడేళ్ళ వయసు పిల్లల్లో 69.5 శాతం మంది కూడా రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇదంతా ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సంస్థలు అందిస్తున్న సమాచారమే. భారతీయ జనాభా గణాంక వివరాల ప్రకారం భారతదేశంలో 71 శాతం మంది దళితులు, ఎస్సీఎస్టీయేతర వ్యక్తులు 41 శాతం మంది వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. దేశంలో మొత్తానికి 47.3 శాతం మంది రైతులు భూమిలేని నిరుపేదలే. వీరిలో దళితుల శాతం ఎక్కువగా ఉంది. ఇలా ప్రజాజీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లో నిరాశాజనకమైన వాతావరణం నెలకొని ఉండగా, అభివృద్ధి పథాన పయనిస్తున్నామన్న మాటలు ఆత్మవంచనతో కూడుకున్నవి కావా?! ప్రజలు తమ హక్కుల సాధనలో భాగంగా నిరసనోద్యమాల్ని చేపట్టడం ఇవాళ సహజ పరిణామమే కదా! అయితే ప్రజల నిరసన పట్ల ప్రభుత్వాల స్పందన ఎలా ఉన్నదన్నదే వ్యవస్థలో ప్రజాస్వామ్య మనుగడకు గీటురాయి.

వీక్షణం

నేటి నిరసన

సామాజిక అసమానతలు, దారిద్ర్యం, పెరుగుతున్న నేరాలు, వివక్ష, న్యాయ వ్యవస్థ మందకొడితనం వంటివి భారతీయ 'నిరసన'కు ఆజ్యం పోస్తున్నాయి. మరోదారి కనిపించని పరిస్థితుల్లో తమ ఫిర్యాదును అందరి దృష్టిలోకి తీసుకురావడం, తమ డిమాండ్లకు న్యాయబద్ధతను కల్పించడం వంటి అవసరాలు 'నిరసన'కు దారితీస్తున్నాయి. బహుళ సంస్కృతులకు ఆలవాలమైన భారతీయ ప్రజాస్వామ్యానికి 'భావవ్యక్తీకరణ స్వేచ్ఛ' అన్నది వెన్నెముక. సాధారణంగా నిరసనోద్యమాలన్నవి సామూహిక లక్ష్యాలకు సంబంధించినవై ఉంటాయి. విభిన్న సంస్కృతులకు, ప్రాంతీయ ప్రయోజనాలకు ఆలవాలమైన మనదేశంలో నిరసనోద్యమాల్లో పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు సర్వసాధారణం. ప్రజల పట్ల బాధ్యతాయుత పాత్రను నిర్వహించడంలో ప్రభుత్వ, న్యాయ వర్గాలు విఫలమైనప్పుడు ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ గళాన్ని వినిపిస్తారు. అలాంటి సందర్భాల్లో ప్రభుత్వ వర్గాలు తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పోలీసు వ్యవస్థ ద్వారా బలప్రయోగానికి పాల్పడుతాయి. గౌరీలంకేష్ వంటి జర్నలిస్టుల హత్య, ఇస్లామిక్ వర్గాల పట్ల భయసందేహాలు, దళితులు, ముస్లింల అణచివేత వంటివి ఇటీవలి కాలంలో భారత దేశ చిత్రపటమ్మీద కనిపిస్తున్న నిరసన దృశ్యాలు. కరువు, అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం, బ్యాంకు రుణభారం, నిర్భయ వంటి సంఘటనల్లో మహిళలకు కరవవుతున్న రక్షణ వంటివి దేశంలో భారీ నిరసనోద్యమాలకు వేదికలయ్యాయి. వీటిలో నిర్భయ వంటి నిరసనోద్యమాలు చట్టంలో అవసరమైన మార్పులకు దోహదపడ్డాయి. రోహిత్ వేముల ఆత్మహత్య అనంతరం హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో వెల్లువెత్తిన నిరసన, కన్హయకుమార్ అరెస్టు తరువాత జవహర్‌లాల్ విశ్వవిద్యాలయంలో చెలరేగిన నిరసనోద్యమం వంటివి ఒకవైపు చోటు చేసుకోగా, గుర్మీత్ రామ్ రహీమ్ బాబాకు మద్దతుగా కూడా పెద్దయెత్తున నిరసనోద్యమం జరగడం గమనార్హం. ప్రజాస్వామ్యంలో ఆగ్రహం, నిరసన అన్నవి ఒకానొక సహేతుక కోణాన్ని కలిగి ఉంటాయి. సామాజిక మాధ్యమాలు లేదా పత్రికలకు లేఖలు రాయడం, పోలీసులకు ఫిర్యాదు చేయడం వంటివి విద్యావంతులు అనుసరించే నిరసన మార్గాలైతే, పేదలు, ఇతర నిమ్నవర్గాల నిరసన కొంత భిన్నంగా ఉంటుంది. దేశంలో కేవలం గిరిజన మహిళలు ప్రారంభించిన చిప్కో ఉద్యమమే దీనికి ఉదాహరణ. పర్యావరణ సంరక్షణ దిశగా ఈ ఉద్యమం ఎంతగొప్పదో అందరికీ తెలిసిందే. భారతీయ నిరసనోద్యమ చరిత్రలో ఒక విశేషం ఉంది, ఇక్కడ అత్యాచార బాధితుల కోసం నిరసనోద్యమాలు జరుగుతాయి, అదే సందర్భంలో అత్యాచారాలు చేసిన వారి కోసం కూడా నిరసన ప్రదర్శనలు జరుగుతాయి. రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు తలెత్తితే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కూడా ప్రజలు ఉద్యమిస్తుంటారు.



ఢిల్లీలో తమిళ రైతుల నిరసన

నిరసనను ప్రజలు పలురకాలుగా వ్యక్తం చేస్తుంటారు. చేతికి నల్లని బ్యాండ్లని ధరించడం, తలకు నల్లటి వస్త్రాన్ని కట్టుకోవడం, కొవ్వొత్తుల్ని వెలిగించడం వంటివి శాంతియుత నిరసనోద్యమ పద్ధతులు. సామాజిక ప్రయోజనాల కోసం నిరసనోద్యమాలు జరిగే చోటే, ఈ దేశంలో ప్రియాంక చోప్రా చాలీచాలని బట్టలు కట్టుకుందని, పద్మావత్ సినిమా ఒక వర్గం మనోభావాల్ని కించపరుస్తోందంటూ జనం ఆగ్రహించారు. 'గాడ్‌మ్యాన్ టు టైకూన్ : ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బాబా రామ్‌దేవ్', 'ది హిందూస్ : యాన్ ఆల్టర్‌నేటివ్ హిస్టరీ' వంటి పుస్తకాలకు వ్యతిరేకంగా కూడా నిరసనోద్యమాలు జరిగాయి. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ మీద నిషేధాస్త్రాలను ప్రయోగించడమన్నది ఇటీవలి కాలంలో భారతీయ ప్రజాస్వామిక స్ఫూర్తిని పరీక్షకు నిలబెట్టింది. దేశంలో స్వేచ్ఛను రక్షిస్తూనే, తగుమాత్రం కట్టడిని కూడా విధించాల్సిన చిత్రమైన పరిస్థితిలో పడుతున్నాయి సంబంధిత వ్యవస్థలు. సమాజంలో సహిష్ణుత అన్నది ఏ స్థాయిలో ఉందో అర్థమైతే తప్ప దేశంలో ప్రజాస్వామ్యానికి వచ్చిన ఉపద్రవమేమిటో అర్థం కాదు. నిరసన పేరిట మొదలయ్యే ఉద్యమాలు క్రమేణా అసలు కారణానికి తిలోదకాలిచ్చి, కుహనా విలువల చుట్టూ, కుహనా భావజాలం చుట్టూ తిరగడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. నిరసనోద్యమాల్ని, నిరసనల్ని టిఆర్‌పి రేట్లు పెంచుకునేందుకు, సంచలనం పేరిట స్వప్రయోజనాల్ని నెరవేర్చుకోవడానికి మీడియా దుర్వినియోగపరుస్తున్న వైనం కూడా మనకు కొత్తేమీ కాదు. అన్యాయాన్ని నిలువరించడం, పేదల సంక్షేమానికి పాటుపడడం, నిమ్నవర్గాల ప్రయోజనాల్ని సంరక్షించడం, జాతీయభద్రతకు అన్నుదన్నుగా నిలవడం వంటివి ప్రతిఒక్కరి కనీస బాధ్యత. నిరసన ప్రజాస్వామ్య రక్షణకు వేదిక కావాలి.

-కల్కి

ప్రశ్నించడమే లక్ష్యం

కిటికీ




ఉద్వేగభరితమైన సత్యమే నిరసన! ఉద్వేగం కళాకారుల జీవ లక్షణం. అలాగే మానవచరిత్ర అనాది నిరసనకు ఎలా వేదిక అయిందో, 'నిరసన కళ' కూడా అలాగే చరిత్రకు ఒక మూలధనమైంది. తాము నిజమని నమ్మినదాన్ని చెప్పడానికి కళాకారులు ఎంతకైనా తెగించగలరు. వారి నిరసనలో కాసింత అసభ్యత కూడా చోటు చేసుకుంటే, చేసుకోనీ గాక, చెప్పదలచుకున్న నాలుగు మాటల్ని ఒక్క బొమ్మలో చెప్పేస్తారు. నిగ్గదీసి మరీ అడిగేస్తారు, నిలువునా కడిగేస్తారు. సూటిదనమే నిరసన కళకు మొదటి సూత్రం. చరిత్రలో నిరసన అనేది ఛాందస భావజాలాన్ని సూటిగా నిగ్గదీసింది. సమాజంలో పాతుకు పోయిన ఛాందసత్వాన్ని నిరసన కళ ప్రశ్నిస్తుంది, ఎద్దేవా చేస్తుంది. అందువల్ల నిరసన కళలో రాజకీయ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తుంటాయి. రాజకీయ పరమైన భావజాలాన్ని వ్యక్తం చేయడానికి నిరసన కళ ఒక శక్తిమంతమైన ఆయుధంగా కూడా ఉపయోగపడుతుంది. అణచివేత, హింస, అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా అనేక దేశాల్లో కళాకారులు ప్రతిభనే తమ గళంగా మార్చుకుని ప్రజల తరపున నిరసనను వ్యక్తం చేశారు.

పాబ్లోపికాసో: స్పానిష్ కళాకారుడైన పికాసోని ఆధునిక చిత్రకళకు పితామహునిగా చెప్పవచ్చు. ఆయన చిత్రించిన ఆయిల్ పెయింటింగ్ 'గుయెర్నికా' ప్రపంచ నిరసన కళకు కిరీటమే! పారిస్‌లోని తన సొంత ఇంటిలో ఆయన దీనిని ఒక కుడ్యచిత్రంగా చిత్రించారు. ఉత్తర స్పెయిన్‌లోని బాస్క్ కౌంటీ అనే గ్రామం మీద నాజీలు జరిపిన బాంబుదాడికి నిరసనగా పికాసో ఈ పెయింటింగ్‌ను చిత్రించారు. స్పానిష్ అంతర్యుద్ధాన్ని ప్రపంచం దృష్టికి తీసుకు వచ్చింది ఈ పెయింటింగ్.



ప్యోటర్ పావ్‌లెన్స్కీ: ఈయన ఒక వివాదాస్పద పర్‌ఫార్మెన్స్ ఆర్టిస్టు. నిరసనను కళాత్మకంగా వ్యక్తం చేసేందుకు తన శరీరాన్ని ఛిద్రం చేసుకుంటాడీయన. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడిన నేరంపై ఒకానొక సంగీత బృందాన్ని అరెస్టు చేసినందుకు నిరసనగా 2012లో తన పెదవుల్ని గాయపరచుకుని నిరసనను వ్యక్తం చేశాడు. రష్యన్ సమాజంలో నెలకొన్న వివక్షాపూరిత రాజకీయ ధోరణుల్ని నిరసిస్తూ ఈయన మరో సందర్భంలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఒక ప్రభుత్వ కార్యాలయం ఎదురుగా నగ్నంగా కూర్చుని తన మర్మాంగాన్ని గాయపరచుకున్నాడు. మానసిక రోగుల్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వం అన్యాయాలకు పాల్పడుతోందని ఆయన ఒక గోడ మీద కూర్చుని, తన చెవిని తెగ్గోసుకున్నాడు. 'కత్తి నా చెవిని నా శరీరం నుంచి వేరు చేస్తుంది, గోడ మానసిక రోగులకు, ప్రపంచానికి మధ్య వారధిగా నిలుస్తుంది. పిచ్చివాళ్ళ నుంచి పిచ్చిలేని వాళ్ళని విడదీసే బాధ్యతను ప్రభుత్వం పోలీసులకు అప్పజెప్పడం సరికాదు' అంటూ తన ఉద్దేశాన్ని వివరించారాయన.

మెరుపు



దేశంలోనే అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టులో భాగంగా మహదేవ్‌పూర్ మండల పరిధిలోని మేడిగడ్డ ప్రాంతంలో చేపట్టిన మేడిగడ్డ బ్యారేజీ పనులను ఎంపీ కవిత మంగళవారం పరిశీలించారు. మంథని ఎమ్మెల్యే పుట్ట మధూకర్, ఎమ్మెల్యే రాజిరెడ్డిగోవర్ధన్‌రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఎంపీ వెంట ఉన్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు, పనులు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్టు వివరాలను ఎంపీ కవితకు వివరించారు. బ్యారేజీ నిర్మాణ పనులను సందర్శించిన అనంతరం ఎంపీ కవిత విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం కాబోతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంతో రాష్ట్రంలో సాగు నీరు, తాగు నీటి కష్టాలు తొలగిపోతాయన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా మూడు షిఫ్టులలో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశంలో ఒక గొప్ప అద్భుతం అని కవిత అన్నారు. భవిష్యత్తు తరాలు అభివృద్ధి చెందాలంటే కాళేశ్వరం సత్వరమే పూర్తి కావాలన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా శ్రమిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ హసీనాభానొ, ఎంపీపీ వసంత, కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్ రావ్, సింగిల్ విండో చైర్మెన్ శ్రీపతిబాపు తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కవిత పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎంపీ రాక సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, టీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఆమె అభిమానులు మేడిగడ్డ బ్యారేజీ వద్దకు తరలివచ్చారు. ఎంపీ కవితతో సెల్ఫీల కోసం పోటీపడ్డారు.

కేసు క్లోజ్



(మొదటి పేజీ తరువాయి)

చేసి మృతదేహాన్ని తరలించడానికి వీలుగా బంధువులకు అప్పగించారు. దాంతో దుబాయ్‌లోనే రసాయనాలతో ఎంబామింగ్ ప్రక్రియ పూర్తయ్యి.. సాయంత్రం సమయంలో రిలయన్స్ గ్రూపునకు చెందిన ప్రత్యేక జెట్ విమానంలో మృతదేహాన్ని ముంబై నగ రానికి తరలించారు. దాంతో దేశంలోని ఏకైక మహిళా సూపర్‌స్టార్ మృతిపై మూడు రోజుల పాటు కొనసాగిన హై డ్రామా ముగిసినట్లయింది. శ్రీదేవి భర్త బోనీకపూర్‌తో పాటు సవతి కుమారుడు అర్జున్ కపూర్ కూడా దుబాయ్ వెళ్లి.. దగ్గరుండి ఆమె మృతదేహాన్ని ముంబై తీసుకొచ్చారు. సమీప బంధువు మోహిత్ మార్వా పెళ్లి కోసం దుబాయ్ వెళ్లిన శ్రీదేవి.. అక్కడి జుమైరా ఎమిరేట్స్ టవర్స్‌లోని రూం నెంబర్ 2201లో డిన్నర్ కోసం రెడీ అయ్యేందుకు బాత్రూంకి వెళ్లి.. అక్కడే బాత్‌టబ్‌లో నిర్జీవంగా పడిపోయిన సంగతి తెలిసిందే. తొలుత కార్డియాక్ అరెస్టు వల్లే ఆమె మరణించినట్లు చెప్పినా, ఆ తర్వాత మాత్రం బాత్ టబ్ విషయం బయటకొచ్చింది. దాంతో పలు అనుమానాలు తలెత్తాయి. మధ్యలో బోనీ కపూర్ విచారణ, ఆయన పాస్‌పోర్టు స్వాధీనం చేసుకోవడం లాంటి పరిణామాలతో అనుమానాలు మరింత బలపడ్డాయి కూడా. కానీ ఎట్టకేలకు మంగళవారం సాయంత్రానికి దుబాయ్ ప్రాసిక్యూషన్ విభాగం వాళ్లు అనుమానాలేమీ లేవని కేసు క్లోజ్ చేయడంతో అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. శ్రీదేవి మృతదేహాన్ని విడుదల చేయడానికి అవసరమైన లేఖలను దుబాయ్ పోలీసులు మంగళవారం మధ్యాహ్నం సమయంలో భారత రాయబార కార్యాలయానికి అందజేశారు. దాంతో తొలుత ఎంబామింగ్ ప్రక్రియకు మార్గం సుగమం అయ్యింది. దుబాయ్ పోలీసులు తమతో పాటు శ్రీదేవి కుటుంబ సభ్యులకు కూడా లేఖలు అందజేశారని, దాంతో మృతదేహం విడుదలకు ఎలాంటి ఆటంకం కలగలేదని దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం ఒక ట్వీట్‌లో తెలిపింది. ఎంబామింగ్ ప్రక్రియ పూర్తయ్యి, మృతదేహాన్ని అప్పగించిన తర్వాత సాయంత్రం 5.30 గంటల సమయంలో శ్రీదేవి మృతదేహం దుబాయ్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అక్కడ రిలయన్స్ గ్రూపునకు చెందిన ప్రైవేటు జెట్ విమానం సిద్ధంగా ఉండటంతో.. దాంట్లో తరలించారు. రాత్రి 9 గంటల సమయంలో ముంబై విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత.. అక్కడినుంచి శ్రీదేవి బంగ్లాకు తరలించారు.

దుబాయ్ వెళ్లిన అర్జున్ కపూర్

శ్రీదేవి బతికున్నప్పుడు ఆమె తన తల్లి కాదని.. కేవలం తన తండ్రికి భార్య మాత్రమేనని చెబుతూ వచ్చిన సవతి కొడుకు అర్జున్ కపూర్.. ఆమె మరణించిన తర్వాత మాత్రం మృతదేహాన్ని దగ్గరుండి తీసుకొచ్చేందుకు స్వయంగా దుబాయ్ వెళ్లాడు. అక్కడున్న తన తండ్రికి సాయంగా ఉండి.. సవతి తల్లి మృతదేహాన్ని తీసుకొచ్చే ప్రయత్నాలలో ఊతం అందించాడు.

సెలబ్రేషన్ క్లబ్‌లో సందర్శన

దుబాయ్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబై చేరిన శ్రీదేవి భౌతిక కాయానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు ప్రకటించారు. ఆమెకు తుది నివాళి అర్పించడం కోసం భౌతిక కాయాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటలదాకా సెలిబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రాంగణంలో ఉంచుతారు. అనంతరం మధ్యాహ్నం ఊరేగింపుగా తీసుకెళ్లి పవన్‌హన్స్ విద్యుత్ శ్మశానవాటికలో 3:30 గంటలకు అంతిమ సంస్కారాలు పూర్తిచేస్తారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రారంభమయ్యే అంతిమయాత్రలో పలువురు బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖులు కూడా పాల్గొంటున్నారు. టాలీవుడ్ నటీనటులు బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి ముంబైకి వెళ్లనున్నారు.

మద్యం మత్తు వల్లే ప్రమాదమా?

మరణం సంభవించే సమయానికి శ్రీదేవి మద్యం మత్తులో ఉన్నారని.. అందుకే బాత్రూంలో బాత్‌టబ్‌లో పడిపోయి ఉంటారని దుబాయ్‌కి చెందిన గల్ఫ్ న్యూస్ ఒక కథనంలో పేర్కొంది. అయితే, ఈ కథనాన్ని పోలీసులు మాత్రం నిర్ధారించలేదు. అందువల్ల శ్రీదేవి నిజంగానే మత్తులో ఉన్నారా.. లేదా అన్నది తేలలేదు.

ఆరునూరైనా సింగరేణిని ప్రైవేటీకరించం

ప్రాణం పోయినా సరే అడ్డుకుంటాం: కేసీఆర్



ఆదిలాబాద్/మంచిర్యాల, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బొగ్గు గనులను ప్రైవేటీకరించాలని నిర్ణయించినప్పటికీ.. ఆరునూరైనా సింగరేణిని ప్రైవేటీకరించే ప్రశ్నేలేదని సీఎం కేసీఆర్ ఉద్ఘాటించారు. ప్రాణం పోయినా సరే సింగరేణిని ప్రైవేటీకరించే ప్రశ్న ఉత్పన్న కాదని స్పష్టం చేశారు. అవసరమైతే.. కేంద్ర ప్రభుత్వ వాటాను ఎంతో చెబితే వారి వాట వారికి ఇచ్చి సింగరేణిని రాష్ట్ర ప్రభుత్వ ఆస్తిగా చేసుకుంటాం తప్ప ప్రైవేటీకరణను ఒప్పుకోమన్నారు. సింగరేణి కార్మికులు సరిహద్దుల్లో పని చేసే సైనికులుగా పరిగణిస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల పర్యటనలో భాగంగామ మంగళవారం సీఎం కేసీఆర్ నస్పూర్‌లోని సిరికె కాలనీలో సింగరేణి క్వార్టర్లను పరిశీలించారు. కార్మికుల సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. మణుగూరు ఏరియాలో కొండపురం, రాంపూర్ షాఫ్ట్‌బ్యాక్, కేకే-6 ఇంక్లెయిన్, కాశిపేట-2 ఇంక్లెయిన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేటీకే-3,5 ఇంక్లెయిన్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీరాంపూర్‌లో సింగరేణి కార్మికుల ఆత్మీయ సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణి కార్మికులకు పలు వరాలు ప్రకటించారు. కార్మికులకు దశలవారిగా 10 వేల క్వార్టర్లు నిర్మిస్తామని, మంగళవారం నుంచే సింగరేణి కార్మికులు విద్యుత్, నీటి బిల్లులు చెల్లించాల్సిన పనిలేదన్నారు. సింగరేణి భూముల్లో ఇండ్లు క ట్టుకున్న కార్మికులకు ఇండ్ల పట్టాలు ఇస్తామన్నారు. కొత్త క్వార్టర్ల నిర్మాణానికి యాజమాన్యం నాలుగు వందల కోట్లు ఇస్తుందని చెప్పారు. శ్రీరాపూర్‌లో 156 ఎకరాల్లో ఇండ్ల పట్టాలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మంచిర్యాల అభివృద్ధి పనులకు 15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్లు కేసీఆర్ తెలిపారు. రిటైర్ అయిన కార్మికులకు ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తామని, పది లక్షల లోపు ఇంటి రుణానికి వడ్డీ మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. కారుణ్య నియామకాల్లో అందరికీ అవకాశం వస్తుందన్నారు. మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు. మార్చి మొదటి వారం నుంచి మెడికల్ బోర్డు పని చేస్తుందన్నారు. ఇందులో గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు చెందిన నిపుణులు ఉంటారని సీఎం తెలిపారు. రెండుమూడు రోజుల్లో టీబీజీకేఎస్ కమిటీ ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. సభ్యత్వ ఫీజు కంటే ఒక్క రూపాయ కూడా యూనియన్‌కు చెల్లించవద్దని కోరారు. అంతకుముందు ముఖ్యమంత్రి ఆదిలాబాద్‌లో పర్యటించారు. ఆదిలాబాద్ లోని డైట్ కాలేజీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సమృద్ధిగా నిధులు మంజూరు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. జిల్లాలో చెరువుల అభివృద్ధికి ఐదు వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కడెం ప్రాజెక్టుకు 870 కోట్లు, సాత్నాల ప్రాజెక్టుకు 28 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో మినీ ఏరోడ్రోమ్ పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. లోయర్ పెన్‌గంగా ప్రాజెక్ట్ ద్వారా 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఆరు నెలల్లో దీన్ని పూర్తి చేస్తామన్నారు. బోథ్ నియోజక వర్గంలో 210 కోట్లతో గోముత్రి రిజర్వాయర్ నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వం ఏ పని చేసినా అడ్డుకోవడమే విపక్షాలు పనిగా పెట్టుకున్నాయని కేసీఆర్ ఆరోపించారు. ఇన్నాళ్లూ రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రజలకు ఏం చేశాయో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు.

చనాఖా- కొరాటా బ్యారేజీ పనుల పరిశీలన..

ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దులో పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న చనాఖా-కొరాటా బ్యారేజీ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో బ్యారేజీ పనులను ఏరియల్ సర్వే చేశారు. కార్యక్రమంలో మంత్రులు హరీశ్‌రావు, జోగురామన్న, ఇంద్రకరణ్ రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ కేశవరావు పాల్గొన్నారు. ఆ ప్రాజెక్ట్ ద్వారా 58 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. కత్నాల ప్రాజెక్ట్ కోసం రూ.28 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. కొరాటా గ్రామంలో రెండు వందల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బహిరంగ సభలో కొంత మంది యువకులు జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా నిజామాబాద్ వరకు రైల్వే లైను ఏర్పాటు చేయాలని కోరుతూ పోస్టర్లు ప్రదర్శించారు. దీన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో వారు నిరాశగా వెనుదిరిగారు.

కేంద్రంతో యుద్ధానికి సై

- దేశవ్యాప్తంగా మోదీ హవా తగ్గుతోంది
- జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతాం: కేసీఆర్

కరీంనగర్, ఫిబ్రవరి 27 (మనం ప్రతిధి): దేశవ్యాప్తంగా మోదీ హవా తగ్గుతోందని, కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వివిధ అంశాలపై కేంద్రంతో యుద్ధానికి సిద్ధమని పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల, పెద్దపల్లిలో జరిగిన వివిధ సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్‌పైనా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రైతుల సమస్యలు పట్టించుకోవడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. దేశంలో రైతు, వ్యవసాయం రంగం సంక్షభంలోకి కూరుకుపోవడానికి బీజేపీ, కాంగ్రెస్‌లే కారణమని అన్నారు. ఆ పార్టీ పార్టీల నిర్లక్ష్య వైఖరి వల్లే రైతుల ఆత్మహత్యలకు దారి తీశాయన్నారు. ఉపాధిహామీ పథకాన్ని రైతులకు, వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ప్రధానిని 20 సార్లు అడిగిన పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో మొదలైయ్యే రెండో విడత కేంద్ర పార్లమెంట్ సమావేశాల్లో టిఆర్‌ఎస్ ఎంపీలు మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడుతారని సీఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకు తాము సయోధ్యతో ఉన్నా..రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. మైనారిటీ, గిరిజన రిజర్వేషన్ బిల్లులు, విభజన హామీలపైఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్నారు. కేంద్రం తెలంగాణపై చిన్న చూపు చూస్తుందన్నారు. నియోజక వర్గాల పునర్విజన బిల్లుకు మోదీ సర్కారు అడ్డుకుంటుందన్నారు. జాతీయ రాజికీయాల్లో చక్రం తిప్పి చూపిస్తామన్నారు. కేంద్రంలో ఏర్పాడే సంకీర్ణ ప్రభుత్వంలో తాము కీలక భూమి పోషిస్తామన్నారు.

సీఎం హెలికాప్టర్‌కు తప్పిన ముప్పు

- గాల్లోకి లేస్తుండగా బ్యాగులో మంటలు
- దూరంగా విసిరేసిన సిబ్బంది

కరీంనగర్, ఫిబ్రవరి 27(మనం న్యూస్ బ్యూరో): తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లోని ఓ బ్యాగులో మంటలు రేగడంతో భద్రతా సిబ్బంది చురుగ్గా స్పందించి దానిని దూరంగా విసిరివేశారు. హెలీకాప్టర్ టేకాఫ్ తీసుకుంటుండగా జరిగిన ఈ ఆకస్మిక ఘటనతో అధికారులలో ఆందోళన వ్యక్తమైంది. గాల్లోకి లేచిన హెలికాప్టర్‌ను భద్రతా సిబ్బంది కిందికి దింపి మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రయాణానికి అనుమతించారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవన్ ఆవరణలో ఈ ఘటన చోటుచేసుకుంది. కరీంనగర్‌లో సోమవారం జరిగిన రైతు సమన్వయ ప్రాంతీయ సదస్సుకు సీఎం కేసీఆర్ హాజరైన విషయం తెలిసిందే! సదస్సు తర్వాత రాత్రికి అక్కడి ఉత్తర తెలంగాణ భవన్‌లో సీఎం విశ్రాంతి తీసుకున్నారు. మంగళవారం ఉదయం అధికారులు, స్థానిక నేతలతో సమీక్షలు జరిపిన సీఎం అనంతరం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ముర్మూర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసేందుకు హెలీకాప్టర్‌లో బయలు దేరారు. సీఎం ప్రయాణించే హెలికాప్టర్ గాల్లోకి లేస్తుండగా అందులో ఉన్న ఓ బ్యాగులోంచి పొగమంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు పొగమంటలు వస్తున్న బ్యాగును బయట పడేశారు. దీంతో భద్రత సిబ్బంది, అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. క్షణ కాలంలో జరిగిన ఈ సంఘటన పట్ల ఖంగుతిన్న సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కెప్టెన్, భద్రత సిబ్బంది మరోసారి హెలికాప్టర్‌ను పరిశీలించి, ప్రయాణానికి అనుమతించడంతో సీఎం అంతర్గాం బయలుదేరారు.


విచారణ జరుగుతోంది.. డీజీపీ

సీఎం కేసీఆర్ హెలికాప్టర్లో పొగలు రావడంపై డీజీపీ మహేందర్ రెడ్డి స్పందించారు. సెక్యూరిటీ సర్వీస్ విభాగంలో వైర్‌లెస్ కిట్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలురేగాయని పేర్కొన్నారు. పొగ, మంటలను గమనించిన వెంటనే సీఎం భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారని తెలిపారు. అసలు ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై విచారణ కొనసాగుతుందని డీజీపీ వివరించారు.

హెలికాప్టర్ ఘటనపై కేటీఆర్ ట్వీట్

సీఎం కేసీఆర్‌కు తప్పిన ప్రమాదంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆల్ ఈజ్ వెల్ అంటూ ట్వీట్ చేశారు. కేసీఆర్ క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. అదిలాబాద్ జిల్లా పర్యటనకు సీఎం కేసీఆర్ బయలుదేరి వెళ్లారని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఏప్రిల్‌లో పాదయాత్ర



(మొదటి పేజీ తరువాయి)

వివరించడానికి త్వరలో పాదయాత్ర చేయనున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణ పేర్కొన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ మోసాలను ప్రజలకు చెబుతానన్నారు. దీంతోపాటు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియా గాంధీనే అన్న విషయాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ యాత్రను ఉపయోగించుకోనున్నట్లు ఆమె వివరించారు. ఈమేరకు మంగళవారం అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఆమె విలేకరులతో ఇష్టాగోష్టిలోగా మాట్లాడుతూ.. ఏప్రిల్ చివరి వారంలో పాదయాత్ర చేపట్టేలా ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు చేపట్టే ఈ పాదయాత్రలో మొత్తం 119 నియోజక వర్గాల్లోని ముఖ్య ప్రాంతాలు కలిసేలా ప్లాన్ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఏ జిల్లా నాయకులు ఆదే జిల్లాలో పాదయాత్రలో పాల్గొంటారని, రూట్ మ్యాప్ సిద్ధమైన తరువాత అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ నేతలతో దీనిపై మాట్లాడుతున్నట్లు తెలిపారు. పాదయాత్ర చేసే విషయాన్ని పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ రామచంద్ర కుంతియాకు తెలిపినట్లు చెప్పారు. తాను గతంలో కూడా ప్రాజెక్టుల సాధన కోసం పాదయాత్ర చేశానని తెలిపారు. పాదయాత్రకోసం ప్రత్యేకంగా అనుమతి అవసరంలేదన్నారు. పార్టీ గెలుపుకోసం అందరూ పని చేయాలని వివరిస్తూ.. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని డీకే అరుణ స్పష్టంచేశారు.

బహిరంగ సభలు వద్దు..

పాదయాత్రలో బహిరంగ సభలు పెట్టాలన్న నిర్ణయం సరైందికాదని డి.కె.అరుణ పేర్కొన్నారు. ఒకవేళ సభలు పెట్టినా అందులో ముఖ్యమైన నేతలు ఆరుగురు మాటలాడితే సరిపోతుందని తేల్చి చెప్పారు. నాగం జనార్ధన్ రెడ్డి చేరికను తాను ఏనాడు వ్యతిరేకించలేదని, ఆయనపై పలుమార్లు పోటీ చేసిన దామోదర్ రెడ్డితో కూర్చోబెట్టి చర్చించి పరి ష్కరించాలని పీసీసీ అధ్యక్షుడికి సూచించినట్లు అరుణ తెలిపారు. ఒకవైపు చర్చలు జరుగుతుండగానే నాగంను ఢిల్లీ తీసుకెళ్లి రాహుల్ గాంధీతో మాట్లాడిం చడం సరికాదన్నారు. ఏదిచేసినా పార్టీ కి ఉపయోగ పడేలా ఉండలని ఆమె సూచించారు. గత ఎన్నికల్లో నాగం, ఆయన కుమారుడికి డిపాజిట్లు దక్కలేదన్న విషయాన్ని కూడా రాహుల్‌కు చెప్పి ఉండాల్సిందని డీకే అరుణ అభిప్రాయపడ్డారు.

రైతు కాదు.. రౌడీ సమితులు

వచ్చే ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో రైతు సమన్వయ సమితుల పేరుతో రౌడీ సమన్వయ సమితిలను ఏర్పాటు చేశారని అరుణ మండిపడ్డారు. నాలుగేండ్ల తర్వాత రైతును ఆదుకోవాలని సీఎం కేసీఆర్‌కు సోయి వచ్చిందని మండిపడ్డారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేండ్లకు రుణమాఫీ చేస్తే అది వడ్డీ చెల్లింపులకే సరిపోయిందన్నారు. రెవెన్యూ యంత్రాంగాన్ని సర్వేలకే వాడుతున్నారని, ఒక్క ఎకరా కూడా సర్వే చేయలేదని చెప్పారు. ఎకరాకు రూ.4 వేలు పథకం ఎన్నికల్లో ఓట్ల కోసమేనని పేర్కొన్నారు. నాలుగేండ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టు తీసుకురాలేదని, ఒక్క ఎకరాకు నీరు అందించిందిలేదన్నారు. కేవలం ఉన్న ప్రాజెక్టులకు పేర్లు మార్చి.. ప్రాజెక్టుల ఖర్చు పెంచారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కొత్త హామీలను ఇస్తున్నారని, రూ.4 వేలు ఇచ్చినంత మాత్రాన రైతులు అండగా నిలుస్తారనుకోవడం పొరబడినట్టేనని వివరించారు. రైతులను కాపాడేందుకు సంరక్షణ కమిటీలుగా మారి కార్యకర్తలు రైతులకు అండగా ఉంటామని అరుణ తెలిపారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మొత్తం 1294 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం (ఫిబ్రవరి 28న) ప్రారంభమయ్యే ఈ పరీక్షలు మార్చి 14న ముగుస్తాయి. ప్రతిరోజూ ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 15 నిమిషాల గ్రేస్ పీరియడ్‌లో భాగంగా 9 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అనంతరం నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఈ క్రమంలో పరీక్షా కేంద్రానికి ముందే చేరుకునేలా జాగ్రత్త పడాలంటూ అధికారులు విద్యార్థులకు సూచిస్తున్నారు. అయితే గతంలో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయంటే.. పేపర్ లీక్ అయిందంటూ పుకార్లు, కాలేజీ యాజమాన్యాలు హాల్ టికెట్ ఇవ్వకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడే విద్యార్థులు, తనిఖీ సమయంలో స్క్వాడ్‌కు, సిబ్బందికి మధ్య వాగ్వాదాలు తదితర వివాదాలతో ఇంటర్ బోర్డు సతమతమయ్యేది. ఈసారి అలాకాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్స్ అందజేయడం దగ్గరి నుంచి పరీక్ష కేంద్రాల్లో నిఘా వరకు అడుగడుగునా అప్రమత్తంగా ఉండేలా అధికారులు ప్రణాళిక రచించారు. ఈ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలు ఏలాంటి అటంకాలు లేకుండా సాగనున్నాయి.

కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. చుట్టూ కిలోమీటరు పరిధిలోని జిరాక్స్, నెట్ సెంటర్లను మూసివేయనున్నారు. ఇప్పటికే ఇంటర్ విద్యార్థులందరికీ హాల్‌టికెట్లు అందజేశారు. ఒకవేళ కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్స్ ఇవ్వకుండా తిప్పలు పెడితే.. వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావొచ్చు. గతంలో ప్రైవేటు కళాశాలలు.. విద్యార్థులకు హాల్‌టికెట్స్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవారు. దీనికి ప్రత్యామ్నాయంగా హాల్‌టికెట్‌ను నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇలా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై ప్రిన్సిపల్ సంతకంలేకున్నా అనుమతించడం గమనార్హం.

రాష్ట్రవ్యాప్తంగా 1294 కేంద్రాలు..

ఇంటర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1294 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రాలన్నింటిలో తాగు నీటి వసతిని ఏర్పాటుచేశారు. కోతలులేకుండా ముందస్తుగానే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వైద్యపరంగా సాయమందించేందుకు పరీక్షాకేంద్రాల్లో వైద్య సహాయకులను ఏర్పాటు చేశారు. వీరితో పాటుగా పరీక్ష నిర్వహణను పరిశీలించేందుకు మాల్ ప్రాక్టీస్ జరగకుండా విద్యాశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 25,395 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

హాజరయ్యే విద్యార్థులు	: 9,63,546
ప్రథమ సంవత్సరం..	: 4,55,635
ద్వితీయ సంవత్సరం	: 5,07,911
పరీక్షా కేంద్రాలు	
ప్రభుత్వ	: 527
ప్రైవేటు	: 767
ఇన్విజిలేటర్లు	: 25,395
సిట్టింగ్ స్క్వాడ్స్	: 200
ఫ్లైయింగ్ స్క్వాడ్స్	: 50

నిఘా నీడలో..

పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, పరీక్ష మధ్యలో బయటికి రావడం వంటి అవరోధాలు ఎదురు కాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్‌ను అనుమతించరు. పరీక్ష కేంద్రాలను గుర్తించడంలో ఏటా విద్యార్థులు నానా తిప్పలుపడుతుంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు జీపీఎస్‌తో పనిచేసే ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు అందులో హాల్‌టికెట్ నంబర్ ఎంటర్‌చేసి పరీక్ష కేంద్రాన్ని సులభంగా తెలుసుకోవచ్చు.

మోదీపై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు!

- హార్లీ డేవిడ్‌సన్ బైక్‌ల వ్యవహారంలో చురకలు
- దిగుమతి పన్ను 50 శాతానికి తగ్గించారట..
- ఆ విషయాన్ని చాలా అందంగా చెప్పారు
- దానివల్ల అమెరికాకు ఒరిగేదేమీ లేదు
- ఏదో చేశామని భారత్ అనుకుంటోంది
- గవర్నర్ల సదస్సులో అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్, ఫిబ్రవరి 27: అమెరికాలో తయారయ్యే హార్లీ డేవిడ్‌సన్ బైక్‌ల వ్యవహారంలో ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అత్యంత ఖరీదైన ద్విచక్ర వాహనాలపై భారీ స్థాయిలో విధిస్తున్న దిగుమతి సుంకాన్ని భారత్ ఇటీవల 50 శాతం తగ్గించినా ఆ చర్యతో అమెరికాకు ఒరిగేదేమీ లేదని మండిపడ్డారు. విదేశాల్లో తయారయ్యే బైకులపై 75 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 50 శాతానికి తగ్గించినట్లు ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ తనకు ఫోన్ చేసి చెప్పారంటూ అన్ని రాష్ట్రాల గవర్నర్‌లతో శ్వేతసౌధంలో సమావేశం అయిన సందర్భంగా ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''భారత ప్రధానమంత్రి అద్భుతమైన వ్యక్తి.. అతను నాకు ఇటీవల ఫోన్ చేసి 50 శాతం సుంకం తగ్గిస్తున్నట్టు చెప్పారు. కానీ దీనివల్ల మనకు వస్తున్నది ఏమీ లేదు''అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తరహాలో రెండు చేతులు జోడించి.. ఆయనను అనుకరిస్తూ.. ఎద్దేవా చేసే ప్రయత్నం చేశారు. ''అతను (మోదీ)ఈ విషయాన్ని అందంగా చెప్పాడు. అతనో అందమైన వ్యక్తి. మొదట సుంకాన్ని 75 శాతానికి తగ్గించాం.. ఇప్పుడు 50 శాతానికి తగ్గించామని మీకు చెప్తున్నానని అన్నాడు. నేను హు అని నిట్టూర్చాను. ఇంతదానికి నేను సంతోషపడాలా?'' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. దిగుమతి సుంకం తగ్గింపుతో అమెరికాకు ఏదో మేలు చేసినట్లు భారత్ అనుకుంటూ ఉన్నా అలాంటిదేమీ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌కు మాత్రం 50 శాతం దిగుమతి సుంకం రూపంలో ఆదాయం సమకూరుతుందని ధ్వజమెత్తారు. భారత్‌లో తయారయ్యే ద్విచక్ర వాహనాలను దిగుమతి చేసుకుంటున్నా తమకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదన్నారు. హార్లీ డేవిడ్‌సన్ బైకుల విషయంలో ట్రంప్ మండిపడడం రెండు వారాల వ్యవధిలో ఇది రెండోసారి. అవసరమైతే అమెరికాలో అమ్ముడయ్యే భారతీయ మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాన్ని పెంచుతామని ఈ నెల 14న ఆయన హెచ్చరించిన విషయం తెలిసిందే.

ఏప్రిల్ 15న 'కర్ణాటక' నగారా!

- సీఈసీ ఓపీ రావత్ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కర్ణాటక స్కూలు బోర్డు పరీక్షలు ముగిశాక ఏప్రిల్ రెండోవారంలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నా యని కేంద్ర ఎన్నికల కమిషనర్ ఓపీ రావ త్ పేర్కొన్నారు. మంగళవారం ఓ జాతీయ ఇంగ్లిష్ చానల్‌తో మాట్లాడుతూ.. '' 224 మంది సభ్యులున్న కర్ణాటక అసెంబ్లీ సభ్యుల పదవీకాలం మే 28వతేదీతో ముగియనుంది. ఏప్రిల్ 15వ తేదీలోపు ఎన్నికల షెడ్యూల్ ప్రకటిం చే అవకాశ ముంది. ఏప్రిల్ మొదటి వారంలో ఈసీ బృందం రాష్ట్రంలో పర్యటిస్తుంది. పరిస్థితులను సమీక్షించి షెడ్యూల్‌ను విడుదల చేస్తాం'' అని పేర్కొన్నారు.

మరో జడ్జి 'బలి పశువు'

- సోహ్రాబుద్దీన్ కేసు విచారణలో బదిలీ
- సీబీఐ వాదనలు తప్పన్నందుకే వేటు
- కొత్త న్యాయమూర్తికి బాధ్యతలు: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ విచారణ కేసులో మరో న్యాయమూర్తిని బలి పశువును చేశారని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ కేసును విచారిస్తున్న న్యాయమూర్తిని తొలగించి బాంబే హైకోర్టులో ఏక సభ్య ధర్మాసనానికి అప్పగించారని పేర్కొన్నారు. కొత్త న్యాయమూర్తిని నియమించారని పత్రికల్లో వచ్చిన వార్తలను ట్విట్టర్‌లో ట్యాగ్ చేశారు. దీనిపై కొత్త సందేహాలు కలుగుతున్నాయని రాహుల్ ట్వీట్ చేశారు. ఇంతకుముందు ఈ కేసును విచారించిన సీబీఐ కోర్టు జడ్జి బీజీ లోయా అనుమానాస్పద మృతిని రాహుల్ ప్రస్తావించారు. లోయా ఎలా చనిపోయారు? అని ట్వీట్ చేశారు. ''సోహ్రాబుద్దీన్ కేసులో మరో జడ్జి బలి పశువు అయ్యారు. సీబీఐ వాదనలను తప్పుపట్టిన జస్టిస్ రేవతి డెరెను తొలగించారు. ఈ కేసులో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా విచారణకు హాజరు కావాలని ఆదేశించిన న్యాయమూర్తి జేటీ ఉట్పాట్‌ను తొలగించారు. ఈ కేసులో న్యాయమూర్తి లోయా కఠిన ప్రశ్నలు అడిగారు. ఆయన మరణించారు. ఆయన ఎలా మరణించారు'' అని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. సోహ్రాబుద్దీన్ కేసు నుంచి సీనియర్ ఐపీఎస్ అధికారులను విముక్తి చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయని, ఈ కేసును రోజువారీగా విచారిస్తున్న జస్టిస్ డెరె స్థానంలో కొత్త న్యాయమూర్తికి బాధ్యతలు అప్పగించారని రాహుల్ అన్నారు. 2005లో గుజరాత్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సోహ్రాబుద్దీన్, ఆయన భార్య కౌసర్ బీ మరణించారు. 2006లో మరో ఎన్‌కౌంటర్‌లో సోహ్రాబుద్దీన్ అనుచరుడు తులసీరాం ప్రజాపతి చనిపోయాడు. అప్పట్లో గుజరాత్ హోం మంత్రిగా ఉన్న అమిత్ షాపై అభియోగాలు నమోదయ్యాయి. కాగా 2016 ఆగస్టు-2017 సెప్టెంబరు మధ్య కాలంలో ఈ కేసు నుంచి అమిత్ షా సహా 15 మందికి విముక్తి లభించింది.

నాగాలాండ్ 75%, మేఘాలయ 67%..

- రెండు రాష్ట్రాల్లో ఎన్నికల పోలింగ్ సమాప్తం
- తొలి ఐదుగురు ఓటర్లకు ప్రోత్సాహక పతకం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఈశాన్య రాష్ట్రాలు నాగాలాండ్, మేఘాలయ శాసనసభ ఎన్నికల పోలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకూ నాగాలాండ్‌లో 75 శాతం, మేఘాలయలో 67 శాతం వంతున ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. నిర్దేశిత సమయం ముగిసేవేళకు కూడా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులుతీరి కనిపించడం విశేషం. ఈ మేరకు న్యూఢిల్లీలో ఎన్నికల కమిషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రభూషణ్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. నాగాలాండ్‌లో చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ మొత్తంమీద పోలింగ్ సజావుగానే సాగిందని చెప్పారు. రెండు వేర్వేరు చోట్ల నాటుబాంబు విసిరిన సంఘటనతోపాటు కాల్పులు చోటుచేసుకోగా ఇద్దరు గాయపడ్డారు. మూడో సంఘటనలో ఒకచోట దుండగులు ఓటింగ్ యంత్రాలను ధ్వంసం చేశారని అధికారులు తెలిపారు. కాగా, మేఘాలయలో తొలి ఐదుగురు ఓటర్లకు 'తొలి ఓటరు పతకం' ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఇక త్రిపురలో ఇప్పటికే పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మూడు రాష్ట్రాల ఓట్ల లెక్కింపును మార్చి 3న ఉదయం 8 గంటలనుంచి ప్రారంభించనున్నారు.

బాత్‌టబ్ మరణాలూ సాధ్యమే!



- జపాన్‌లో ఏటా 19 వేలమంది మృతి
- 65 ఏళ్లు దాటినవారిలోనే ఎక్కువ
- బాత్‌టబ్‌ల లోతు ఎక్కువ.. అదీ కారణమే

ముంబై, ఫిబ్రవరి 27: బాత్‌టబ్‌లో పడిపోయినంత మాత్రాన ఊపిరాడకుండా ఎవరైనా చనిపోతారా? శ్రీదేవి మరణం విషయంలో చాలామందికి వచ్చిన అనుమానం ఇదే. బాత్‌టబ్ అనేది పెద్ద లోతు ఉండదు కాబట్టి, చేతులు పట్టుకుని సులభంగా బయటకు వచ్చేయొచ్చనే ఎక్కువ మంది భావిస్తారు. అయితే, మన దేశంలో ఎలా ఉన్నా.. జపాన్, అమెరికా లాంటి దేశాల్లో మాత్రం బాత్‌టబ్‌లో పడి మరణించేవాళ్లు చాలామందే ఉంటున్నారట. మన దేశంలో కూడా గుజరాత్‌లోని ఆనంద్ పట్టణంలో గతంలో ఇలా బాత్‌టబ్‌లలో పడి ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి.

జపాన్‌లో అయితే ఈ తరహా మరణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. ఏడాదికి 19వేల మంది కేవలం బాత్‌టబ్‌ల కారణంగానే చనిపోతున్నారు. గడిచిన పదేళ్లలో ఆ దేశంలో బాత్‌టబ్‌లో మునిగి సంభవించే మరణాల సంఖ్య 70% పెరిగిందని జపాన్ వినియోగదారుల వ్యవహారాల సంస్థ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. పైగా, అలా మరణించే ప్రతి పది మందిలో తొమ్మిది మంది 65 సంవత్సరాల పైబడిన వయసువారేనట. జపాన్ వాళ్లు స్నానం చేసేటప్పుడు నీళ్లను 41 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు వేడి చేసుకోవడం కూడా ఒక కారణం కావచ్చని చెబుతున్నారు. దానికితోడు ఇతర దేశాలలో కంటే జపాన్ బాత్‌టబ్‌ల లోతు కూడా కాస్తంత ఎక్కువేనట.


అమెరికాలో అయితే.. 2006లో విడుదల చేసిన ఫెడరల్ డేటా ప్రకారం ప్రతిరోజూ కనీసం ఒకరు బాత్‌టబ్‌లో గానీ, వేడినీళ్ల టబ్‌లో గానీ స్పాలో గానీ మరణిస్తున్నారు. వాళ్లలో చాలామంది బాగా పూటుగా మద్యం తాగేసిన వారే. ఇంట్లో ఉన్న గదులన్నింటిలో అతి చిన్నదైన బాత్రూం.. మరణానికి ఎలా కారణమవుతోందన్న విషయమై అమెరికాలోని అట్లాంటాలో గల సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. ప్రతి ఏటా 15 ఏళ్లు దాటిన వారిలో రెండు లక్షల మంది బాత్రూం గాయాలతో ఆస్పత్రులకు వస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. వీరిలో 14% మంది ఆస్పత్రిలో చేరాల్సి వస్తోంది. ఎక్కువ ప్రమాదాలు స్నానం చేసేటపుడు లేదా షవర్ చేసేటపుడు సంభవిస్తున్నాయని, వాళ్లలోనూ అధికశాతం మహిళలే ఉంటున్నారని తెలిపారు. వాళ్లకు శారీరక సామర్థ్యం తక్కువగా ఉండటం, ఎముకల బరువు కూడా తక్కువ కావడం అందుకు కారణం కావచ్చన్నారు.

భారతదేశంలో మాత్రం బాత్రూం ప్రమాదాల సంఖ్య చాలా తక్కువగానే ఉంటోంది. పొరపాటున ఏవైనా జరిగినా కాలుజారి పడిపోవడం, కరెంటు షాక్ తగలడం లాంటివే ఉంటున్నాయి. మొత్తం ప్రమాదాలలో కేవలం 1.7% మాత్రమే ఇంట్లో జరిగేవి ఉంటున్నాయని థానెలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

దావూద్ అదృశ్య హస్తం!

- శ్రీదేవి కేసు ఒక్కసారిగా 'క్లోజ్'కు కారణమిదేనా?
- మృతదేహానికి రీ-పోస్టుమార్టం చేశారా... లేదా..
- పాత వైద్య రికార్డుల పరిశీలన.. సర్జరీలపై ఆరా
- ఆమె వాడిన మందులే ప్రాణహానికి దారితీశాయా
- లోతుగా శోధించినప్పటికీ వెలుగుచూడని నిజాలు
- భౌతిక కాయం అప్పగింత... కేసు పూర్తిగా మూత





దుబాయ్, ఫిబ్రవరి 27: బాలీవుడ్ సినిమాను తలపించేలా సాగిన నటి శ్రీదేవి మరణానంతర పరిణామాలు మంగళవారం ఒక్కసారిగా క్లైమాక్స్ చేరడం వెనుక అదృశ్యహస్తం ఏదైనా ఉందా? ఆమె భౌతిక కాయానికి మరోసారి పోస్టుమార్టం చేయాల్సిన అవసరం ఉందన్న దుబాయ్ పబ్లిక్ ప్రాసిక్యూషన్ (డీపీపీ) వ్యవస్థ ఒక్కరోజులో చల్లబడి పోవడానికి కారణమేమిటి? ఆమె వైద్యానికి సంబంధించి పాత రిపోర్టులు కోరడమేగాక భర్త బోనీకపూర్ పాస్‌పోర్టును సైతం స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో శ్రీదేవి భౌతిక కాయం ఇప్పుడప్పుడే భారత్ చేరబోదేమోనన్న అనుమానాలు కూడా రేగాయి. కానీ, ఈ ఊహాగానాలకు హఠాత్తుగా తెరపడటంలో అంతరార్థం ఏమైనా ఉందా? సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం షికారు చేస్తున్న రకరకాల వ్యాఖ్యానాలను బట్టి సదరు అదృశ్యహస్తం దావూద్ ఇబ్రహీందేనన్న వదంతి బలం పుంజుకుంటోంది. అతడు దుబాయ్‌లో రాచరిక వ్యవస్థను ప్రభావితం చేయగల సమర్థుడా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. అయితే- బీజేపీ నేత, వివాదాస్పద వ్యాఖ్యలకు పెట్టింది పేరైన సుబ్రమణ్యస్వామి దావూద్ పాత్రపై దర్యాప్తు కోరడం చూస్తే దీనికి 'అవున'న్న సమాధానమే వినిపిస్తోంది. పైగా శ్రీదేవిది సహజ మరణం కాదని, హత్యేనని ఆయన పేర్కొన్నారు. సినీ హీరోయిన్లతో దావూద్‌కుగల అనైతిక బంధమే శ్రీదేవి విషాద ఉదంతానికి కారణమన్నారు. ఈ దిశగా విచారణ చేపట్టాలని కూడా డిమాండ్ చేశారు. శ్రీదేవికి మద్యం అలవాటు లేదన్న వాదనను తోసిపుచ్చుతూ ఆమె రక్తంలో ఆల్కహాల్ ఎందుకుందని ప్రశ్నించారు. అది నిజమేనని భావించేట్లయితే ఎవరైనా బలవంతంగా మద్యం తాగించి ఆమెను బాత్‌టబ్‌లో ముంచేసి ఉంటారన్న సందేహం కూడా వెలిబుచ్చారు. ఈ పరిస్థితుల నడుమ తాను మరోసారి వార్తల్లో వ్యక్తి కాకుండా చూసుకోవడానికి దావూద్ పావులు కదిపాడన్న కథనం వినబడుతోంది. ఆ మేరకు దుబాయ్ సర్కారును ప్రభావితం చేసి కేసు క్లోజ్ చేయించినట్లు వినిపిస్తోంది. ఏదేమైతేనేం... మంగళవారం రాత్రికల్లా శ్రీదేవి భౌతిక కాయం ముంబై చేరింది. ఈ సందర్భంగా దీనికిముందు చోటుచేసుకున్న పరిణామాలను ఓసారి పరిశీలించాల్సి ఉంది...

దూదిపింజల్లా తేలిపోయిన అనుమానాలు

మూడు రోజులుగా శ్రీదేవి ఉదంతంపై దేశవ్యాప్తంగా మీడియా చేసిన హడావుడి అంతాఇంతా కాదు... ఈ నేపథ్యంలో ఆమె మృతదేహానికి మరోసారి పోస్టుమార్టం చేశారా? అవసరమైతే చేసి తీరుతామని డీపీపీ వర్గాలు చెప్పినట్లు అంతర్జాతీయ మీడియా కూడా పేర్కొంది. దాంతో పునః పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని అప్పగించారా లేక రసాయన లేపనం (ఎంబామింగ్) చేసి ఇచ్చేశారా అన్నది తేలలేదు. మరోవైపు బోనీకపూర్ దుబాయ్ వదిలి వెళ్లడానికి కూడా వీల్లేదని కూడా డీపీపీ ఆదేశించింది. ఆపైన శ్రీదేవి ఫోన్ కాల్స్ డేటాను పోలీసులు జల్లెడపట్టారు. భారత్ నుంచి శ్రీదేవి మెడికల్ రికార్డులను కూడా తెప్పించుకున్నారు. ఇప్పటివరకు ఆమె ఏయే సర్జరీలు చేయించుకుంది, దానికి ముందు.. తర్వాత ఎలాంటి చికిత్సలు పొందింది, ఏయే మందులు వాడింది. వాటిలో ఏవైనా ఆమె మరణానికి కారణమయ్యాయా? తదితర ప్రశ్నలకు జవాబు అన్వేషించే ప్రయత్నాలు చేశారు. ఇదంతా పూర్తయ్యాక అనుమానాలు దూదిపింజల్లా తేలిపోయాయన్నట్లు మృతదేహం అప్పగింతకు అవసరమైన లాంఛనాలు పూర్తిచేశారు.

శ్రీదేవి మృతి వెనుక దావూద్!

బీజేపీ నేత, ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ఆరోపణ

ముంబై, ఫిబ్రవరి 27: శ్రీదేవి మరణంపై బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి సంచలన ఆరోపణలు చేశారు. శ్రీదేవిది సహజమరణం కాదని, హత్యేనని పేర్కొన్నారు. సినీ హీరోయిన్లతో దావూద్‌కు ఉన్న అనైతిక సంబంధమే శ్రీదేవి మృతికి కారణమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. సినిమా తారలతో దావుద్‌కు ఉన్న సంబంధాలపై విచారణ జరపాలని సుబ్రమణియన్ డిమాండ్ చేశారు. శ్రీదేవికి మందు తాగే అలవాటు లేదని చెప్పిన సుబ్రమణియన్ స్వామి.. మరి ఆమె శరీరంలో ఆల్కహాల్ ఎలా ఉందని ప్రశ్నించారు. శ్రీదేవితో ఎవరైనా బలవంతంగా మద్యం తాగించి బాత్‌టబ్‌లో ముంచి చంపేశారా అనే విషయాన్ని తేల్చాలని స్వామి డిమాండ్ చేశారు.

భర్త.. బంధువులు.. హోటల్ సిబ్బందిపై ప్రశ్నల వర్షం

దుబాయ్ నిబంధనల ప్రకారం తొలుత అరబిక్ భాషలో మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. అటుపైన దాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేయించి, అధికారిక ధ్రువీకరణతో ఆమె కుటుంబసభ్యుల చేతిలో పెట్టారు. ఈలోగా భర్త బోనీ కపూర్‌నే కాకుండా కుటుంబ సభ్యులందరినీ, చివరకు హోటల్ సిబ్బందిని కూడా వదలకుండా ప్రశ్నల వర్షం కురిపించారు. దుర్ఘటన సంభవించిన రోజున బోనీతోపాటు ఎవరెవరున్నారో వాకబు చేశారు. జుమైరా ఎమిరేట్స్ టవర్స్‌లోని 2201 నంబరు గదిని సీల్ చేశారు. ఆ గదిలో అసలేం జరిగిందో తెలుసుకోవడానికి వరుస సంఘటనల దృశ్య పునఃసృష్టి చేయాలని కూడా భావించారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత కొన్ని ప్రశ్నలు తలెత్తాయని, అందుకే పునర్విచారణ అవసరమని చెప్పారు. ఇంత పకడ్బందీగా సాగుతూ వచ్చిన విచారణ ఒక్కసారిగా ముగిసిపోవడం విశేషమే.

అక్కడి నిబంధనలు చాలా కఠినం

ఆస్పత్రిలో కాకుండా ఎక్కడ, ఎలాంటి పరిస్థితిలో వ్యక్తుల మరణం సంభవించినా దానిపై పూర్తిస్థాయిలో విచారణ తప్పదన్నది దుబాయ్‌లో చట్ట నిబంధన. చివరకు సహజ మరణమే అయినా ఈ తంతు తప్పదు. తదనుగుణంగానే దుబాయ్ హోంశాఖ కార్యాలయంలో బోనీ కపూర్‌ను లోతుగా ప్రశ్నించారు. శ్రీదేవి ఎవరి పెళ్లికి వెళ్లిందో ఆ పెళ్లి కొడుకు మోహిత్ మార్వా కుటుంబసభ్యులను సైతం ప్రశ్నించారు.

అంతకన్నా ఎక్కువే!

పీఎన్‌బీ మోసం 12,723 కోట్లుగా అంచనా

- బీఎస్‌ఈకి యాజమాన్యం తాజా నివేదన
- నీరవ్ ఆచూకీ కోసం 6 దేశాలకు 'ఎల్ఆర్'
- మేనేజింగ్ డైరెక్టర్ మెహతాకు ఈడీ పిలుపు
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో అధికారుల సమావేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వజ్రబేహారి నీరవ్ మోదీ కుచ్చుటోపీ పెట్టిన మొత్తం మరో రూ.1,323 కోట్లు పెరిగింది. ఈ మేరకు బ్యాంకు యాజమాన్యం సోమవారం నాడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి (బీఎస్‌ఈ)కి నివేదించింది. ప్రస్తుత ఫిర్యాదుల ప్రకారం మోసపు అంచనా మొత్తం రూ.11,400 కోట్లు కాగా తాజా నివేదికతో అది రూ.12,723 కోట్లకు పెరిగింది. నీరవ్‌తోపాటు అతడి వ్యాపార భాగస్వాములు పీఎన్‌బీ అధికారులతో కుమ్మక్కై నకిలీ బ్యాంకు గారంటీలతో ఈ సొమ్మును కొల్లగొట్టారు. ఈ గ్యారంటీల ఆధారంగా అలహాబాద్, యాక్సిస్, యూకో తదితర బ్యాంకుల విదేశీ శాఖలనుంచి నిధులు దోచుకుపోయారు. పీఎన్‌బీ నిర్వాకం ఫలితంగా నష్టపోయిన ఈ బ్యాంకులకు సదరు సొమ్ము చెల్లించాల్సిందిగా పీఎన్‌బీని ప్రభుత్వం ఆదేశించలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఒకవేళ అత్యవసరంగా చెల్లించాల్సి వచ్చినా తమవద్ద తగుమేర మూలధన నిల్వలు/ఆస్తులు ఉన్నాయని బీఎస్‌ఈకి సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

పీఎన్‌బీ ఎండీ-సీఈవో మెహతాకు పిలుపు

ఈ కేసులో మరిన్ని వివరాలు తెలుసుకోవడం కోసం పీఎన్‌బీ మేనేజింగ్ డైరెక్టర్-సీఈవో సునీల్ మెహతాను తమ ఎదుట హాజరు కావాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోరింది. అంతకుముందు బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వి.బ్రహ్మాజీరావుతో ఈడీ అధికారులు సమావేశమై మోసం ఎలా జరిగింది? బ్యాంకు అనుసరించే విధివిధానాలేమిటి? తదితరాలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సంధించిన ప్రశ్నలనే మెహతా తమ ఎదుట హాజరైనపుడు అడుగుతామని ఈడీ అధికారులు చెప్పారు. అయితే, వీరిద్దరినీ నిందితులుగా పరిగణించడం లేదని, సమాచార ప్రదాతలుగా మాత్రమే చూస్తామని వారు స్పష్టం చేశారు. కాగా, గతవారం పీఎన్‌బీలోని ఇద్దరు సీనియర్ అధికారులను కూడా ఈడీ ప్రశ్నించింది. మరోవైపు ఈడీ జారీచేసిన సమన్ల ప్రకారం ముంబైలో మంగళవారం ఈడీ ఎదుట హాజరు కావాల్సిన నీరవ్, అతడి భార్య, మామ చోక్సీ ఎక్కడున్నదీ కూడా తెలియడం లేదు. ఈ పరిణామంతో వారి ఆచూకీ తెలుసుకోవడం కోసం ఆరు దేశాల్లోని కోర్టుల నుంచి అధికారికంగా సాయం కోరడం (లెటర్ రొగేటరీ) కోసం సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి అనుమతి పొందారు. ఈ మేరకు హాంకాంగ్, అమెరికా, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దక్షిణాఫ్రికా, సింగపూర్ ప్రభుత్వాలకు లేఖలు (లెటర్ రొగేటరీ) పంపనున్నారు. ఇవేకాకుండా మరికొన్ని దేశాల్లోనూ వారి ఆనుపానులు తెలుసుకోవడం కోసం అనుమతులు పొందాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా దేశాల్లో వీరికిగల ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, భాగస్వామ్యాలు, షోరూములు, ట్రస్టులు తదితరాల వివరాలను కూడా సేకరిస్తారు. అనంతరం వాటి ఆదాయ వనరులపై దర్యాప్తు నిర్వహించి, సదరు ఆస్తులను కేసుకు జోడిస్తారు. ఇప్పటిదాకా రూ.6,393 కోట్ల విలువైన ఆస్తులను సంధానించారు.

ఎఫ్ ఖాతా ఆధార్ లింక్ సులభతరం

- ఉమంగ్ యాప్ ద్వారా అనుసంధానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఇక పీఎఫ్ ఖాతాకు ఆధార్‌ను అనుసంధాన ప్రక్రియ మరింత సులభంగా పూర్తి చేయొచ్చు. ఇంట్లోనే ఉండి మొబైల్ ఫోన్ యాప్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)తో ఆధార్‌ను లింక్ చేయొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల కోసం వినియోగించే ఉమంగ్ యాప్‌లో ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చిందని ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) వెల్లడించింది. యాప్‌లోని ఈ-కేవైసీ పోర్టల్‌లో ఆధార్ అనుసంధాన సర్వీసును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇప్పటికే ఈపీఎఫ్‌వో వెబ్‌సైట్‌లో ఉన్న ఆధార్ అనుసంధాన సర్వీసుకు ఇది అదనం. ఇదిలా ఉండగా, ఈపీఎఫ్‌వో తన వెబ్‌సైట్‌లోనే నామినీ వివరాలను అప్‌డేట్ చేసే సౌకర్యాన్ని ప్రారంభించింది. ఉద్యోగ సంస్థపై ఆధారపడే పనిలేకుండా ఈపీఎఫ్‌వో సభ్యుడు తనంతట తానే నామినీ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచవచ్చు. అయితే పీఎఫ్ ఖాతాకు ఆధార్‌ను అనుసంధానించిన వారు మాత్రమే సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఈపీఎఫ్‌వో వెల్లడించింది. నామినీ వివరాలు పొందుపరిచిన తర్వాత ఉద్యోగి తన ఈ-సంతకాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

బిల్లుల వివరాలు ఇవ్వాల్సిందే!


- ప్రధానమంత్రి విమానయాన వ్యయంపై సీఐసీ
- ఆర్టీఐ కింద దరఖాస్తుదారు అప్పీలుపై విచారణ
- విదేశాంగ శాఖ వాదన చెల్లదు: ఆర్కే మాథుర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ప్రధాని విదేశీ పర్యటనల కోసం 2013-17 మధ్య ఎయిరిండియా ప్రత్యేక విమాన వినియోగ ఖర్చులను వెల్లడించాల్సిందేనని కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ)ఆర్.కె.మాథుర్ ఆదేశించారు. ఈ వివరాల కోసం సమాచార హక్కు కింద కమడోర్ (రిటైర్డ్) లోకేష్ బాత్రా దాఖలు చేసిన దరఖాస్తుపై విదేశాంగ శాఖ అరకొర సమాచారం ఇచ్చింది. దీంతో తనకు పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేయగా అధికారులు తిరస్కరించారు. దీంతో ఆయన సీఐసీకి అప్పీలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా- భారత వాయుసేన, ఎయిరిండియాలు రూపొందించిన బిల్లులు, తేదీలు, వాటిలో పేర్కొన్న మొత్తం, పరిశీలన నంబర్లు తదితరాల రికార్డులు వివిధ శాఖల పరిధిలో ఉంటాయని విదేశాంగ శాఖ తెలిపింది. సమాచార హక్కు కింద దరఖాస్తుదారు కోరిన క్రమంలో ఈ భారీ వివరాలను సేకరించి, క్రోడీకరించాల్సి ఉంటుందని పేర్కొంది. ఇందుకోసం అనేక శాఖలలో పలువురు అధికారులు తమ సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుందని, అది అసాధ్యమని వాదించింది. అయితే, సీఐసీ ఈ వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. మరోవైపు ఎయిరిండియా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, అటువంటి సంస్థకు ప్రధాని విదేశీ పర్యటనల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదని బాత్రా వాదించారు. అంతేకాకుండా ఆలస్యమయ్యేకొద్దీ భారీ మొత్తంపై వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదంతా ప్రజలు చెల్లించే పన్నుల నుంచే చెల్లించాల్సినందున ప్రజాధన దుర్వినియోగం కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అందువల్ల జాతీయ భద్రత సాకుతో ఈ వివరాలను ప్రభుత్వం దాచజాలదని వాదించారు. ఈ వాదనతో మాథుర్ ఏకీభవిస్తూ- బకాయిల చెల్లింపులో పెండింగ్ బిల్లుల వివరాలన్నిటినీ క్రోడీకరించక తప్పదన్నారు. కాబట్టి అదొక భారీ కసరత్తుగా విదేశాంగ శాఖ అభివర్ణించడం చెల్లదని, వివరాలు అందజేయాల్సిందేనని స్పష్టం చేశారు.

రండి.. రండి.. పెట్టుబడులు తెండి!

భారత-కొరియా వాణిజ్య సదస్సులో ప్రధాని పిలుపు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ప్రపంచంలో భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత స్వేచ్ఛాయుతమైనదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత-కొరియా వాణిజ్య సదస్సులో మంగళవారం ఆయన ప్రసంగిస్తూ- ప్రజాస్వామ్యం, జనశక్తి, గిరాకీల సమ్మేళనమైన ఆర్థిక వ్యవస్థ భారత్‌కే సొంతమని చెప్పారు. వాణిజ్య సౌలభ్యంలో భారత్‌ను మించిన దేశం మరేదీ లేదని, ఆ మేరకు పెట్టుబడిదారులకు ఆహ్వానం పలుకుతున్నామని ప్రకటించారు. దేశంలో నిలకడగల వ్యాపార వాతావరణాన్ని సృష్టించే దిశగా ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నదని, ఏకపక్ష విధాన నిర్ణయ పద్ధతులకు స్వస్తి పలికిందని తెలిపారు. ''దైనందిన లావాదేవీల్లో సానుకూలతను అభిలషిస్తున్నాం. సందేహ సందోహంలో మునిగిపోవడంగాక నమ్మకపు పునాదిని విస్తరిస్తున్నాం. ప్రభుత్వ ఆలోచనల్లో సంపూర్ణ మార్పునకు ఇదే నిదర్శనం'' అని ప్రధాని వివరించారు. నియంత్రణల రద్దు, లైసెన్సింగ్ విధాన సరళీకరణ పథంలో ప్రభుత్వం సాగుతున్నదని చెప్పారు. ఆ మేరకు పారిశ్రామిక అనుమతుల చెల్లుబాటు వ్యవధిని మూడేళ్ల నుంచి 15 ఏళ్లు అంతకన్నా ఎక్కువ పెంచినట్లు పేర్కొన్నారు.


నాగార్జున

మే 25న ఆఫీసర్

శివ, అంతం, గోవిందా గోవింద చిత్రాల తర్వాత నాగార్జున, రామ్‌గోపాల్‌వర్మ కాంబినేషన్‌లో ఓ చిత్రం ప్రారంభమైన విషయం తెలిసిందే. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు వచ్చింది. ఈ చిత్రానికి 'ఆఫీసర్' టైటిల్‌ని ఖరారు చేస్తూ మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై రామ్‌గోపాల్‌వర్మ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ముంబైలో క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను మే 25న సమ్మర్ స్పెషల్‌గా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా మోడల్ మైరాసరిన్ హీరోయిన్‌గా పరిచయమవుతోంది.

దీపావళికి రజనీకాంత్ '2.0'



రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో 450 కోట్ల భారీ బడ్జెట్‌తో, హై టెక్నికల్ వేల్యూస్‌తో రూపొందుతున్న సినిమా '2.0'. ఈ సినిమా షూటింగ్ పూర్తయి చాలా కాలం అవుతోంది. షూటింగ్ కంటే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కే ఎక్కువ సమయం పట్టే సినిమా కావడంతో ఆ పనిని వేగవంతంగా పూర్తి చేసేందుకు యూనిట్ కసరత్తులు చేస్తోంది. రోజులు గడుస్తున్నాయి కానీ, పని మాత్రం ఓ కొలిక్కి రావడం లేదు. దీంతో సినిమా విడుదల తేదీని పదే పదే వాయిదా వేస్తూ వస్తోంది యూనిట్. నిజానికి 2017 దీపావళికి '2.0' చిత్రాన్ని విడుదల చేయాలని భావించారు. కానీ, వి.ఎఫ్.ఎక్స్ వర్క్, కొంత భాగం షూటింగ్ బ్యాలెన్స్ ఉండడం వల్ల 2018 జనవరి 25కి రిలీజ్‌ని వాయిదా వేశారు. అప్పటికీ వర్క్ పూర్తి కాకపోవడంతో ఏప్రిల్‌లో సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేస్తామన్నారు. ఇప్పుడు మరోసారి ఈ సినిమా వాయిదా పడింది. ఇప్పటి వరకు అనుకున్న ప్రకారం పనులు పూర్తయితే ఆగస్ట్ 15న సినిమాని విడుదల చేస్తారని తెలుస్తోంది. ఈ డేట్ తర్వాత మరో వాయిదా వెయ్యాల్సి వస్తే దీపావళికి ఖచ్చితంగా సినిమాని రిలీజ్ చెయ్యాలని డిసైడ్ అయ్యారని సమాచారం.

దుబాయ్‌లో ప్రభాస్ ఫైట్



ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో యు.వి. క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న చిత్రం 'సాహో'. 150 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ యాక్షన్ సీన్స్ షూట్ కోసం చిత్ర యూనిట్ ప్లానింగ్ చేస్తుండడంతో షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. దుబాయ్‌లో అత్యంత భారీ వ్యయంతో యాక్షన్ సీన్స్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్‌లో ఫైట్స్‌తోపాటు ఛేజ్ సీన్స్ కూడా చిత్రీకరించాలని భావించారు. అయితే అనుమతి లభించకపోవడం వల్ల దుబాయ్‌లో షూటింగ్ అనుకున్న టైమ్‌కి స్టార్ట్ అవ్వలేదు. దీంతో షూటింగ్ వాయిదా పడిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దుబాయ్ తరహాలోనే రామోజీ ఫిలింసిటీలో సెట్ వేస్తే బాగుంటుందన్న విషయాన్ని కూడా యూనిట్ పరిశీలించింది. ఈలోగా దుబాయ్‌లో షూటింగ్ జరిపేందుకు అనుమతి లభించడంతో యూనిట్ అంతా దుబాయ్‌కి షిఫ్ట్ అయ్యేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మార్చి మూడో వారం నుంచి ఈ షెడ్యూల్ జరుగుతుందని తెలుస్తోంది. ఇప్పటికే యూనిట్‌లోని కొందరు దుబాయ్ వెళ్ళి ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టారు. దుబాయ్, అబుదాబి, రొమేనియాల్లో 60 రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగుతుంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన శ్రద్ధా కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే.

మార్చి 3న నితిన్ కల్యాణం



నితిన్ ప్రస్తుతం 'ఛల్ మోహనరంగ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్ శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు ఈ సినిమా షూటింగ్ పూర్తి కావచ్చింది. ఏప్రిల్ 5న ఈ సినిమాని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ కంటే ముందే తన తదుపరి చిత్రాన్ని లైన్‌లోకి తెచ్చేస్తున్నారు నితిన్. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై సతీష్ వేగేశ్న దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించే 'శ్రీనివాస కల్యాణం' చిత్రాన్ని మార్చి 3న లాంఛనంగా ప్రారంభించబోతున్నారు. మార్చి 23 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. నితిన్ సరసన రాశిఖన్నా, నందిత శ్వేత హీరోయిన్లుగా నటించే ఈ చిత్రానికి మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నారు. నితిన్ హీరోగా దాదాపు 15 సంవత్సరాల తర్వాత తన బేనర్‌లో దిల్‌రాజు మళ్ళీ ఈ సినిమా చేయడం విశేషం.

పవన్ కథకు నాని హీరో?


సంతోష్ శ్రీనివాస్

'అజ్ఞాతవాసి' చిత్రం తర్వాత పవన్ కల్యాణ్.. మైత్రి మూవీ మేకర్స్ సంస్థలో సినిమా చేస్తారని, ఆ సినిమాకి సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తారని వార్తలు వచ్చాయి. కానీ, 'అజ్ఞాతవాసి' తర్వాత పవన్ కల్యాణ్ పూర్తిగా రాజకీయాలకే పరిమితమయ్యేలా కనిపిస్తున్నారు. పవన్ కోసం సంతోష్ శ్రీనివాస్ రాసుకున్న కథను ఇప్పుడు వేరే హీరో కోసం మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ కథకు నాని అయితే పర్‌ఫెక్ట్‌గా సరిపోతాడని భావించిన సంతోష నాని ని సంప్రదించారని తెలుస్తోంది. 'కృష్ణార్జునయుద్ధం' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని ఈ సినిమా పూర్తయిన తర్వాత సంతోష్ శ్రీనివాస్ సినిమా గురించి ఆలోచిస్తారని సమాచారం. కిశోర్ తిరుమల దర్శకత్వంలో నాని చెయ్యాల్సిన సినిమా కొన్ని కారణాల వల్ల స్టార్ట్ అవ్వలేదు. కాబట్టి సంతోష్ శ్రీనివాస్‌తోనే నాని సినిమా చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

నానికి జోడీగా మాళవిక



నాగార్జున, నాని హీరోలుగా వైజయంతి మూవీస్ ఓ మల్టీ స్టారర్‌ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. సి.అశ్వనీదత్ నిర్మాత. ఈ చిత్రానికి సంబంధించిన పాటల రికార్డింగ్ ఇటీవల ప్రారంభమైంది. నాగార్జున, వైజయంతి మూవీస్ కాంబినేషన్‌లో వచ్చిన చాలా సినిమాలకు సంగీతం అందించిన మణిశర్మ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ చిత్రంలో నాగార్జున డాన్‌గా, నాని డాక్టర్‌గా నటిస్తున్నారు. మార్చి మొదటి వారంలో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. నాగార్జున సరసన శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా నానికి జోడీగా మాళవిక శర్మను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రవితేజతో కలిసి 'నేల టికెట్' చిత్రంలో నటిస్తున్న మాళవిక శర్మ ఆ సినిమా విడుదల కాకముందే మరో మంచి ఆఫర్‌ను దక్కించుకుంది. పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా నాగార్జున, నాని క్యారెక్టర్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయని తెలుస్తోంది. రామ్‌గోపాల్‌వర్మతో చేస్తున్న సినిమా పూర్తి కాగానే ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు నాగార్జున.


నిరూప్ బండారి

'రాజరథం'కి టాప్ టెక్నీషియన్స్ ప్రశంస

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'రాజరథం'. ఈ చిత్రానికి దేశంలోని టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. ఫస్ట్‌లుక్, ట్రైలర్‌ని చూసి ఆ చిత్రానికి పని చేస్తున్న టెక్నీషియన్స్ దర్శకనిర్మాతల్ని ప్రశంసించారు. ఈ చిత్రానికి సౌండ్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాజాకృష్ణన్ దేశంలోనే పేరొందిన సౌండ్ మిక్సర్స్‌లో ఒకరు. 'ప్రేమమ్', 'బెంగుళూరు డేస్', 'విక్రమ్‌వేద', 'అర్జున్‌రెడ్డి', 'అ..ఆ..', 'నా పేరు సూర్య' వంటి చిత్రాలకి ఈయన పని చేశారు. ఆయన 'రాజరథం'కి మిక్సింగ్ చేస్తున్నప్పుడు సినిమా ఔట్‌పుట్ చూసి దర్శకుడు అనూప్‌ని ప్రశంసలతో ముంచెత్తారట. ''ఈ సినిమా నా కెరీర్‌లోనే ఒక మైల్‌స్టోన్‌గా నిలిచిపోతుంది'' అని ఆయన అన్నారు. 'బాహుబలి', 'ఈగ', 'దృశ్యం', 'రంగితరంగా' వంటి చిత్రాలకి పనిచేసిన కలరిస్ట్ శివకుమార్ 'రాజరథం'కి పని చేయడం ఒక గొప్ప అనుభవంగా చెప్తున్నారు. సినిమాని చాలా అద్భుతంగా తెరకెక్కించారని శివకుమార్ అన్నారు. ఆర్య, రవిశంకర్, రానా దగ్గుబాటి వాయిస్‌తో రూపొందిన 'రాజరథం' చిత్రాన్ని జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మార్చి 23న విడుదల కాబోతోంది.



వారియర్ క్వీన్ సన్నీ లియోన్

సన్నీ లియోన్ నటిగా ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఆమెకు దక్షిణాది సినిమాల్లో కూడా మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పటికే కొన్ని సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌తో, స్పెషల్ క్యారెక్టర్స్‌తో అలరించిన సన్ని ఇప్పుడు 'వీరమాదేవి' చిత్రంతో పూర్తి స్థాయి కథానాయకిగా ఎంట్రీ ఇవ్వనుంది. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి విసి వడివుడియన్ దర్శకుడు. ఈ సినిమాలో సన్నీ లియోన్ వారియర్ క్వీన్‌గా దర్శనమివ్వనుంది. తన పాత్ర కోసం ఇప్పటికే గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం వంటి విద్యల్లో శిక్షణ పొందిన సన్ని తమిళ భాష మీద కూడా పట్టు సాధించాలని ప్రయత్నిస్తోంది. తను చెప్పే డైలాగ్స్‌కి అర్థం తెలిసినపుడే నూటికి నూరు శాతం పెర్‌ఫార్మెన్స్ ఇవ్వగలనని భావించి తమిళ్ నేర్చుకుంటోంది. దాదాపు 150 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందుతున్న 'వీరమాదేవి' తనకు హీరోయిన్‌గా మంచి బ్రేక్ ఇస్తుందని భావిస్తోంది సన్నీ లియోన్.

ప్రత్యేక హోదా మన హక్కు

చట్టంలో పెట్టినవి ఎందుకివ్వరు?


40 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తిచేసుకున్న చంద్రబాబుకు నేతల అభినందన

- అడిగే హక్కు మనకు ఉంది
- తెలివితేటలతో అభివృద్ధి చేస్తున్నా
- కేంద్రం కూడా అండగా ఉండాలి
- రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం లేకుండా.. కేంద్రంపై ఒత్తిడి తెద్దాం
- తప్పుడు లెక్కలు వైసీపీకి అలవాటు
- అందుకే జైల్లో చిప్పకూడు తిన్నాడు
- పెట్టుబడులపై తప్పడు ప్రచారం తగదు
- మీడియాతో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదా అనేది ఏపీ హక్కు అని, ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కొనసాగించేటట్టయితే తప్పకుండా రాష్ట్రానికి కూడా ఇవ్వాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ''గత మూడున్నరేళ్లగా కేంద్రం మనకు అంతగా సహకరించలేదు. రాష్ట్రానికి ఎందుకు నిధులు ఇవ్వలేదో అడిగే హక్కు మనకుంది. చట్టంలో పెట్టిన అంశాలు కూడా పూర్తిగా ఇవ్వలేదు. కేంద్రం ఏమీ ఇవ్వలేదని నేను పేద అరుపులు అరవలేదు. అలా అరిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయా? సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరించుకున్నాం. తెలివితేటలతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంచాం. దీనికి కేంద్రం కూడా సహకరిస్తే మరింత ముందుకు వెళ్లే వాళ్లం. రాష్ట్రానికి రావాల్సినవే కేంద్రాన్ని అడుగుతున్నాం. అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లు పరిశ్రమల ప్రోత్సాహకాలు మాకు ఇవ్వండి అని అడుగుతున్నాం. కేంద్రంలో ఉన్న ఏ పార్టీ అయినా ఒక రాష్ట్ర ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా వెళ్లకూడదు. అవి దుష్పరిణామాలకు దారితీస్తుంది. ప్రజల ఆగ్రహానికి గురైన పార్టీలన్నీ చరిత్రలో కలిసిపోయాయి. ప్రజల్లో ఆ భావన కలిగించడం మంచి పద్ధతి కాదు. ప్రత్యేక హోదా ఒక్కటి ఇస్తే సరిపోతుంది అని వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంది. హోదాతో కేంద్రం అన్నీ ఇస్తుందనే జీవో ఉంటే తీసుకురమ్మని వైసీపీని అడుగుతున్నాం. ప్రజలను మభ్యపెట్టి, మోసం చేయడం కరెక్ట్ కాదు. నేను 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పారదర్శకంగా ఉన్నా. అందుకే నన్ను ప్రజలు ఎవరికి ఇవ్వనంత గౌరవం ఇచ్చారు'' అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. దీనికి ప్రజల్లో కూడా చైతన్యం తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రజలు చాలా తెలివైన వారని, బంద్‌లతో బస్సులు పగలగొట్టి రోడ్ల మీదకు వచ్చే వాళ్లు కాదన్నారు. దానివల్ల రాష్ట్రానికి తీరని నష్టం కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు తాము చేయాల్సింది ఓటు ద్వారా సైలెంట్‌గా సమాధానం చెబుతారని, గతంలో కాంగ్రెస్‌కు కూడా అదే విధంగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ కాంగ్రెస్ ఏ ఎన్నికల్లో వెయ్యి ఓట్లు కూడా మించి రావటం లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన కాగానే రాయలసీమ రాళ్ల సీమలా, ఏడారిలా మారిపోతుందని అందరూ హేళన చేశారని, దానిని తాను ఛాలెంజ్‌గా తీసుకుని అభివృద్ధి చేశామని చంద్రబాబు చెప్పారు. జగన్ సొంత ఊరు పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత టీడీపీదే అని స్పష్టం చేశారు.

తప్పడు లెక్కలన్నీ వైసీపీవే..

విశాఖపట్నంలో సీఐఐ సదస్సులో పెట్టుబడిదారులు రాలేదని, చంద్రబాబు ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తోందని జగన్ మీడియా తప్పుడు రాతలు రాస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. ''తప్పుడు లెక్కలు మావి కాదు. మీవి. ఇంటిలో కూర్చొని తప్పుడు లెక్కలు చేశారు. అందుకే 16 నెలలు జైల్లో చిప్పకూడు తిన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులపై తప్పుడు ప్రచారం తగదు. పెట్టుబడి దారులకు నా మీద విశ్వసనీయత ఉంది. అందుకే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. గత ఏడాది సీఐఐ సదస్సు జరుగుతున్నప్పుడు జల్లికట్టు పేరుతో విశాఖలో సమస్య తీవ్రతరం చేయటానికి కుట్రపన్నారు. విజయవాడలో ఐఏఎస్ అధికారులను బెదిరించారు. క్రిమినల్ చరిత్ర ఉన్నవాళ్లు రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిసే వాళ్లు ఎవరో ప్రజలకు తెలుసు. ఆఫీసర్లు జైలుకు పంపించిన ఘనత ఎవరిదో తెలుసు. కేంద్రం వద్దకు రాత్రి వెళ్లి కలిసి పగలు వచ్చి హోదా గురించి మాట్లాడుతున్నారు. ఎవరి దగ్గర మీ డ్రామాలు. ప్రజలను తప్పు దోవ పట్టించుడానికే వైసీపీ నాటకాలు ఆడుతోంది. ఇలా అన్నింటికి అడ్డం పడే వారిని నా రాజకీయ జీవితంలో ఎవరినీ చూడలేదు'' అని చంద్రబాబు అన్నారు.

చిత్తూరు సీమలో లేదా?

రాయలసీమకు ఏమీ ఇవ్వలేదని ఇప్పుడు కొత్త పాట పాడుతున్నారని బీజేపీ, వైసీపీలనుద్దేశించి చంద్రబాబు ఘాటుగా స్పందించారు. అనంతపురంలో కియా మోటార్స్ వచ్చిందని, కడప, కర్నూలు, అనంతపురంలో రైతులకు నీళ్ల ఇవ్వగలిగామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనులను తాము చేసి చూపించామన్నారు. ఓర్వకల్‌లో విమానాశ్రయం జూన్‌లోగా పనులు ప్రారంభమవుతుందని తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం రాయలసీమను అభివృద్ధి చేసుకుంటుపోతున్నామని, రాయలసీమలో పశ్చిమగోదావరి కన్నా ఎక్కువగా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ముఖ్యంగా సీమ ప్రజలను రెచ్చగొట్టడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. తాను చిత్తూరులో పుట్టానని, చిత్తూరు సీమలో లేదా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

నాయకత్వం బాగుంటేనే అభివృద్ధి

''ప్రపంచంలో రాజకీయాలు మారుతున్నాయి. చైనాలో కమ్యూనిజం ఉంది. తక్కువ ప్రజాస్వామ్యం ఉన్నా నాయకత్వం వల్ల అభివృద్ధి సాధిస్తోంది. సమర్థవంతమైన నాయకత్వంతో దుబాయ్‌ను అభివృద్ధి చేసుకున్నారు. ఇజ్రాయిల్‌లో నీళ్ల లేకపోయినా సముద్రపు నీళ్ల ఉపయోగించుకుని ముందుకుపోతున్నారు. రష్యాలో పొలిటికల్ రిఫార్మ్ తీసుకోవటం వల్ల మిగిలిన దేశాల కన్నా వెనకబడింది. ఇండియాలో అన్ని వనరులు ఉన్నాయి. కానీ అభివృద్ధి కాలేకపోతున్నాం. ఎందుకంటే స్థిరత్వం కలిగిన ప్రభుత్వం లేకపోవడం వల్లే వెనుకబడిపోతున్నాం. రాష్ట్రంలో కూడా 2014లో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి 9 నెలల్లో అడ్డంకులను అధిగమించగలిగాం. ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు ఆత్మగౌరవం నినాదం ఇచ్చారు. నేను ఆత్మవిశ్వాసం అనే నినాదాన్ని ఇచ్చాను. కొత్త రాజధానిలో ఒక్క పిలుపుకే 33 వేల ఎకరాలు ఇచ్చి రైతులు అండగా నిలిచారు'' అని చంద్రబాబు పేర్కొన్నారు.



అధికారం మాదే

(మొదటి పేజీ తరువాయి)

తాండూరులో నిర్వహించిన బహిరంగసభలో ఉత్తమ్ మాట్లాడారు. తెలంగాణ ప్రజల కొరకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేశారని, రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి రుణ మాఫీలో విఫలమయ్యారని ఆయన అన్నారు. అప్పుల బాధతో ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆత్మహత్య చేసుకున్న ఒక్క కుటుంబాన్ని కూడా కేసీఆర్ పరామర్శించిన పాపాన పోలేదని మండిపడ్డారు. రైతుల పట్ల నిరుద్యోగుల పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబ పాలనతో దోపిడీ చేస్తున్నాడని ఆరోపించారు. బస్సుకు యాత్రకు వస్తున్న స్పందనను చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను వెంటనే భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి చెల్లిస్తామని చెప్పారు. పార్టీ సీనియర్ నేత జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రైతులను ప్రజలను, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని స్థితిలో సీఎం ఉన్నారన్నారు.భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోదళిత, గిరిజనులకు స్వేచ్ఛలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని అన్నారు. గులాబీ పార్టీ చీడ వదిలించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

అసెంబ్లీకి వైసీపీ దూరం?

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటుకు డిమాండ్
- గత సమావేశాల్లో మాదిరిగా ఈసారి వ్యూహం
- త్వరలో జగన్‌తో పార్టీ ముఖ్య నేతల చర్చలు
- హోదాపై టీడీపీ, బీజేపీ విమర్శల పరంపర
- సభలో ఈ పార్టీల వైఖరిపై వేచిచూసే ధోరణి
- ప్రజలతో మమేకమై ఎండగట్టాలని యోచన

అమరావతి, ఫిబ్రవరి 27 (మనం ప్రతినిధి): వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షం వైసీపీ దూరంగా ఉండాలని నిర్ణయించినట్టు సమాచారం. వైసీపీ గుర్తుపై గెలిచి టీడీపీలో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గత సమావేశాలకు గైర్హాజరైన ఆ పార్టీ తాజా సమావేశాల్లోనూ అదే వ్యూహం అనుసరించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పేరుతో ప్రజాక్షేత్రంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోతే ప్రజలకు ఏమైనా తప్పుడు సంకేతాలు వెళ్తాయా అన్న విషయంపై జగన్‌తో ముఖ్య నేతలు చర్చించనున్నట్టు సమాచారం. కాగా వైసీపీలోని కొంతమంది ఎమ్మెల్యేలు మాత్రం అసెంబ్లీ సమావేశాలలో అధికార పక్షాన్ని నిలదీయాలని సూచిస్తునట్టు తెలుస్తోంది.

మిత్రభేదం బయట పడేనా..?

కొంతకాలంగా సందర్భాన్ని బట్టి వ్యూహాలు రచిస్తున్న జగన్ ఈ సారి అసెంబ్లీ సమావేశాలను వేదికగా మార్చుకోవాలని చూస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే అంశంలో మిత్రపక్షాలు టీడీపీ, బీజేపీలు పరస్పర కత్తులు నూరుకుంటున్న నేపథ్యంలో అసెంబ్లీలో ఈ రెండు పార్టీల వైఖరి ఎలా ఉంటుందో వేచి చూసే ధోరణిలో జగన్ ఉన్నట్లు సమాచారం. బీజేపీ కనుక కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల విషయంలో టీడీపీని నిలదీస్తే రెండు పార్టీల బండారం బయట పడుతుందని వైసీపీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జనంతో మమేకమై టీడీపీ, బీజేపీ తోడు దొంగల వ్యవహారాన్ని ఎండగడతామని ఉత్తరాంధ్రకు చెందిన ఓ వైసీపీ ఎమ్మెల్యే చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కానికి వేదిక అయిన అసెంబ్లీలో గత డిమాండ్‌కు గైర్హాజరు కానున్న నేపథ్యంలో అక్కడ జరిగే పరిణామాలను మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ఎండగట్టాలని జగన్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ విషయంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారని విశ్వసనీయ సమాచారం.

అమరావతి ఇలాకాలో జగన్ యాత్ర

మార్చిలో జరిగే అసెంబ్లీ సమావేశాల సమయానికి వైసీపీ అధినేత జగన్ అమరావతి శివారులోకి ప్రవేశిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో ఆయన పాదయాత్ర చేస్తున్నారు. ప్రజలతో మమేకం అవుతూనే అధికార పార్టీపై ఎదురు దాడి చేయాలని వైస్ జగన్ నిర్ణయించినట్టు తెలుస్తోంది.



అన్నీ కోర్టులే చెప్పాలా?

- సమస్యపై స్పందించడం తెలియదా?
- ఎస్వీబీసీ చానల్ సీఈవో వ్యవహారంలో
- టీటీడీపై ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం లీగల్ ప్రతినిధి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వర భక్తి చానల్ (ఎస్వీబీసీ) ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఏవీ నర్సింహారావు పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగడాన్ని ఉమ్మడి హైకోర్టు తప్పుబట్టింది. పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా ఆయనకు జీతభత్యాలు ఎలా చెల్లిస్తారని టీటీడీ ఈవోను ప్రశ్నించింది. సమస్య వచ్చినప్పుడు ఎలా స్పందించాలో కూడా తెలియదా? అన్నీ కోర్టులే చెప్పాలా అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్వీబీసీ సీఈవోగా ఉన్న నర్సింహారావు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని, చట్ట వ్యతిరేకంగా నియామక గడువు ముగిసిన తర్వాత కూడా సీఈవో పదవిలో ఉంటూ ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకుని లబ్ధి పొందారని ఆరోపిస్తూ తిరుపతికి చెందిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిల్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ''పదవీ కాలం ముగిసిన వ్యక్తిని ఏవిధంగా కొనసాగించారు? ఆ వ్యక్తి నిర్ణయాలు తీసుకోవడం ఎలా సాధ్యం? అసలు వాటిని ఎలా అమలు చేస్తారు?'' అంటూ టీటీడీ తరపు లాయర్‌పై సీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని బెంచ్ ప్రశ్నల వర్షం కురిపించింది. మీ చర్యలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదంటూ అసహనం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీటీడీ లాయర్ స్పందిస్తూ ఈ విషయంలో హైకోర్టు ఆదేశాలను అనుసరించి నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో.. సీజే రమేశ్ రంగనాథన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ కోర్టులు చెప్పినట్లుగానే చేస్తున్నారా.. మీ ఎదురుగా సమస్య తెరపైకి వచ్చిన తర్వాత కూడా నిర్ణయం తీసుకోలేరా? అని ప్రశ్నించింది. తిరిగి నరసింహారావునే సీఈవోగా కొనసాగిస్తారా లేక మరో వ్యక్తిని నియమిస్తారా? అనే దానిపై స్పష్టంగా తెలియజేయాలని బెంచ్ ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ విషయంపై అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది.

నాడు సీఎస్ మీరే కదా?

- స్విస్ చాలెంజ్‌పై ఇప్పుడు కోర్టుకు రావడమేంటి
- స్వప్రయోజనాలు లేవంటారా
- ఐవైఆర్‌కు హైకోర్టు ప్రశ్నలు.. అఫిడవిట్‌కు వారం గడువు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (మనం లీగల్ ప్రతినిధి): ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి కోసం స్విస్ ఛాలెంజ్ విధానాన్ని ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమంటూ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావుపై కోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ విధానాన్ని ఆమోదించినప్పుడు ప్రభుత్వ కార్యదర్శిగా ఉన్నది మీరే కదా? మరి ఇప్పుడు ఆ విధానాన్ని మీరే వ్యతిరేకించడమేంటి? ఈ వ్యాజ్యం దాఖలు చేయడం వెనుక వ్యక్తిగత ప్రయోజనాలేవీ లేవంటారా? దీనిపై మీ స్పందనేంటి' అంటూ హైకోర్టు ప్రశ్నించింది. స్విస్ చాలెంజ్ విధానం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమని, ఏపీ మౌలిక వసతుల కల్పన చట్ట నిబంధనల్ని ఉల్లంఘనని పేర్కొంటూ ఐవైఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని బెంచ్ మంగళవారం విచారించింది. కేసు విచారణ ప్రారంభం కాగానే అడ్వకేట్ జనరల్ శ్రీనివాస్ కల్పించుకుని.. స్విస్ చాలెంజ్ ఆమోదం తెలిపినప్పుడు సీఎస్‌గా ఐవైఆర్ కృష్ణారావే ఉన్నారని, ఈ విషయాన్ని వ్యాజ్యంలో ఎక్కడా చెప్పలేదని కోర్టుకు వివరించారు. దీనిపై బెంచ్ వివరణ కోరింది. స్విస్ చాలెంజ్ విధానాన్ని ఆమోదించినప్పుడు ఏపీ సీఎస్‌గా ఉన్న మీరు నాడు ఏ విధమైన అభ్యంతరాలు చెప్పకుండా పదవీ విరమణ చేశాక ఆ జీవోలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరడమేంటని ప్రశ్నించింది. దీని వెనుక వ్యక్తిగత ప్రయోజనాలు ఉండే అవకాశాలు లేవంటారా? అని బెంచ్ ప్రశ్నించగా.. దీనిపై అదనపు అఫిడవిట్ దాఖలు చేసేందుకు అనుమతివ్వాలని ఐవైఆర్ కోరారు. ధర్మాసనం అనుమతిస్తూ వారం రోజులు గడువు ఇచ్చింది. కేసును స్వయంగా ఐవైఆర్ కృష్ణారావే వాదించుకున్నారు.

హజ్ యాత్రికులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)



వెల్లడించారు. ముస్లింల మేలు కోసం పీఎంవో తీసుకున్న కీలక నిర్ణయంగా దీన్ని ఆయన అభివర్ణించారు. ఇది మభ్యపెట్టే విధానాలతో కాకుండా సాధికారతే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. హజ్ యాత్రికులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా, ఆర్థికంగా దోచుకుందని.. ఈ ధోరణికి తమ ప్రభుత్వం చెక్ పెడుతోందని నఖ్వీ చెప్పారు. దీనికి ఉదాహరణగా తాజా హజ్ విమాన చార్జీలతో 2013-14 నాటి చార్జీలను ఆయన పోల్చారు. 2013-14లో అహ్మదాబాద్ నుంచి విమానంలో హజ్‌కు వెళ్లి రావాలంటే రూ.98,750 ఖర్చయ్యేదని, 2018లో అది రూ.65,015కు చేరిందని వివరించారు. అలాగే ముంబై నుంచి అయితే నాడు రూ.98,750 ఉండేదని, ఇప్పుడు రూ.57,857తోనే హజ్ వెళ్లి రావచ్చని పేర్కొన్నారు. కాగా, ధార్మిక యాత్రలపై 2012లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా హజ్ యాత్రికులకు గతంలో ఉన్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం తొలగిస్తూ గత నెలలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

సబ్సిడీ కన్నా ఎక్కువ లబ్ధి


ఇదిలా ఉండగా, హజ్ సబ్సిడీతో పోలిస్తే విమాన చార్జీల తగ్గింపుతోనే యాత్రికులకు ఎక్కువ లబ్ధి చేకూరుతోంది. గతంలో ఒక్కో యాత్రికుడికి రూ.35 వేల సబ్సిడీని ప్రభుత్వం అందించేంది. 2013-14 నాటి చార్జీల ప్రకారం ముంబై నుంచి హజ్‌కు వెళ్లి రావాలంటే రూ.98,750 ఖర్చవుతుంది. ఈ మొత్తంలో సబ్సిడీ పోను 63,750 రూపాయలు యాత్రికులు భరించాల్సి వచ్చేంది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హజ్ ప్రయాణం రూ.57,857తోనే పూర్తవుతుంది. అంటే హజ్ యాత్రికులకు 5,893 రూపాయల అదనపు లబ్ధి చేకూరుతోంది. కాగా, హజ్ యాత్రికుల సబ్సిడీని అడ్డంపెట్టుకుని గతంలో విమానయాన సంస్థలు భారీగా దోచుకునేవని ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వాలతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా భారీగా హజ్ చార్జీలు పెంచేసి.. సబ్సిడీ సొమ్మును మింగేసేవని బీజేపీ నాయకులు దుమ్మెత్తిపోశారు.

11,493 కిలోల గంజాయి దహనం

- తగులబెట్టిన విశాఖపట్నం జిల్లా పోలీసులు
- పోలీస్ స్టేషన్లలో మరో 1,50,000 కిలోలు



విశాఖపట్నం, ఫిబ్రవరి 27 (మనం న్యూస్ బ్యూరో): విశాఖపట్నం జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న 11,493 కిలోల గంజాయిని తగులబెట్టారు. వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో పలు కేసులలో స్వాధీనం చేసుకున్నారు. కోర్టు అనుమతితో డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎమ్‌సీ మారికవలస డంపింగ్ యార్డులో గంజాయిని దహనం చేశారు. అనకాపల్లి సబ్ డివిజన్‌లోని అనకాపల్లి టౌన్ (11), చోడవరం (12), మాడుగుల (51) బుచెయ్యపేట (11) పోలీస్ స్టేషన్‌లలో నమోదైన మొత్తం 85 కేసులలో 11,493 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక కేజీ గంజాయి విలువ విశాఖపట్నంలో రూ. 2,000 ఉంటుంది. బయట ప్రాంతాల్లో రూ.5,000 నుంచి రూ.10,000 వరకూ ఉంటుంది. గంజాయిని దహనం చేయడానికి డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్‌గా విశాఖపట్నం రేంజ్ డీఐజీ శ్రీకాంత్, సభ్యులుగా జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ విశాఖపట్నం డీసీ గోపాలకృష్ణ ఉన్నారు. డీఐజీ మాట్లాడుతూ.. విశాఖపట్నం జిల్లాలో నమోదైన 1,100 కేసులలో 1,50,000 కిలోల గంజాయి వివిధ పోలీసు స్టేషన్లలో ఉందని చెప్పారు. త్వరలో ఆ గంజాయిని కూడా కోర్టు అనుమతితో దహనం చేస్తామన్నారు. ఇప్పటికే 15 మందిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి వ్యాపారంలో ఆస్తులు సంపాదించిన ఇద్దరిపై కేసులు నమోదు చేసి, ప్రభుత్వం వారి ఆస్తులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు డి.వి రమణ, సి.హెచ్ వివేకానంద, డి. మురళీరావు తదితరులు పాల్గొన్నారు.






సెన్సెక్స్ ఫిబ్రవరి 2018 27

34,346.39

▼-99.36




పెరిగినవి	%	తగ్గినవి	%
భారతి ఎయిర్‌టెల్	2.07	యాక్సిస్ బ్యాంకు	-2.68
డాక్టర్ రెడ్డీస్	1.82	ఎస్‌బిఐ	-2.46
హీరో మోటార్స్	1.64	సన్ ఫార్మా	-2.02
ఎన్‌టీపీసీ	1.53	ఐసీఐసీఐ బ్యాంకు	-1.56
రిలయన్స్	1.21	టాటా స్టీల్	-1.47

నిఫ్టీ ఫిబ్రవరి 2018 27

10,554.30

▼-28.30



పెరిగినవి	%	తగ్గినవి	%
ఐడియా సెల్యులార్	2.37	అంబుజా	-4.39
డాక్టర్ రెడ్డీస్	1.92	యాక్సిస్ బ్యాంక్	-2.52
భారతి ఎయిర్‌టెల్	1.74	ఎస్‌బిఐ	-2.50
ఎన్‌టీపీసీ	1.60	సన్ ఫార్మా	-2.01
హీరో మోటార్స్	1.35	కోల్ ఇండియా	-1.61

టాప్ లూజర్స్ 27 ఫిబ్రవరి

34,346.39


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
537.50	యాక్సిస్ బ్యాంకు	-2.68%
268.00	ఎస్‌బిఐ	-2.46%
544.90	సన్ ఫార్మా	-2.02%
321.90	ఐసీఐసీఐ బ్యాంకు	-1.56%
670.25	టాటా స్టీల్	-1.47%
8883.45	మారుతి సుజుకి	-1.31%
188.40	ఓఎన్‌జీసీ	-1.23%
310.65	కోల్ ఇండియా	-1.13%
1824.10	హెచ్‌డీఎఫ్‌సీ	-1.01%
1095.05	కోటక్ మహీంద్రా	-0.95%

-99.36

బులియన్ | గత 7 రోజులు




రూపాయి వర్సెస్ డాలర్




నీరుగారిన ఉత్సాహం

సెన్సెక్స్ 100 పాయింట్లు కోల్పోగా, 10,500 పై స్థాయిని నిలబెట్టుకున్న నిఫ్టీ



న్యూఢిల్లీ: మంగళవారం స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు ముమ్మరమవడంతో షేర్ల ధరలు పతనమయ్యాయి. రెండు సెషన్లలో బలంగా కనిపించిన ర్యాలీకి మళ్ళీ బ్రేక్ పడింది. స్థూల ఆర్థిక డాటా బుధవారం వెల్లడి కానుండడంతో మదుపరులు రిస్కు తీసుకోవడం ఎందుకనే ధోరణిలో పడిపోయారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో సాగిన కుంభకోణం ముందు అనుకున్నట్లుగా సుమారు రూ. 11,400 కోట్లు కాక, రూ. 1300 కోట్ల మేర ఉండవచ్చని అంచనాకు రావడంతో బ్యాంకింగ్ రంగ షేర్ల ధరలు తీవ్రంగా పతనమయ్యాయి. బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' సుమారు 100 పాయింట్లు కోల్పోయి 34,346.39 పాయింట్ల వద్ద ముగిసింది. నిజానికి 'సెన్సెక్స్' మంగళవారం 34,558.56 పాయింట్ల వద్ద హెచ్చు స్థాయిలోనే ప్రారంభమైంది. తొలి ట్రేడింగ్‌లో 34,610.79 పాయింట్ల గరిష్ఠ స్థితిని కూడా చూసింది. కానీ, వెంటనే తిరోగమనంలో పడి 34,314.87 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. దేశీయ మదుపు సంస్థలు మొక్కవోని విశ్వాసంతో కొనసాగిస్తున్న కొనుగోళ్ళతో 'సెన్సెక్స్' గత రెండు సెషన్లలో 626.25 పాయింట్లు పుంజుకుంది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' స్వల్పంగా 28.30 పాయింట్లు క్షీణించి 10,554.30 పాయింట్ల వద్ద ముగిసింది.





అమ్మకాల ధోరణిలో ఎఫ్.పి.ఐలు

తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ)లు సోమవారం రూ. 1,119.51 కోట్ల విలువ చేసే షేర్లు విక్రయించగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 1,409.45 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశాయి.

పెరిగిన శింభౌలి షేర్ ధర

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ నుంచి తీసుకున్న రుణాన్ని పూర్తిగా చెల్లించడానికే కట్టుబడి ఉన్నామని ప్రకటించిన తర్వాత శింభౌలి షుగర్స్ కంపెనీ షేర్ ధర మంగళవారం 10.92 శాతం పుంజుకుంది.



బాక్సైట్ గనుల వేలం

న్యూఢిల్లీ: దేశంలో అల్యూమినియం ఉత్పత్తిని పెంపొందించేందుకు 10 బాక్సైట్ గనులు వేలం వేయాలని గనుల మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 'తుప్పుపట్టని లోహాలు–2030 నాటికి భారతదేశంలో పరిస్థితి' అనే అంశంపై భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడారు. ''మనకు బాక్సైట్ నిక్షేపాలు కావలసినన్ని ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు ముడి సరకు లేక బాధపడుతున్న సంగతి కూడా నాకు తెలుసు. కానీ, మరింత పారదర్శకమైన వేలం ప్రక్రియను పాటించవలసి ఉంది. ధర నిర్ణయ సమస్యను వచ్చే నెలలో లేదా అంతకుమించి మరికొద్ది రోజుల్లో పరిష్కరిస్తాం. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో సుమారు 10 బాక్సైట్ బ్లాకులు వేలానికి రానున్నాయి'' అని అరుణ్ కుమార్ చెప్పారు. దేశ రాగి అవసరాలకు కూడా దిగుమతి ప్రత్యామ్నాయాన్ని చూడడంపై ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని ఆయన చెప్పారు. ''రాగి విషయంలో, మన దేశీయ ఉత్పత్తి, మన అవసరాల్లో సుమారు 4 శాతం మాత్రమే తీర్చేదిగా ఉంది. రాగి నిక్షేపాల బ్లాకులు కూడా కొన్ని వేలానికి రానున్నాయి. రాగి నిర్జలికి మనం విదేశాలపై ఆధారపడడం కొనసాగుతున్నప్పటికీ, మన సొంత ఖనిజాన్ని తవ్వుకునే సామర్థ్యాన్ని పెంచుకునే పనిని కొనసాగిస్తాం'' అని ఆయన చెప్పారు.

అమెరికాలో నీరవ్ దివాలా దరఖాస్తు



న్యూయార్క్: భారతదేశపు అతి పెద్ద బ్యాంక్ మోసంలో నిందితుడు నీరవ్ మోదీకి చెందిన అంతర్జాతీయ నగల వ్యాపార సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ ఇన్‌కార్పొరేటెడ్ దివాలా తీసినట్లుగా అమెరికాలో దరఖాస్తు దాఖలు చేసుకుంది. న్యూయార్క్ సదరన్ బ్యాంక్‌రప్టీ కోర్టులో ఫైర్‌స్టార్ డైమండ్ సోమవారం చాప్టర్ 11 పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును న్యాయమూర్తి సియాన్ హెచ్. లేన్‌కు అప్పగించారు. ''ఆర్డర్ ఫర్ రిలీఫ్ నమోదైంది'' అని కోర్టు వెల్లడించింది. ఆస్తులు, అప్పులు కలసి 100 మిలియన్ల అమెరికన్ డాలర్ల మేరకు ఉంటాయని కంపెనీ చెప్పుకున్నట్లు కోర్టు డాక్యుమెంట్ తెలిపింది. కంపెనీ తరపు వకీలు క్లెస్టడ్ వింటర్స్‌కు ఈ విషయమై పంపిన ఇ–మెయిల్‌కు జవాబు రాలేదు. ఫైర్‌స్టార్ డైమండ్ దాని వెబ్‌సైట్‌లో అమెరికా, యూరప్, మధ్య ప్రాచ్యం, దూర ప్రాచ్యం, ఇండియాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకుంది. లిక్విడిటీ, సరఫరా పరమైన సవాళ్ళను ఎదుర్కొంటున్నట్లు చెప్పింది. వజ్రాల లూజు సరఫరాదారుగా 1999లో మొదలైన సంస్థ 2001లో నగల తయారీదారుగా విస్తరించినట్లు వెల్లడించింది. ప్రైవేటు లేబుల్ పొందేందుకు, అమెరికా జాతీయ రిటైల్ మార్కెట్‌లో ప్రవేశించేందుకు అది ఫ్రెడరిక్ గోల్డ్‌మ్యాన్ డైమండ్ జువెలరీ సంస్థను స్వాధీనం చేసుకుంది. దివాలా దరఖాస్తులో అనుబంధ సంస్థలను కూడా చేర్చింది. రుణాలిచ్చిన సంస్థలు 50 నుంచి 99 వరకు ఉంటాయని పేర్కొంది.

'పదిహేను రోజుల్లో పరిస్థితులు చక్కబడాలి'

ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఫైనాన్షియల్ కార్యదర్శి రాజీవ్ కుమార్ ఆదేశం



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) కుంభకోణంలో ఇమిడి ఉన్న మొత్తం రూ. 12,700 కోట్లుగా వెల్లడవడంతో, లొసుగులను గుర్తించే ''ముందస్తు చర్య తీసుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకు (పి.ఎస్.బి)లకు 15 రోజుల గడువు విధిస్తున్నట్లు ఫైనాన్షియల్ సర్వీసుల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ చెప్పారు. పెరుగుతున్న కార్యనిర్వాహక, టెక్నికల్ రిస్కులను కనిపెట్టి లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని ఆయన ఆదేశించారు. పెరుగుతున్న నష్ట ప్రమాదాలతో పోరాడే సన్నద్ధతను పెంచుకునేందుకు వీలుగా ఒక విపుల ప్రణాళికను తయారు చేసుకోవాలని పి.ఎస్.బిల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఛీఫ్ టెక్నలాజికల్ ఆఫీసర్ల (సి.టి.ఓల)కు ఆయన సూచించారు. ''ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు, లొసుగులు, బలహీనతలు గుర్తించేందుకు, కార్యనిర్వాహక, టెక్నికల్ పరమైన రిస్కులను నివారించేందుకు పి.ఎస్.బిలకు 15 రోజుల గడువు ఇస్తున్నాం. ఉత్తమ విధి విధానాల నుంచి అవి పాఠాలు నేర్చుకుని, సాంకేతిక పరమైన పరిష్కారాలతో సహా సునిశిత వ్యూహాలు రూపొందించుకోవాలి. సీనియర్ అధికారుల జవాబుదారీతనం విషయంలో స్పష్టత ఏర్పరుచుకోవాలి'' అని రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు.బ్యాంకింగ్ రంగంలోని ఉత్తమ విధానాల నుంచి మేలైన మార్గాలను నేర్చుకునే బాధ్యత గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, సి.టి.ఓలదే. ఇప్పుడున్న ఏర్పాట్లలోని బలహీనతలను వారు గుర్తించాలని రాజీవ్ కుమార్ అన్నారు. మోసపూరిత లావాదేవీలలో ఇమిడి ఉన్న మొత్తం ముందు ఊహించిన దానికన్నా పెరగవచ్చని పి.ఎన్.బి సోమవారం పొద్దు పోయాకు వెల్లడించింది. నగల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన సహచరులు మోసపూరితంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)లు సేకరించి, వాటిని విదే శాల్లోని భారతీయ బ్యాంకుల శాఖల్లో సమర్పించి నగదు దోచుకున్నట్లు పి.ఎన్.బి ఫిబ్రవరి 14న కనుగొంది.

అవశేష శుద్ధి ప్రాజెక్టు ఆరంభం

CPCL

చెన్నై: ఇండియన్ ఆయిల్ గ్రూప్ కంపెనీ చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సి.పి.సి.ఎల్)కు చెందిన రూ. 3,110 కోట్ల అవశేష ఉన్నతి ప్రాజెక్టును కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారంనాడు లాంఛనంగా ప్రారంభించారు. నగరానికి సమీపంలోని మనలి రిఫైనరీలో విలువను జోడించుకునే కార్యక్రమానికి చెన్నై కేంద్రంగా ఉన్న సి.పి.సి.ఎల్ శ్రీకారం చుట్టింది. కోకింగ్ ప్రక్రియలో జాప్యం చేయడం ద్వారా డీజిలు, నాఫ్తా, ఎల్.పి.జి వంటి హెచ్చు విలువ కలిగిన ద్రవాల అవశేషాలకు విలువను జోడించి ఉన్నత పరచే పనిని కంపెనీ రూ. 3,110 కోట్ల పెట్టుబడితో ప్రారంభించింది. కంపెనీ అధికారులు చెప్పినదాని ప్రకారం, ఈ ప్రాజెక్టు ఇంధన ఆయిలు ఉత్పత్తిని తగ్గిస్తుంది. క్రూడ్ మిక్స్‌లో సల్ఫర్ శాతం అధికంగా ఉన్న క్రూడ్ ఆయిలు ప్రాసెసింగ్‌ను పెంచుతుంది. ఫలితంగా, 'ఫీడ్' వ్యయం తగ్గుతుంది. అవశేష అప్‌గ్రెడేషన్ ప్రాజెక్టును కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం జాతికి అంకితమిచ్చారు. చెన్నై సమీపంలోని మనలి వద్ద నాగపట్టణం సమీపంలోని పనన్‌గుడి వద్ద చెన్నై పెట్రోలియం కార్పొరేషన్‌కి రిఫైనరీలు ఉన్నాయి. ఈ రెండింటికి కలిపి 11.5 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక శుద్ధి సామర్థ్యం ఉంది. దిగువ వర్గ పరిశ్రమలకు ఫీడ్ స్టాక్‌లు సరఫరా చేస్తూ తమిళ నాడు పారిశ్రామిక అభివృద్ధిలో ఈ సదుపాయాలు క్రియాశీల పాత్ర వహిస్తున్నాయి.

సౌర విద్యుదుత్పాదనకు సవాళ్ళ సెగ



న్యూఢిల్లీ: సౌర విద్యుదుత్పాదన కేంద్రాల ఏర్పాటు 2018లో 22 శాతం (దాదాపు 7.5 గిగావాట్లు) మందగించవచ్చని మెర్కామ్ క్యాపిటల్ గ్రూపునకు అనుబంధ సంస్థ అయిన మెర్కామ్ కమ్యూనికేషన్స్ ఇండియా అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సౌర విద్యుదుత్పాదన కేంద్రాల ఏర్పాటు 22 శాతం తగ్గవచ్చని ఆ సంస్థ అంచనా వేసింది. ''గత ఏడాది చాలా పటిష్టమైన స్థితిని చూసిన ఈ రంగం ఈ ఏడాది అస్థిర పరిస్థితులతో తల్లడిల్లుతోంది. సేఫ్‌గార్డ్, యాంటి–డంపింగ్, పోర్ట్ అనే మూడు రకాల సుంకాలతో పరిశ్రమ సతమతమవుతోంది. ఈ సుంకాలకన్నా కూడా అస్థిరత పరిశ్రమను ఎక్కువ బాధిస్తోంది. కొత్తగా ఏ సంస్థ వస్తోంది, ఈ పరిశ్రమ నుంచి ఏ సంస్థ నిష్క్రమించింది తెలియడం చాలా కష్టంగా పరిణమించింది'' అని మెర్కామ్ క్యాపిటల్ గ్రూప్ సి.ఇ.ఓ, సహ–స్థాపకుడు రాజ్ ప్రభు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదుపరుల సానుకూల సెంటిమెంట్ ఇలాగే కొనసాగేట్లు చేయడానికి ప్రభుత్వ సంస్థలు సత్వరం ముందుకు వచ్చి ఈ సమస్యలను పరిష్కరించవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ''2016లో జోడైన 4,313 మెగావాట్లకన్నా 123 శాతం ఎక్కువగా నేడు మొత్తం సౌర విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. దేశంలో మొత్తం మీద సౌర సామర్థ్యం 2017 డిసెంబరు 31 నాటికి 19.6 గిగావాట్లు ఉండేట్లుగా అది తోడ్పడింది'' అని మెర్కామ్ నివేదిక వెల్లడించింది. గత ఏడా ది నెలకొన్న సౌర విద్యుదుత్పాదన కేంద్రాల్లో 90 శాతం గుత్తగా ఏర్పడ్డవి ఉన్నాయి. మిగిలిన 10 శాతం ఇళ్ళ పైకప్పుల పైన ఏర్పాటు చేసుకున్నవని మెర్కామ్ తెలిపింది. సుమారు 10.6 గిగావాట్ల భారీ స్థాయి సౌర ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 4.3 గిగావాట్ల టెండర్ల వేలంపాట 2017 డిసెంబరు 31 నాటికి పెండింగ్‌లో ఉంది.

ఏసీసీ విలీనంపై నిర్ణయం వాయిదా



ముంబయి: హోల్డింగ్ కంపెనీ అంబుజ సిమెంట్‌లో ఏసీసీని విలీనం చేయాలన్న పథకాలను కంపెనీ డైరెక్టర్ల బోర్డు పక్కన పెట్టింది. అంబుజ సిమెంటు ద్వారా ఏసీసీలో స్విట్జర్లాండ్‌కు చెందిన సిమెంటు దిగ్గజం లాఫార్జ్‌హోల్‌సిమ్ మెజారిటీ వాటా కలిగి ఉంది. ఈ లిస్టెడ్ కంపెనీలు రెండింటినీ విలీనం చేయడం ద్వారా దానిలో తన హోల్డింగ్‌ను పటిష్టపరచుకోవాలని హోల్‌సిమ్ భావించింది. విలీన అంశాన్ని పరిశీలించేందుకు గత మే నెలలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఏసీసీ–అంబుజ సిమెంటు విలీనం అమలుకు కొన్ని ప్రతిబంధకాలున్నాయని, ప్రత్యేక కమిటీల సమగ్ర మదింపును ఆధారం చేసుకుని రెండు కంపెనీల బోర్డులు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు ఏసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అంతిమ లక్ష్యంలో మార్పు లేనప్పటికీ, విలీనంపై ప్రస్తుతానికి ముందుకు సాగకూడదని ఏసీసీ నిర్ణయించుకున్నట్లు ఆ ప్రకటన తెలిపింది. నిర్వహణాపరమైన సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఒక ఏర్పాటుకు ఆమోదం తెలుపాలని బోర్డు నిర్ణయించింది. ఈ ఏర్పాటు ప్రకారం, రెండు కంపెనీలకు అవసరమైన కొనుగోళ్ళు, సిమెంటు అమ్మకాలు, సర్వీసులపై అంబుజ సిమెంటు నిర్ణయాలు తీసుకుంటుంది. దీనికి సంబంధించి త్వరలో ఒక ప్రకటన విడుదల చేస్తామని కంపెనీ తెలిపింది.

'జనాభాలో 99 శాతానికి చేరువ అవుతాం'



బార్సిలోనా (స్పెయిన్): ఈ ఏడాది దీపావళి నాటికి దేశ జనాభాలో 99 శాతం మందికి సేవలందించాలని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. విస్తరణ పథకాలలో భాగంగా, శామ్‌సంగ్‌తో సహకారంతో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐయాట్) సర్వీసులు ప్రారంభించనున్నట్లు జియో ప్రకటించింది. ఇది వినియోగదార్లకు, వ్యాపార సంస్థలకు రెండింటికీ సహాయపడుతుందని చెబుతున్నారు. ''మేం ప్రతి నెల దాదాపు 8000 నుంచి 10,000 టవర్లను నెలకొల్పుతున్నాం'' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ అధ్యక్షుడు జ్యోతీంద్ర ఠక్కర్ చెప్పారు. సెప్టెంబరు లేదా అక్టోబరు (దీపావళి) నాటికి 99 శాతం మందికి సేవలందించే స్థితికి కంపెనీ చేరుతుందని ఆయన ఆశాభావంతో ఉన్నారు. ప్రస్తుతం కంపెనీకి 16 కోట్ల పెయిడ్ కస్టమర్లు ఉన్నారు. ''మేం గత ఏడాది 170 రోజుల్లో సుమారు 10 కోట్ల మంది కస్టమర్లను కూడగట్టుకుంటామని చెప్పాం. అది అసాధారణమైనది. ఉచితం నుంచి పెయిడ్ కస్టమర్లుగా మార్చుకోవడంలో మా సామర్థ్యాన్ని జనం నిజంగానే సందేహించారు. కానీ, మేం బదలాయించగలిగాం. చరిత్రలోనే అతి పెద్ద సంఖ్యలో వాడకందార్లు ఉచితం నుంచి చెల్లింపు సర్వీసులకు మారారు. మా నెట్‌వర్క్ కార్యకలాపాలు ప్రారంభించిన 16 నెలల లోపలే 16 కోట్ల మంది పెయిడ్ సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుంది'' అని రిలయన్స్ జియో టెక్నాలజీ విభాగ సీనియర్ ఉపాధ్యక్షుడు తారిక్ అమీన్ చెప్పారు.

ఐయాట్ సర్వీసుల ద్వారా రవాణా, వాతావరణ అంచనా, వ్యవసాయ రంగాలతో పనిచేయాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఐయాట్‌పై మూడవ పక్ష డెవలపర్లతో కలసి పనిచేసేందుకు ఉన్న అవకాశాన్ని కూడా అది అన్వేషిస్తోంది. ఐయాట్ ఎప్పటి నుంచి మొదలవగలదనే ప్రశ్నకు, కంపెనీ మొత్తం ఆవరణ వ్యవస్థను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని అమీన్ జవాబిచ్చారు. ఒక నగరం తర్వాత మరో నగరంలా కాకుండా, అఖిల భారత స్థాయిలో ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. నెట్‌వర్క్ సంసిద్ధత కోసం ఎదురు చూడడం లేదని, ఐయాట్ ప్లాట్‌ఫాం పరిణతి కోసం ఎదురుచూస్తున్నామని ఆయన చెప్పారు. ఎల్‌టీఈలో జియో కవరేజి 2జి కవరేజీని మించుతుందని, ప్రతి వ్యక్తి, ప్రతి గ్రామం అనుసంధానమయ్యేట్లు చూస్తామని అమీన్ చెప్పారు.

ఇండియా నంబర్ వన్

మొబైల్ ఇంటర్‌నెట్ వ్యాప్తిలో భారత్ ప్రపంచంలో 154వ స్థానంలో, డాటా వినియోగంలో నంబర్ వన్ స్థానంలో ఉంది. ప్రపంచంలో అతి పెద్ద డాటా, వీడియో వినిమయ నెట్‌వర్క్‌లు కలిగి ఉన్నామని భావిస్తున్నామని మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2018ని ఉద్దేశించి అమీన్ అన్నారు. ముంబయిలో ఇప్పటికే ఐయాట్ సర్వీసులు పరిచయం చేసిన జియో ఇన్ఫోకామ్ వాటిని అఖిల భారత స్థాయిలోకి తీసుకురావాలని భావిస్తోంది. దేశవ్యాప్త ఐయాట్ నెట్‌వర్క్ నెలకొల్పేందుకు కలసి పనిచేస్తామని జియో ఇన్ఫోకామ్, శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సోమవారం ప్రకటించాయి.

'రుణం తప్పక తీరుస్తాం'



న్యూఢిల్లీ: రుణం విషయంలో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ)ని మోసగించిన కేసులో కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) దర్యాప్తును ఎదుర్కొంటున్న శింభౌలి షుగర్స్ రుణదాతలందరినీ సంప్రదించిన మీదట ''రానున్న కాలంలో'' ఓబీసీ రుణాన్ని మొత్తం తీర్చడానికే కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. అది ఈ సంగతిని సోమవారం రాత్రి పొద్దుపోయాక స్టాక్ ఎక్ఛ్సేంజీలకు తెలియజేసింది. రూ. 97.85 కోట్ల మేర బ్యాంకును మోసగించిన కేసులో కంపెనీ చైర్మన్ గుర్మీత్ సింగ్ మాన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గుర్పాల్ సింగ్, ఇతరులపై సి.బి.ఐ కేసు నమోదు చేసింది. తీసుకున్న రుణాన్ని తిరిగి సక్రమంగానే కడుతూ వచ్చామని, చక్కెర పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితుల వల్ల కొన్ని వాయిదా మొత్తాలు కట్టలేకపోయామని కంపెనీ తెలిపింది. శింభౌలి షుగర్స్‌కు రుణాలిచ్చిన కన్సార్టియంలో ఓబీసీ కూడా ఉంది. కంపెనీకి వ్యతిరేకంగా ఓబీసీ ఇటీవల మోస పరిశీలన నివేదికను దాఖలు చేసి, దాన్ని దర్యాప్తు సంస్థల పరిశీలనకు పంపింది. ''దర్యాప్తు సంస్థలకు అవసరమైన వివరణలు, వివరాలు ఇచ్చే పనిలో మేనేజ్‌మెంట్ ఉంది. దర్యాప్తునకు సహకరించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. మిగిలిన బ్యాంకులతో కూడా సంప్రదించి ఓబీసీ రుణాన్ని రానున్న రోజుల్లో తీర్చేస్తాం'' అని కంపెనీ స్టాక్ ఎక్ఛ్సేంజీలకు తెలిపింది.



ఇంటర్ బైపీసీ విద్యార్థుల్లో చాలామందికి వైద్యవిద్య చదవాలనేది ఒక స్వప్నం. కానీ విపరీతమైన పోటీ, పరిమితంగా ఉన్న మెడికల్ సీట్లు వారి ఆకాంక్షల మీద నీళ్లు జల్లుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో విదేశీ వైద్యవిద్య ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా స్థిరపడింది!

విదేశాల్లో వైద్యవిద్య



విదేశాల్లో ఫలిస్తున్న ఎంబీబీఎస్ కల!



స్వదేశంలో మెడికల్ సీట్లు పరిమితంగా ఉండి, ప్రవేశాలకు భారీ పోటీ ఉన్న నేపథ్యంలో విదేశీ వైద్యవిద్య సులువైన ప్రత్యామ్నాయంగా మారింది. ఎందుకంటే ప్రవేశపరీక్ష రాయనక్కర్లేదు. డొనేషన్లు కట్టాల్సిన అవసరమూ లేదు. ఫీజు, ఇతర ఖర్చులతో 15- 30 లక్షల రూపాయిల్లోపు వెచ్చించగలిగితే చాలు. ఈ మార్గం ఎంచుకునే విద్యార్థులు ఏయే విషయాలు గమనించాలి? ఎలా ముందడుగు వేయాలి? మనదేశంలో వైద్యవిద్య చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్న ప్రతి విద్యార్థికీ అది తీరే అవకాశం లేదు. బీఏ, బీకాం, బీఎస్సీ.. దేనిలో చేరాలన్నా సీటు దొరుకుతుందిబీ అందుబాటులోనే కళాశాలలుంటాయి. ఇంజినీర్ అవ్వాలంటే సొంత జిల్లా కూడా దాటక్కర్లేదు. కానీ ఇంటర్మీడియట్ జీవశాస్త్రంలో 99 శాతం మార్కులు వచ్చినా వైద్యవిద్య అర్హత పరీక్షకు సిద్ధమై, భారీ పోటీని ఎదుర్కోవాల్సిందే. నిన్నటిదాకా ఎంసెట్... ఇప్పుడు నీట్! ఇంటర్ బైపీసీలో 90 శాతం దాటిన విద్యార్థి కూడా నీట్‌లో కనీసం అర్హత కూడా సాధించలేకపోయినవారు లక్షల్లో ఉన్నారు. మెడికల్ సీట్లు బాగా తక్కువ ఉండటం వల్ల భారీ వడపోత అనివార్యమైపోయింది. ఎంతో మంచి ర్యాంకు రానపుడు యాజమాన్య కోటాకు తగ్గ ఆర్థిక స్థితి లేనపుడు వైద్యవిద్యపై ఆశలు వదిలేసుకోవాల్సివచ్చేది. ఈ పరిస్థితుల్లోనే విదేశీ వైద్యవిశ్వవిద్యాలయాలు మధ్యతరగతి విద్యార్థులకు భరోసాగా నిలిచాయి. ప్రవేశాల కోసం వారిని సాదరంగా ఆహ్వానిస్తూ వస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంచుకుంటున్న దేశాల్లో జార్జియా, ఫిలిప్పీన్స్, చైనా, కిర్గిస్థాన్, ఉక్రెయిన్, రష్యా, మధ్య అమెరికా ఖండాల్లోని కొన్ని దేశాలు, కరేబియన్ దీవులు ముఖ్యమైనవి. వాటిలో మౌలిక సదుపాయాల్లూ, బోధనా ప్రమాణాలూ సంతృప్తికరంగా ఉంటున్నాయని అక్కడ చదువుతున్న విద్యార్థులు చెపుతున్నారు. విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించడం కోసం చాలా సంవత్సరాల నుంచి మన విద్యార్థులు వెళ్తున్నారు. కాలక్రమంలో విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించేవారిలో నాణ్యతా ప్రమాణాల కోసం కఠినమైన నిబంధనలను భారత వైద్యమండలి (ఎంసీఐ) తీసుకువచ్చింది. ముఖ్యంగా.. కోర్సు పూర్తిచేసి, స్వదేశంలో ప్రాక్టీస్ చేయాలంటే ఎఫ్.ఎం.జి.ఇ. (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్)ను తప్పనిసరి చేసింది. దీన్నే స్క్రీనింగ్ టెస్టుగా వ్యవహరిస్తున్నారు. కోర్సు ఆరంభం నుంచీ ఈ పరీక్షపై అవగాహన పెంచుకుంటే ఈ పరీక్షలో నెగ్గటం కష్టమేమీ కాదనేది విజేతలైన విద్యార్థుల అనుభవం.

ఎంబీబీఎస్ సీటు సాధించేదెలా!




ఇంటర్ తర్వాత వైద్యవిద్యలో ప్రవేశించి డాక్టర్ కావాలనుకునే విద్యార్థులకు నేడున్న పోటీ పరీక్షలు మూడు మాత్రమే. వాటిలో నీట్ పూర్తయింది. ఇక మిగిలినవి ఎయిమ్స్, జిప్‌మర్. వీటికి సమగ్రంగా, సమర్థంగా సిద్ధమయ్యేందుకు మెలకువలు... ఇవి. ఎయిమ్స్, జిప్‌మర్ రెండూ ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న సంస్థలు. సంబంధిత సంస్థల్లో ఎంబీబీఎస్ ప్రవేశానికి వారే వేర్వేరుగా ప్రవేశపరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సంస్థలు ఉన్నాయి. ఎయిమ్స్- ఢిల్లీ, భోపాల్, భువనేశ్వర్, జోధ్‌పుర్, పట్నా, రాయ్‌పూర్, రిషికేష్. మొదటి నుంచీ మనదేశంలో వైద్య విభాగంలో ప్రాముఖ్యమున్న సంస్థ ఎయిమ్స్. నేటికి కూడా విద్యార్థులు అధిక ప్రాధాన్యమిచ్చే సంస్థ ఎయిమ్స్-న్యూదిల్లీ మాత్రమే. దానిలో సీటు సాధించిన విద్యార్థి మిగిలిన ఏ సంస్థలోనూ ఎంబీబీఎస్ చేయడానికి ఇష్టపడరు. మిగిలిన ఎయిమ్స్‌లన్నీ నూతనంగా ప్రారంభమయ్యాయి. కాబట్టి ఎక్కువమంది విద్యార్థులు వాటికంటే మన ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.



విదేశీ వైద్యవిద్యలో చేరటానికి ప్రవేశపరీక్షలు రాయనక్కర్లేదుబీ డొనేషన్లు కట్టాల్సిన అవసరం లేదు. ఫీజు, ఇతర ఖర్చులతో రూ. 20- 30 లక్షల్లోపు వెచ్చించి విద్యాభ్యాసం పూర్తిచేసుకుని ఎంబీబీఎస్ పట్టా పొందవచ్చు. తిరిగి వచ్చి స్వదేశంలో వైద్యసేవలను అందించవచ్చు!

ఈ వెసులుబాటు కారణంగా ఇంతవరకూ మధ్యతరగతి విద్యార్థులు మాత్రమే దీనిపై ఆసక్తి చూపేవారు. ఈ ఏడాది నుంచి మేనేజ్‌మెంట్ సీట్లు నీట్ ద్వారా మాత్రమే భర్తీ అయ్యే అవకాశం ఉండడంతో ఆర్థికంగా మెరుగ్గా ఉన్నవారు సైతం విదేశీ వైద్యవిద్యపై దృష్టిపెడుతున్నారు.



ఇలా సన్నద్ధం కావాలి

ఈ ఏడాది ఎంసెట్, నీట్ ఫలితాలు ఆలస్యం కావడంతో చివరి నిమిషంలో 'సీటు వచ్చే ర్యాంకు' రాకపోయే పరిస్థితి కొందరికి ఉండవచ్చు. ఇలాంటివారిలో ఆసక్తి ఉన్నవారు విదేశాల్లో సీటును ముందుగానే ఖాయం చేసుకుంటే మంచిది. కళాశాల నుంచి నేరుగా కానీ, అధీకృత సంస్థల (ఏజెంట్లు) నుంచి కానీ ప్రవేశపత్రాన్ని పొందాలి.

ఎంబీబీఎస్ చదవాలనుకునే భారతీయ విద్యార్థులను అనేక దేశాల కళాశాలలు సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంచుకుంటున్న దేశాల్లో జార్జియా, ఫిలిప్పీన్స్, చైనా, కిర్గిస్థాన్, ఉక్రెయిన్, రష్యా, సెంట్రల్ అమెరికా ఖండాల్లోని కొన్ని దేశాలు, కరీబియన్ దీవులు ప్రధానమైనవి.

విద్యార్థులు తాము ఎంచుకునే దేశాల, విద్యాసంస్థల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితుల పట్ల అవగాహన అవసరం. వాతావరణ పరిస్థితులూ తెలుసుకోవాలి. కళాశాలల అధికారిక వెబ్‌సైట్లను శోధించి, ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్యసంస్థ వైద్య నిఘంటువులో ఉన్న కళాశాలను ఎంపిక చేసుకోవాలి. అయితే, కొన్ని దేశాల్లో ఆ నిఘంటువులో ఉన్న అన్ని కళాశాలలూ గుర్తింపు ఉన్నట్టుగా భావించకూడదు. అది నిర్ధారించుకోవడానికి ఎంసీఐ తన వెబ్‌సైట్‌లో ఆ దేశం గురించి కానీ, ఆ కళాశాల గురించి కానీ ఏదైనా సమాచారం ఉంచిందేమో తెలుసుకోవాలి.

ఎంసీఐ సరికొత్త నిబంధన

విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఎంసీఐ ఇటీవల 'అర్హత పత్రం' (ఎలిజిబిలిటీ సర్టిఫికెట్) ప్రవేశపెట్టింది. అంటే వారు ఎంపిక చేసుకున్న కళాశాలకు గుర్తింపును నిర్ధారిస్తూ ఎంసీఐ అనుమతినిస్తుంది. ఆ అనుమతే అర్హత పత్రం. ఆవిధంగా ఎంపిక చేసుకున్న దేశాన్నీ, దానిలోని కళాశాల/ విశ్వవిద్యాలయం గుర్తింపునూ విద్యార్థికి వదిలేయకుండా ఎంసీఐ తన బాధ్యతగా తీసుకుందన్నమాట!

విద్యార్థి చేయాల్సిందల్లా తను వెళుతున్న కళాశాల/ విశ్వవిద్యాలయానికి సంబంధించి కొన్ని పత్రాలను (అడ్మిషన్ లెటర్‌తోపాటు ఇతర గుర్తింపు పత్రాలు) జతచేసి, ఎంసీఐ అనుమతి కోరుతూ దరఖాస్తును సమర్పించటమే. ప్రాథమిక సమాచారం సరిగా ఉంటే దరఖాస్తు తీసుకుని రశీదును ఇస్తారు.

వయసు, మార్కుల శాతం

విదేశాల్లో వైద్యవిద్యను అభ్యసించగోరే విద్యార్థి ఎంసీఐ పేర్కొన్న వయసు, మార్కుల నిబంధనలను తప్పక పాటించాలి. 1) ఈ ఏడాది విదేశీ వైద్యవిద్యలో చేరాలనుకునే విద్యార్థికి ఈ డిసెంబర్ 31 నాటికి 17 సంవత్సరాలు పూర్తికావాలి. 2) జీవశాస్త్రంలో ఇంటర్మీడియట్/ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైనవారు మాత్రమే అర్హులు. అందులో 50%కు తక్కువ కాకుండా మార్కులను సాధించాలి. ఎస్సీ, ఎస్టీ/ వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు 40% తెచ్చుకుంటే సరిపోతుంది. జీవశాస్త్ర, రసాయన, భౌతికశాస్త్రాల్లో వచ్చిన మార్కులను మాత్రమే పరిగణిస్తారు. ఆంగ్ల బోధనాంశం తప్పనిసరి.

ఎంసీఐ కచ్చితమైన నిబంధనలు



విదేశాల్లో పీజీ వైద్యవిద్య పట్ల ఎంసీఐ కచ్చితమైన నిబంధనలను సూచించింది. అమెరికా, బ్రిటన్, కెనడా, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా.. ఈ 5 దేశాలకు మాత్రమే వైద్యవిద్యను అభ్యసించడానికి అనుమతినిచ్చింది. ఈ దేశాలకు కాకుండా ఇతర దేశాలకు వైద్యవిద్యలో పీజీ కోసం వెళుతున్నవారు మనదేశంలో వైద్యవృత్తిని కొనసాగించడానికి అనర్హులు. అంతేకాకుండా ఈ దేశాల్లో పీజీ కోర్సుల కోసం చేరడం అంత తేలిక కాదు. అమెరికా వంటి దేశాల్లో పీజీ కోర్సు కోసం యూఎస్ఎంఎల్ఈ వంటి ప్రవేశపరీక్షను దశలవారీగా అధిగమించాల్సి ఉంటుంది.



వైద్యపట్టా కోసం... విదేశీ బాట!

చైనాలో ఏయే కళాశాలలను అనుమతిస్తున్నదీ భారతీయ వైద్యమండలి (ఎంసీఐ) స్పష్టం చేసింది. అంతేకాకుండా ఎంపిక చేసుకున్న దేశంలో మన దేశ ప్రభుత్వ ఎంబసీ కార్యాలయం ఉంటే, ఆ వెబ్‌సైట్‌లో దీని గురించిన సమాచారం ఏమైనా ఉందేమో చూసుకోవాలి. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల కారణంగా సదరు కళాశాల పట్ల వ్యతిరేక సమాచారం ఉంటే తెలుసుకుని నిర్ణయించుకోవాలి. విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించడం కోసం చాలా సంవత్సరాల నుంచి మన విద్యార్థులు వెళ్తున్నారు. అక్కడ వైద్యవిద్య పూర్తిచేసుకుని వచ్చిన వైద్యులను కానీ, చదువుతున్న విద్యార్థులను కానీ వ్యక్తిగతంగా సంప్రదించి నిర్ణయం తీసుకోవటం సముచితం. అప్పుడు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండదు. ముఖ్యంగా కళాశాల ఎంపికలో గుర్తింపు, ప్రమాణాలే ప్రాతిపదిక కావాలి. స్థానిక భాషలో బోధన నామమాత్రంగా ఉందా లేదా ఆంగ్లభాషా బోధనే నామమాత్రంగా ఉందా అన్న సందేహాలను వారినడిగి తెలుసుకోవాలి.

విశ్వవిద్యాలయంలో ఆయా కోర్సులకు ఫీజు ఎంతన్నది ముందుగా తెలుసుకోవాలి. సదరు విశ్వవిద్యాలయం వారి వెబ్‌సైట్‌లో అందుకు సంబంధించిన వివరాలను పొందుపరుస్తారు. కొన్ని దేశాల్లో మన ఎంబసీ వారు కూడా ఫీజుల సమాచారాన్ని విశ్వవిద్యాలయం నుంచి తీసుకుని వారి వెబ్‌సైట్‌లో ప్రస్ఫుటంగా తెలియజేస్తున్నారు. వాటిని పరిశీలించాలి. విద్యార్థి విదేశాలకు వెళుతున్నపుడు తన పాస్‌పోర్టు మీద ఏ రకమైన వీసా ఉందన్నది ముందుగా తెలుసుకోవాలి. చదువుకోవడానికి వెళుతున్నందువల్ల విద్యార్థి వీసా అని ఉండాలి.

పాస్‌పోర్టు ఎలా?

విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు ఉండాల్సిందే! పాస్‌పోర్టుకు కావాల్సిన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలి. స్టడీ సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల జాబితాతో కూడిన పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు వంటి నివాస ధ్రువపత్రం, జనన ధ్రువపత్రం (ఫారం 5)తో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఆన్ లైన్‌లోనే చేసుకుని, సూచించిన తేదీ, సమయానికి ఒరిజనల్ ధ్రువపత్రాలతో వ్యక్తిగతంగా హాజరు కావాలి.

అన్ని విధాలా!

కళాశాలను ఎంపిక చేసుకుని, ప్రవేశం పొంది, పాస్‌పోర్టు మీద స్టూడెంట్ వీసా స్టాంపింగ్‌ను కూడా పూర్తిచేసుకుని ప్రయాణానికి సిద్ధం కావాలి. కళాశాలలో ఫీజును డాలర్ల రూపంలో చెల్లించాలి. లేదా కళాశాల పేరుతో డీడీ రూపంలోనైనా చెల్లించవచ్చు. జార్జియా వంటి కొన్ని దేశాల విషయంలో ట్యూషన్ ఫీజును నేరుగా విద్యార్థి బ్యాంకు నుంచి విశ్వవిద్యాలయ అకౌంటుకు పంపాల్సి ఉంటుంది. ఆరోగ్య బీమా పాలసీని తీసుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరం. కొన్ని దేశాల్లో తప్పనిసరి కాకపోయినా తీసుకోవడం మంచిది. చివరగా అక్కడ వాతావరణానికి వీలుగా వైద్యులను సంప్రదించి ముందు జాగ్రత్తలు తీసుకోవడం మేలు. పూర్వవిద్యార్థుల పరిచయం: ఎంపిక చేసుకున్న కళాశాలలో ఇప్పటికే చదువుతున్న మెడికోలను కానీ, కోర్సు పూర్తిచేసుకున్న డాక్టర్లను కానీ సంప్రదిస్తే తగిన వివరాలు లభిస్తాయి. అక్కడి చదువు, ఆంగ్లమాధ్యమం, వాతావరణ పరిస్థితుల పట్ల విశ్వసనీయమైన అవగాహనకు ఇది తోడ్పడుతుంది.




బయోటెక్ పీజీ దారి



రానున్న కాలంలో బయోటెక్నాలజీ రంగం మనదేశంలో 10 లక్షల ఉద్యోగాలు, వాటికి సమానమైన ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) బయోటెక్నాలజీ ప్రవేశపరీక్ష ప్రకటన వచ్చేసింది. దేశం మొత్తంలో సుమారుగా 550 సీట్లున్నాయి. ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లోని పద్మావతి విశ్వవిద్యాలయం కూడా ఈ ప్రవేశపరీక్ష ఆధారంగా ఎంఎస్సీ బయోటెక్నాలజీ కోర్సులో ప్రవేశాన్ని కల్పిస్తోంది. బయాలజీ, టెక్నాలజీ కలగలిసిన పరిశోధనాత్మక విజ్ఞానశాస్త్రం- బయోటెక్నాలజీ. బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, జెనెటిక్స్, ఇమ్యునాలజీ, మైక్రోబయాలజీ, వైరాలజీ, ఇంజినీరింగ్ వంటివి కూడా అందులో భాగం.సృష్టికి ప్రతిసృష్టి చేయగలిగిన క్లోనింగ్, మానవ జీనోమ్ ప్రాజెక్టు, స్టెమ్‌సెల్ రిసర్చ్, జన్యుపరివర్తిత పంటలు.. ఇవన్నీ బయోటెక్‌కి సంబంధించినవే. కొన్ని విశ్వవిద్యాలయాలు ఎంఎస్సీ జనరల్ బయోటెక్నాలజీ కోర్సును, మరికొన్ని ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, మెడికల్ బయోటెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, న్యూరోసైన్స్, మాలిక్యులార్, హ్యూమన్ జెనెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ బయోటెక్నాలజీ మొదలైన వైవిధ్యమైన కోర్సులను అందిస్తున్నాయి. ఎంఎస్సీ మెడికల్ బయోటెక్నాలజీ, న్యూరోసైన్స్, మాలిక్యులార్, హ్యూమన్ జెనెటిక్స్ పూర్తిచేసిన వారు వైద్య కళాశాలలు, ఆస్పత్రులలోని ల్యాబ్‌లు, ఫార్మా సంస్థల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

ఎంఎస్సీ మెరైన్ బయోటెక్నాలజీ పూర్తిచేసినవారికి పెట్రో కెమికల్ ఇండస్ట్రీస్, జియోలాజికల్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో ఉపాధి లభిస్తుంది. జేఎన్‌యూ కంబైన్డ్ బయోటెక్నాలజీ పరీక్ష రాసేవారు ఏ సబ్జెక్టుకు అధిక ప్రాధాన్యముందో గుర్తించి, దానికి అనువర్తిత విధానంలో సన్నద్ధమవ్వాలి. ఈ ఏడాది ఈ ప్రవేశపరీక్షను డిసెంబరులో నిర్వహిస్తున్నారు. కాబట్టి, తుది సంవత్సరం చదువుతున్నవారు సంబంధిత సిలబస్‌కు ప్రణాళికబద్ధంగా టైంటేబుల్‌ను రూపొందించుకోవాలి. రోజుకు కనీసం ఆరు గంటలు కష్టపడి అధ్యయనం చేయాలి.



చేరేలోపు సంసిద్ధం కండి!

ఇంజినీరింగ్ ప్రవేశాల తరుణమిది. ర్యాంకు ఆధారంగా కళాశాలలో చేరి, తరగతులు మొదలయ్యేలోపు ఏమేం చేయాలి? ఇంటర్మీడియట్ పుస్తకాలను ఓ మూల పడేయాల్సిందేనా? లేదు. వాటిలోని కొన్ని పాఠ్యాంశాలు విద్యార్థులు చదవబోయే కోర్సుకు అనుసంధానంగా ఉంటాయి. వాటిని గుర్తించటం, పునశ్చరణ చేయటం చాలా ముఖ్యం. అలా చేస్తే చక్కని పునాది ఏర్పడుతుంది! ఇంజినీరింగ్ అనేది ప్రణాళికను పాటిస్తే పూలబాట. బంగారు భవితకు పునాది వేస్తుంది. లేకపోతే ముళ్లబాటలో ప్రయాణించడానికి సిద్ధమవ్వాలి. విద్యార్థి జీవితంలో మొదటి మలుపు ఇంటర్మీడియట్ అనుకుంటే, రెండో మలుపునకు శ్రీకారం ఎంసెట్ అని చెప్పవచ్చు. దేశంలో ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాలకు జరిగే ముఖ్యమైన ప్రవేశ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఆఖరిది ఎంసెట్ అని చెప్పవచ్చు. ఒక్కసారి ఎంసెట్ ప్రవేశ పరీక్ష ముగిసిన తరువాత చదువు రీత్యా ఏ వ్యాపకం ఉండదు. ఇంటర్మీడియట్ చదువు ముగింపు, డిగ్రీ చదువు ఆరంభానికీ మధ్య ఉన్న ఈ సంధికాలాన్ని తొలి 'నిరుద్యోగ స్థితి'గా చెప్పుకోవచ్చునేమో. ఈకాలంలోనే విద్యార్థులు తమ మీద ఉన్న ఒత్తిడి పూర్తిగా తగ్గిపోయి మానసికంగా, భౌతికంగా విశ్రాంతిని ఆస్వాదిస్తూ గడిపేస్తుంటారు. రాసిన ఒక్కొక్క ప్రవేశ పరీక్షల ఫలితాలు వెలువడుతుంటే మళ్ళీ స్తబ్దత నుంచి తేరుకుని చైతన్యం వైపు అడుగులు వేయడం మొదలుపెడతారు. నచ్చిన కాలేజీలో, ఇష్టమైన ఇంజినీరింగ్ బ్రాంచిలో ప్రవేశం పొందే దిశగా ప్రయాణం మొదలుపెడతారు.

మనం స్పోర్ట్స్
బుధవారం 28 ఫిబ్రవరి 2018
www.manamnews.com

మిథాలీ రాజ్‌కు పగ్గాలు

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: వచ్చే నెల్లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో ఆడే భారత మహిళా జట్టుకు హైదరాబాద్ స్టార్ మిథాలీ రాజ్ సారథ్యం వహిస్తుంది. వడోదరలో మార్చి 12 నుంచి 18 వరకు ఈ మూడు వన్డేల సిరీస్‌లో ఆడే 15 మంది సభ్యుల భారత మహిళా క్రికెటర్ల బృందాన్ని సెలెక్టర్లు ప్రకటించారు. ఐసిసి ఉమెన్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత్ - ఆస్ట్రేలియా మహిళా జట్ల మధ్య ఈ మూడు వన్డేల సిరీస్ జరుగుతుందని బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియా టూర్‌లో అద్భుతంగా రాణించిన భారత మహిళల వన్డే జట్టు 2-1 తేడాతో సిరీస్ గెలుచుకుంది. హర్మన్ ప్రీత్‌కౌర్ సారథ్యంలోని టి 20 జట్టు 3-1 తేడాతో గెలిచి చరిత్ర సృష్టించి రెండు రోజుల క్రితమే స్వదేశానికి చేరుకుంది.

ఇక ఆస్ట్రేలియాతో జరిగే మూడు వన్డేల సిరీస్ అనంతరం టి20 ముక్కోణపు టోర్నీ కూడా ఉంటుందని ఈ టోర్నీకి జట్టును తర్వాత ప్రకటిస్తామని బిసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో తొలి వన్డే మార్చి 12న, రెండో వన్డే మార్చి 15, మూడో వన్డే మార్చి 18న జరుగుతాయి.



జులన్ గోస్వామి దూరం

మడమ గాయంతో బాధపడుతున్న పేస్ బౌలర్ జులన్ గోస్వామికిఈ జట్టులో చోటు దక్కలేదు. గోస్వామి స్థానంలో బెంగాల్ పేసర్ 24 ఏళ్ల సుకన్యా పరిడాకు సెలెక్టర్లు అవకాశమిచ్చారు. పోయినేడాది నవంబర్‌లో విజయవాడలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి వన్డే ఆడింది. కొలంబోలో జరిగిన వర ల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలోఆడిన భారత జట్టుకు సుకన్య ఎంపికైనప్పటికీ గాయం కారణంగా ఆడలేకపోయింది. ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ కప్ ఆడే జట్టుకూ గాయంతో దూరమైంది. ఆస్ట్రేలియాతో ఆడే భారత జట్టులో వికెట్ కీపర్ తానియా భాటియాకు చోటు దక్కలేదు. భాటియా స్థానంలో వికెట్ కీపర్ సుష్మా వర్మకు సెలెరక్టర్లు అవకాశమిచ్చారు.

మహిళల వన్డే జట్టు

మిథాలీ రాజ్ (కెప్టెన్), హర్మన్ ప్రీత్ కౌర్ (వైస్‌కెప్టెన్), స్మృతి మంధన, పూనమ్ రౌత్, జెమీమా రోడ్రిగ్వెజ్, వి.కృష్ణమూర్తి, మోనా శర్మ, సుష్మా వర్మ (వికెట్ కీపర్), ఎక్తా బిస్త్, శిఖా పాండే, సుకన్యా పరిడా, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ.

రాహుల్ ద్రవిడ్ పీఎం కావాలి

ట్విట్టరాటీల అభిమతం



న్యూఢిల్లీ: జూనియర్ టీమిండియా కోచ్ రాహుల్ ద్రవిడ్ ప్రవర్తన ఎంతో మంది హృదయాలను దోచుకుంది. ఆయన నిస్వార్థమైన ప్రవర్తనకు ట్విట్టరాటీలు కూడా అచ్చెరువొందారు. ఈ నెల ఆరంభంలో న్యూజిలాండ్‌లో ఐసీసీ అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్ టైటిల్‌ను భారత యువ జట్టు గెలిచిన సంగతి తెలిసిందే. నాలుగోసారి భారత యువ జట్టు టైటిల్ గెలవడంతో కోచ్ ద్రవిడ్‌కు (రూ. 50 లక్షలు), జట్టు సభ్యులకు (రూ. 30 లక్షలు), కోచింగ్ స్టాఫ్‌కు (రూ. 20 లక్షలు) నగదు పురస్కారాన్ని బీసీసీఐ ప్రకటించింది. అయితే నగదు పురస్కారంలో అసమానతలను ద్రవిడ్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో ఈ అసమానతలను సరిచేస్తూ కోచ్‌తో సహా అందరికీ రూ. 25 లక్షలు ఇవ్వనున్నట్టు ఆదివారం బీసీసీఐ ప్రకటించింది. ద్రవిడ్ ప్రవర్తనపై ట్విట్టర్‌లో పెద్ద చర్చ జరిగింది. ద్రవిడ్‌ను ప్రధానిని చేస్తే బాగుంటుందని చాలా మంది తమ అభిమతాన్ని తెలిపారు. ఎవరేమన్నారో ఓసారి చూద్దాం...

దయచేసి ద్రవిడ్‌ను ప్రధాని పదవికి ఎంపిక చేస్తారా? ఇది వినడానికి చాలా సిల్లీగా అనిపించొచ్చు. కానీ ఇండియాకు ఇటువంటి వ్యక్తి అవసరం చాలా అవసరం. ఈయన తన కంటే ఇతరు గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. ఒక వ్యక్తి నుంచి ఏవైనా నేర్చుకోవచ్చు.. కానీ ఇతరులను గౌరవించడం, దయాగుణం వంటివి పుట్టుకతోనే వస్తాయి' - విశాల్ డడ్లాని

'రాహుల్ ద్రవిడ్‌ను పీఎంను చేయాలి.. ప్లీజ్' - సౌవిక్ చక్రవర్తి

'రాహుల్ ద్రవిడ్‌లో ప్రధాని అయ్యే సామర్థ్యం ఉంది' - మానవ్

'రాహుల్ ద్రవిడ్‌ను ప్రధానిని చేస్తామని హామీ ఇచ్చే ఏ పార్టీకైనా నేను ఓటు వేస్తాను' - భవిక్

'ఎలా చేశామన్నది ముఖ్యం కాదు.. కానీ రాహుల్ ద్రవిడ్ భారత్ ప్రధాని కావాలని కోరుకుంటున్నాను' - చిరాగ్ జైన్

'ఈ దేశాన్ని రాహుల్ ద్రవిడ్ నడిపించాలి' - ఎన్‌వైఎన్

'2024 నాటికి రాహుల్ ద్రవిడ్‌ను ప్రధానిని చేయాలి' - ద్వారిక యునియాల్

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలోనూ... కోహ్లీ సేన గెలుస్తుంది

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ



న్యూఢిల్లీ: సౌతాఫ్రికా పర్యటన తర్వాత టీమిండియా మరో రెండు కఠిన పరీక్షలను ఎదుర్కోనుంది. ఐపీఎల్ తర్వాత ముందుగా ఇంగ్లండ్, ఏడాది చివర్లో ఆస్ట్రేలియా పర్యటనలకు వెళ్లనుంది. అయితే సౌతాఫ్రికా టూర్‌లో మాదిరిగానే ఈ పర్యటనల్లోనూ కోహ్లీ సేన గెలుస్తుందని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ధీమా వ్యక్తం చేస్తున్నారు. సౌతాఫ్రికా పర్యటనలో 1-2తో టెస్టు సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా తొలిసారి వన్డే, టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. ఈ విజయంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా కీలకపాత్ర పోషించారు. గతంలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా వెళ్లినప్పుడు ఎంఎస్ ధోనీ నేతృత్వంలోని జట్టు టెస్టుల్లో 1-3తో ఇంగ్లండ్ చేతిలో, 0-2తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. కానీ ఆ తర్వాత విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా ఓ కొత్త శకాన్ని ప్రారంభించింది. కెప్టెన్ స్వయంగా ముందుండి జట్టును నడిపించాడు. 'బ్యాటింగ్‌ను అతను (కోహ్లీ) నూతనమైన ఉన్నత శిఖరాలకు చేర్చాడు. దీంతో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లోనూ మెన్ ఇన్ బ్లూ సత్తా చాటుతారన్న నమ్మకముంది. పర్యాటక జట్లు గెలవడమే అంతిమ లక్ష్యంగా పెట్టుకునే ఆ రెండు దేశాల్లో టీమిండియా సిరీస్ గెలుస్తుందని భావిస్తున్నాను. భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా మాత్రమే ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అంతేకాకుండా టీమిండియా భావి బౌలర్లుగా ఎదిగారు' అని ఓ ఆంగ్ల దినపత్రికకు రాసిన కాలమ్‌లో గంగూలీ పేర్కొన్నారు.

టెస్టు సిరీస్‌లో ఓటమిపాలైనప్పటికీ అనూహ్యంగా వన్డే సిరీస్‌లో పుంజుకున్న టీమిండియాను గంగూలీ ప్రశంసించారు. 2003 వరల్డ్ కప్‌లో టీమిండియాకు గంగూలీ నేతృత్వం వహించాడు. కేప్‌టౌన్‌లో జరిగిన మూడో టెస్టులో టీమిండియా అనూహ్యంగా పుంజుకుని గెలవడం, అదే మైదానంలో జరిగిన చివరి టీ20లో 172 పరుగుల లక్ష్యాన్ని నిలబెట్టుకోవడం గంగూలీని ప్రధానంగా ఆకట్టుకుంది. 'టోర్నీ ఆరంభం లో కష్టాలు ఎదురైనా చివరికి తలెత్తుకునే ప్రదర్శనతో టీమిండియా తిరిగొచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. తొలి టెస్టును ఎక్కడైతే ఓడారో అదే వేదిక కేప్‌టౌన్‌లో చివరి టీ20 (సిరీస్) గెలిచిన ఘనత కోహ్లీ సేనదే. వన్డే సిరీస్‌లోనూ అసాధారణ ప్రతిభ కనబరిచారు. అయితే విరాట్ కోహ్లీ లేకుండానే చివరి టీ20 మ్యాచ్ గెలవడం గమనించదగ్గ విషయం. టీ20ల్లో 172 పరుగులు పెద్ద లక్ష్యమేమీ కాదు. కానీ టీమిండియా దాన్ని నిలబెట్ట కోవడం గొప్ప విషయం. ఆ మ్యాచ్‌లో టీమిండియా కేవలం 7 పరుగులతో గెలిచివుండొచ్చు. కానీ సౌతాఫ్రికా తన ఆటను ఇంకా మెరుగు పరచుకోవాలి. ఈ పర్యటన ఆద్యంతం సత్తా చాటిన వ్యక్తి విరాట్ కోహ్లీ. బ్యాటింగ్‌లో మాత్రమే కాకుండా స్ఫూర్తిదాయక కెప్టెన్సీలో ముఖ్యంగా వాండరర్స్‌లో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి ఓ ప్రతిభ తాము బలవంతులమని, ఉత్తమ ఆటగాళ్లమని జట్టు సభ్యుల్లో ఒక బలమైన నమ్మకాన్ని నింపుతుంది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 40 పరుగులే చేశాడు. కానీ మ్యాచ్ ఆద్యంతం అతని సాహసం, బాడీ లాంగ్వేజ్ పర్యటనలోని మిగిలిన మ్యాచ్‌లపై ప్రభావం చూపింది' అని 113 టెస్టులు, 311 వన్డేలు ఆడిన గంగూలీ చెప్పారు.



చాహల్, యాదవ్ మరిన్ని విజయాలు అందిస్తారు: గవాస్కర్

మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్‌లు మున్ముందుకు టీమిండియాకు మరిన్ని విజయాలు కట్టబెడతారని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అన్నారు. లక్ష్యాన్ని ఛేదించడంలో టీమిండియా 80 శాతం సామర్థ్యాన్ని మాత్రమే ప్రదర్శిస్తోందని.. వీలైనంత త్వరగా 100 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. 'ఇలాంటి ప్రతిభను సౌతాఫ్రికా పర్యటనలో ముఖ్యంగా నిర్ణీత ఓవర్ల క్రికెట్‌లో మనం చూశాం. ఈ సిరీస్‌లో టీమిండియా కలిసి కట్టుగా రాణించింది. అన్ని విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరించింది. జట్టుకు అవసరమైనప్పుడు జట్టులోని ఎవరో ఒకరు అండగా నిలిచి ప్రత్యర్థిని ఓడించారు. ప్రత్యర్థి ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ బౌలర్లు ప్రొటీస్‌ను దెబ్బ తీశారు. చివరి వరకు అదే జోరు కొనసాగింది. ఓపెనింగ్ బౌలింగ్‌ను ఎలాగోలా ఆడితే మిడిల్ ఓవర్లలో స్పిన్ బౌలింగ్‌లో పరుగులు రాబట్టొచ్చులే అని ప్రొటీస్ భావించారు. కానీ వారి అభిప్రాయం తప్పని మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ నిరూపించారు. అంతేకాకుండా ప్రొటీస్ స్కూల్ గేమ్ క్రికెటర్లలా అయిపోయారు. వీరిద్దరూ ప్రత్యర్థిని మభ్యపెట్టే తమ బౌలింగ్‌తో మున్ముందు టీమిండియాకు వైట్ బాల్‌తోనే కాదు.. రెడ్ బాల్‌తోనూ గెలిపించగలరు' అని సునీల్ గవాస్కర్.

కామన్‌వెల్త్ గేమ్స్ నా టార్గెట్: ప్రణయ్



న్యూఢిల్లీ : ఏప్రిల్‌లో జరిగే కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటేందుకు ఉత్సాహంతో ఉన్నాడు భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్రణయ్. మార్చిలో ప్రారంభమయ్యే ఆలింగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆడి తన ఆటను మరింత మెరుగుపచుకోవాలని అనుకుంటున్నాడు. హైదరాబాద్‌లో ముగిసిన జాతీయ శిక్షణ శిబిరంలో పాల్గొన్నాక మళ్లీ అంతర్జాతీయ పోటీల కోసం ప్రణయ్ ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. అంతర్జాతీయ టోర్నీలు, కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించేందుకు ఆల్‌ఇంగ్లండ్ టోర్నీని ఉపయోగించుకుంటానని చెబుతున్నాడు. అంతర్జాతీయ పోటీల కోసం అద్భుతంగా శిక్షణ తీసుకున్నానని, అయితే శిక్షణ వేరు, ప్రాక్టీస్ మ్యాచ్‌లు వేరని ప్రణయ్ చెబుతున్నాడు. కామన్‌వెల్త్ క్రీడల కంటేముందు మరిన్ని టోర్నమెంట్‌లు, మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరముందని తెలిపాడు. 2016 సౌతాసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న భారత జట్టు సభ్యుడైన ప్రణయ్, అదే పోటీల్లో వ్యక్తిగత విభాగంలోనూ రజతం సాధించాడు. ఆ తర్వాతజరిగిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలుచుకున్నాడు. నిరుడు యుఎస్‌ఓపెన్ టైటిల్ గెలుచుకుని సింగిల్స్ ర్యాంకుల్లో టాప్ టెన్‌లోకి ఎగబాకాడు. నవంబర్‌లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో వరల్డ్ నంబర్ టూ ఆటగాడు కిడాంబి శ్రీకాంత్‌ను ఓడించినప్పకి ఇంకా ఎంతో నేర్చుకోవాల్సిన అవసరముందని చెప్పాడు. వచ్చే కామన్‌వెల్త్ క్రీడల్లో భారత ఆశాకిరణంగా మారిన ప్రణయ్ డబుల్స్,మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ల విభాగంలోనే పతకం ఆశలు పెంచుతున్నాడు.

విజయ్ హజారే విజేత కర్ణాటక

సౌరాష్ట్రపై 41 పరుగుల తేడాతో గెలుపు
సచిన్ రికార్డు బ్రేక్ చేసిన అగర్వాల్

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక జట్టు గెలుచుకుంది. ఢిల్లీ ఫిరోజ్ షాకోట్లా మైదానంలో జరిగిన ఫైనల్లో కర్ణాటక జట్టు 41 పరుగుల తేడాతో సౌరాష్ట్రను ఓడించింది. కర్ణాటక జట్టు ఐదేళ్లలో ఈ టోర్నీ టైటిల్ గెలుచుకోవటం ఇది మూడో సారి. మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక 45.5 ఓవర్లలో253 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 46.3 ఓవర్లలో 212 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది.254 పరుగుల లక్ష్యాన్ని సాధించేందుకు బరిలో దిగిన సౌరాష్ట్ర జట్టులో కెప్టెన్ పుజారా 94 పరుగులు చేసి బాధ్యతాయుతంగా ఆడాడు. మొత్తం 127 బంతులు ఆడిన పుజారా 10 ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌ను లీడ్ చేశాడు. పుజారాకు తోడుగా వికెట్ కీపర్ బరోత్ 30, జాని 22, మక్వానా 20 రన్స్ చేసినా సరైన భాగస్వామ్యం లేక సౌరాష్ట్ర జట్టు 46.5 ఓవర్ల వద్ద ఆలౌట్ అయింది. కర్ణాకట బౌలర్లలో కృష్ణ మూడు, గౌతమ్ మూడు వికెట్లు పడగొట్టి సౌరాష్ట్ర వెన్నువిరిచారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టులో ఓపెనర్ అగర్వాల్ చెలరేగి ఆడి90 రన్స్ చేశాడు. సమ్రత్ 48, దేశ్ పాండే 49, గోపాల్ 31 రన్స్ చేసి రాణించారు. ఐదు పరుగులకే రెండు వికెట్లు నష్టపోయినప్పటికీ సమ్రత్‌తో కలసి ఆగర్వాల్ రెండో వికెట్‌కు 141 రన్స్ పార్ట్‌నర్‌షిప్ అందించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ సిరీస్ మొత్తంలో అద్భుతంగా రాణించిన కర్ణాటక ఓపెనర్ అగర్వాల్ ఏ కేటగిరిలో 737 రన్స్ చేసి అత్యతధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగా రిక్కార్డు సృష్టించాడు. గతంలో క్రికెట్ లెజెండ్ సచిన పేరిట ఈ రికార్డు ఉండేది. 2003 ప్రపంచ కప్‌లో సచిన్ చేసిన673 పరుగులను దాటేశాడు. అంతే కాక దేశవాళీ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. గతంలో శ్రేయాస్ అయ్యర్ 2015-16 డొమెస్టిక్ సిరీస్‌లో 1967 పరుగులు చేయగా.. . ఈ సీజన్‌లో 2101 పరుగులు చేశారు.



వెస్టిండీస్‌కు క్రిస్ గేల్ సహాయం

హరారే: వెస్టిండీస్ జట్టును వచ్చే ఏడాది వరల్డ్ కప్‌కు చేర్చేందుకు క్రిస్ గేల్, మార్లన్ సామ్యూల్స్ నడుం బిగించారు. త్వరలో జింబాబ్వేలో జరగనున్న 2019 వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో వెస్టిండీస్ జట్టుకు ఆడేందుకు వీరిద్దరూ తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 8లోపు ర్యాంక్‌లో లేకపోవడంతో ఇంగ్లండ్‌లో జరగనున్న ఐసీసీ వరల్డ్ కప్‌కు ఆటోమేటిక్ అర్హతను వెస్టిండీస్ జట్టు కోల్పోయింది. దీంతో మిగిలిన రెండు స్థానాల కోసం ఇప్పుడు వెస్టిండీస్ జట్టు క్వాలిఫయింగ్ టోర్నీలో చిన్న జట్లతో తపడాల్సి వచ్చింది. అయితే పాకిస్థాన్ టీ20 సూపర్ లీగ్‌లో పాల్గొనే నిమిత్తం బ్రావో, నరైన్, రస్సెల్ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీకి దూరమయ్యారు.

కొత్త నిబంధనలతో చిక్కులే

బ్యాడ్మింటన్ కోచ్‌ల అసంతృప్తి



న్యూఢిల్లీ : అంతర్జాతీయ బ్యాడింటన్ సమాఖ్య ప్రవేశపెట్టనున్న కొత్త నిబంధనల ఆంతర్యం అర్థం కావడం లేద ని పలువురు కోచ్‌లు అభిప్రాయపడుతున్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో ఇప్పటి దాకా ఉన్న స్కోరింగ్ సిస్టమ్‌తో పాటు, మ్యాచ్ జరుగుతున్నప్పుడు ఇచ్చేఆటగాళ్లకు శిక్షణ సమయాన్ని తగ్గించాలన్న బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ నిర్ణయంపై భారత జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, కెన్నెత్ జాన్సెన్‌లు అసంతృప్తితో ఉన్నారు. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో కోచ్‌లు ఆటగాళ్లకుశిక్షణ ఇచ్చే సమయాన్ని ఇక నుంచి తగ్గించాలని ఫెడరేషన్ నిర్ణయించింది. దీంతో పాటు మూడు గేమ్‌ల ఫార్మాట్‌కు బదులుగా.. బెస్టాఫ్ ఫైవ్ మ్యాచ్ ఫార్మాట్‌ను కూడా ప్రవేశపెట్టనుంది. దీని కోసం పాయింట్ల విధానాన్ని కూడా మార్చనుంది. కొత్త రూల్ ప్రకారం ఇక నుంచి 21 పాయింట్లకు బదులుగా 11 పాయింట్లకు ఒక్కో గేమ్ ఉంటుంది. మే నెలలో జరిగనున్న బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఆమోదించి అమలు చేయానున్నారు.



'వాళ్లు' మార్చాలనుకున్న నిబంధనలు నాకు పూర్తిగా తెలియదు, ఇంకా నేను వివరంగా తెలుసుకోవాలి' అని గోపీచంద్ అన్నాడు. గతంలో ఆన్ కోర్ట్ కోచింగ్‌కు సమయం కావాలని చెప్పింది వాళ్లేనని, ఇప్పుడు మళ్లా ఆ సమయాన్ని తగ్గించాలనుకుంటున్నారని, దీని వెనుక లాజిక్ ఏమిటో తెలియదని గోపీచంద్ చెప్పాడు. ఆన్ కోర్ట్ కోచింగ్ బ్యాడ్మింటన్ క్రీడకు ప్రత్యేక్యమెందని డెన్మార్క్ స్టార్ కోచ్ కెన్నెత్ జాన్సన్ అన్నాడు. బ్యాడ్మింటన్ ఫెడరేషన్ నిర్ణయంపై ఎవరూ అభ్యంతరం చెప్పరని, ఆటగాళ్ల సొంతంగా తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ఆన్ కోర్ట్ కోచింగ్ సమయాన్ని తగ్గించాలని నిర్ణయించి ఉండచ్చని జాన్సన్ తెలిపాడు. అయితే ఇది మాత్రమే కారణం అయి ఉండకపోవచ్చనీ చ్చన్నాడు.

ఇక బ్యాడ్మింటన్ ఫెడరేషన్ నిర్ణయాలను మాజీ కోచ్‌లు విమల్‌కుమార్, సయ్యద్ మహ్మద్ ఆరిఫ్‌లు స్వాగతించారు. ఈ నిర్ణయాలు ఆటగాళ్లకు మరింత బలాన్నిస్తాయని అన్నారు. 'ఆటగాళ్లు మానసికంగా, శారీకరంగా బలపడేందుకు, మ్యాచ్‌పై సొంత నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నిబంధనలు ఉపయోగపడతాయి' అని విమల్ కుమార్ అన్నాడు. మ్యాచ్ విరామ సమయంలో ఆటగాళ్లతో మాట్లాడేందుకు కోచ్‌లకు అవకాశమివ్వాలని, అయితే ఆట జరుగుతున్నప్పుడు మధ్యలో జోక్యం చేసుకోవటం ఆటగాళ్ల సత్తాకు పరీక్షే అవుతుందని చెప్పాడు. మరో కోచ్ ఆరిఫ్ కూడా విమల్ కుమార్ అభిప్రాయంతో ఏకీభించాడు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆటగాళ్లు సొంత నిర్ణయాలు తీసుకుంటే నే ఉపయోగముంటుంది' అని ఆరిఫ్ అన్నాడు.

ఇక 21 పాయింట్ల ఫార్మాట్‌కు బదులుగా ఒక్కో గేమ్‌ను 11 పాయింట్లకు మార్చాలన్న నిర్ణయం కొంత మంది ప్లేయర్లకు ఉపయోగపడితే, మరికొంత మందికి నష్టం ఉంటుందని గోపీచంద్ అభిప్రాయపడ్డాడు. 21 పాయంట్ల గేమ్ ఫార్మాట్ విజయవంతమైందని, చాలా దేశాల్లో ఆదరణ పొందినప్పుడు నిబంధనలు మార్చాల్సిన అవసరమేముందని ప్రశ్నించాడు. అయితే ఈ కొత్త స్కోరింగ్ విధానం పైజాన్నన సానుకూలతను ప్రకటించాడు. ఇక ఇదో స్టుపిడ్ నిర్ణయమని విమల్ కుమార్ అన్నాడు. వచ్చే నెల్లో జరిగే ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి సర్వీస్ రూల్‌ను కూడా మార్చాలని బ్యాడ్మింటన్ ఫెడరేషన్ నిర్ణయించింది. మే 19న బ్యాంకాక్‌లో జరిగే వార్షిక సర్వ సభ్య సమావేశానికల్లా ప్రతిపాదిత మార్పులపై అభిప్రాయాలను తెలిపాలని బ్యాడ్మింటన్ సమాఖ్య కోరింది. సభ్యదేశాలకు మార్చి 30లోగా కొత్త నిబంధనలను అందచేయనుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.